PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 287 | విజయవాడ, బుధవారం 21 మే 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Wednesday 21 May 2025 | Rs

ఇజ్రాయిల్ దాడుల్లో మరో 73 మంది మృతి
- ఖండించిన పశ్చిమ దేశాలు
- మృతుల్లో మహిళలు, చిన్నారులే అధికం

7

అహ్మదాబాద్‌లో ఐపిఎల్ ఫైనల్
- ముల్లన్‌పూర్‌లో క్వాలిఫయర్1, ఎలిమినేటర్
- సన్‌రైజర్స్, ఆర్‌సిబి మ్యాచ్ వేదిక మార్పు

8

తొలి రోజు ‘ఉక్కు’ సమ్మె సక్సెస్

- ఉత్పత్తి విభాగాలపై తీవ్ర ప్రభావం • నిర్బంధ చర్యలకు దిగిన ప్రభుత్వం
- అరెస్టులను అడ్డుకున్న కార్మికులు
- మద్దతుగా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ర్యాలీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగాకాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మె తొలిరోజు విజయవంతమైంది. కాంట్రాక్టు కార్మికులకు ప్లాంటు పర్మినెంట్ ఉద్యోగులు మద్దతు తెలిపారు. ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్బంధ చర్యలు చేపట్టినప్పటికీ కార్మికులు ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. మంగళవారం ఉదయం ఆరు గంటలకు ప్రారంభం కావాల్సిన ‘ఏ’ షిఫ్ట్‌కు కార్మికులను విధులకు హాజరయ్యేలా చూడటానికి యాజమాన్యం అనేక విధాలుగా ప్రయత్నించింది. అయితే, ఈ ప్రయత్నాలు ఫలితం ఇవ్వలేదు. షిఫ్ట్ ప్రారంభం అయినా, పెద్ద సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు విధులకు దూరంగా ఉండిపోయారు. వీరికి మద్దతు తెలుపుతూ పర్మినెంట్ ఉద్యోగులు కూడా పలువురు తొలిరోజుల విధులను బహిష్కరించారు. ‘ఏ’ షిఫ్ట్‌లో 80 శాతానికి పైగా కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెలో భాగంగా విధులకు దూరంగా నిలిచినట్లు తెలిసింది. దీంతో ‘బి’ ‘సి’ షిఫ్ట్‌లలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఉదయం నుండి రాత్రి వరకు పెద్ద సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో పాల్గొనడం, వారికి మద్దతుగా పలువురు పర్మినెంట్ ఉద్యోగులు నిలవడంతో ఉత్పత్తి విభాగాలపై తీవ్ర ప్రభావం పడింది. కీలకమైన విభాగాల్లో నామమాత్రంగానే పనులు నడిచాయి. మరోవైపు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడం, పర్మినెంట్ కార్మికులపై, కార్మిక సంఘాల నాయకులపై సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసులతో కక్ష సాధింపు చర్యలకు దిగడం వంటి చర్యలకు వ్యతిరేకంగా కార్మికులు ఇచ్చిన నినాదాలు, చేసిన ప్రదర్శనలతో ఉక్కునగరం మారుమ్రోగింది. సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతుగా అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి విశాఖ పట్నంలో భారీ ర్యాలీ, సభను నిర్వహించింది.

సమ్మెకు మద్దతుగా విశాఖలో అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన ర్యాలీ

విధులు బహిష్కరించి ర్యాలీ నిర్వహిస్తున్న ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

తెల్లవారు జామునుండే నిర్బంధం

ఉక్కు కార్మిక సంఘాలపై ప్రభుత్వం మంగళవారం తెల్లవారు జామునుండే నిర్బంధానికి పాల్పడింది. పోలీసులు ఎక్కడికక్కడ భారీగా మోహరించారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ సహా ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు యు.సోమేష్, అప్పారావు, అప్పలరాజు, కె.వంశీ, బి.అప్పారావులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అక్రమ అరెస్టులకు దిగుతున్నా కాంట్రాక్టు కార్మికులు విధులను బహిష్కరించి స్టీల్‌ప్లాంట్ మిగతా 7లో

గాజాలో మారణకాండను ఆపాలి
- సిపిఎం పిలుపు

న్యూఢిల్లీ : గాజాలో ఇజ్రాయిల్ సుదీర్ఘకాలంగా, అత్యంత అమానుష రీతిలో కొనసాగిస్తున్న దాడుల పట్ల సిపిఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణమే ఈ దాడులకు ఇజ్రాయిల్ స్వస్తి చెప్పాలని, కాల్పుల విరమణను అమలు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ఏడాది కేవలం ఏప్రిల్ మాసంలోనే ఇజ్రాయిల్ సాగించిన వైమానిక, భూతల దాడుల్లో 2,037మంది పాలస్తీనియన్లు మరణించారు. గత రెండు రోజుల్లో 200మందికి పైగా పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయారు. 2023 అక్టోబరు 7 నుండి మొత్తంగా 53,384మంది పాలస్తీనియన్లు మరణించగా, వారిలో 94శాతం మంది సామాన్య పౌరులే. 51శాతం మంది చిన్నారులు, 16శాతం మంది మహిళలు కాగా, ఎనిమిది శాతంమంది వృద్ధులు న్నారు. రెండు మాసాలకు పైగా గాజా లోకి ఆహార ట్రక్కులు ప్రవేశించనీయకుండా ఆంక్షలు విధించిన ఇజ్రాయిల్ తాజాగా నామ మాత్రపు సాయాన్ని మాత్రమే లోపలకు అనుమతి స్తామని ప్రకటించింది. ఫలితంగా, గాజాలో దుర్భిక్ష పరిస్థితులు అత్యంత దారుణంగా వున్నాయి. అమెరికా మద్దతుతో జోరు పెంచుకుంటున్న ఇజ్రాయిల్, మొత్తంగా గాజా ప్రాంతాన్ని ఆక్రమించ కోవడం గురించి ఇప్పుడు మాట్లాడుతోంది. ఈ ఊచకోత దాడులను తక్షణమే ఆపాల్సిందిగా భారత ప్రభుత్వం ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలని సిపిఎం పొలిట్‌బ్యూరో కోరింది. యుద్ధ నేరాలకు, ఊచ కోతకు పాల్పడిన ఇజ్రాయిల్ నేతలను విచారిం చాల్సిందిగా కోరాలని పేర్కొంది. పాలస్తీనా ప్రజలకు సిపిఎం సంఘీభావాన్ని ప్రకటించింది. తూర్పు జెరూసలేం రాజధానిగా 1967ముందు నాటి సరిహద్దులతో పాలస్తీనా దేశం ఏర్పాటు చేయాలన్న న్యాయమైన డిమాండ్‌కు మద్దతునిస్తున్నట్లు పేర్కొంది.

నాలుగైదు రోజుల్లో కేరళకు రుతుపవనాలు

న్యూఢిల్లీ : మరో నాలుగైదు రోజుల్లో నైరుతి రుతుపవనాలు కేరళను తాకనున్నాయి. సాధారణంగా రుతు పవనాలు వచ్చే జూన్ 1వ తేదీ కన్నా చాలా ముందుగానే కేరళను చేరుకునే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) మంగళవారం పేర్కొంది. మరో నాలుగైదు రోజుల్లో రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. ఈ నెల 22 నాటికి కర్ణాటక తీరంలో అల్పపీడనం అభివృద్ధి చెందే అవకాశం ఉన్నందున కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలు రెడ్ అలర్ట్‌లో ఉన్నాయి. ఈ నెల 22 నాటికి అల్పపీడనంగా మారుతుందని, ఆ తరువాత మరింత తీవ్రమవుతుందని ఐఎండి పేర్కొంది. ఈ నెల 24 వరకూ ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కొంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర, బీహార్, జార్ఖండ్, మణిపూర్, మిజోరం, త్రిపురలలో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు కేరళలో ప్రవేశిస్తే... దేశమంతటా వర్షాలు ప్రారంభవుతాయి. జులై 8 నాటికి దేశమంతా విస్తరిస్తాయి. మళ్లీ వాయువ్య భారతదేశం నుంచి సెప్టెంబర్ 17తో రుతు పవనాల ఉపసంహరణ మొదలై అక్టోబర్ 15 నాటికి ముగుస్తుంది. రుతుపవనాలు ఈ నెల 27నాటికి కేరళను తాకే అవకాశం ఉందని గతంలో ఐఎండి అంచనా వేసిన సంగతి తెలిసిందే. ఊహించిన విధంగా రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తే.. 2009 మే 23 తర్వాత, రుతుపవనాలు భారత్‌లోకి అతిత్వరగా ప్రవేశించిన సంవత్సరంగా ఈ ఏడాది నిలుస్తుందని ఐఎండి పేర్కొంది. గతేడాది మే 30న, 2023లో జూన్ 8న, 2022లో మే 29న, 2021లో జూన్ 3న, 2020లో జూన్ 1న, 2019లో జూన్ 8న, 2018లో మే 29న రుతుపవనాలు కేరళలో ప్రవేశించాయి. ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షపాతం ఉంటుందని ఏప్రిల్‌లో ఐఎండి అంచనా వేసింది. ఎల్‌నినో పరిస్థితులు ఉండవని స్పష్టం చేసింది. ఎల్‌నినోతో భారత్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుంది.

రెండు రోజులపాటు వర్షాలు
- విపత్తుల నిర్వహణ సంస్థ

2

వేతన పెంపు .. రెగ్యులరైజేషన్ కోసం..
- 23 రోజులుగా సమ్మెలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు
- వినతులు ఇచ్చినా పట్టించుకోని ప్రభుత్వం

3

లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ధర్నాలు
- కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

2

జూన్ నుంచి షాపుల వద్దే రేషన్
- ఎండియు వాహనాలకు స్వస్తి • మంత్రివర్గ నిర్ణయం

కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ల(ఎండియు) ద్వారా రేషన్‌సరుకులు అందించే విధానానికి ముగింపు పలకాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన మంగళవారం జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో జూన్ ఒకటో తేదీ నుండి లబ్ధిదారులకు రేషన్ షాపుల వద్దే సరుకులు ఇవ్వనున్నారు. సమావేశం అనంతరం ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, సమాచార, పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి నిర్ణయాలను మీడియాకు వివరించారు. మనోహర్ మాట్లాడుతూ ఎండియు వాహనాల ద్వారా సరుకులను పంపిణీ చేసే విధానాన్ని నిలిపివేస్తున్నామని చెప్పారు. గతంలో మాదిరిగానే చౌక ధరల దుకాణాల ద్వారా నేరుగా సరుకులను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

అక్రమ రవాణాలో వాహనదారులు

ఎండియు ఆపరేటర్లు అధిక ధరలు వసూలు చేస్తున్నారని పెద్దఎత్తున ఫిర్యాదులు వచ్చినట్లు మనోహర్ చెప్పారు. ఈ వాహనాల వల్ల వినియోగదారులకు ఎటువంటి ప్రయోజనమూ లేదని ఆయన అన్నారు. బియ్యం అక్రమ రవాణాలో కూడా ఎండియు వాహనాల ఆపరేటర్లు భాగస్వాములయ్యారని, వారిపై రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 200 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సరుకులు ఇవ్వకుండానే మూడు రోజుల్లోనే 93శాతం రేషన్ పంపిణీ చేసినట్లు చూపిస్తున్నారని చెప్పారు. ఒక్కో వాహనానికి సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ నుంచి రూ.27వేలు చెల్లిస్తున్నామని తెలిపారు. 65 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులకు మాత్రం సరుకులను డోర్ డెలివరీ చేస్తామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి తదితర కార్పొరేషన్‌ల ద్వారా వాహనాలు పొందిన వారిలో వాహన ధరలో 10శాతం కట్టిన వారికి ఉచితంగా వీటిని అందిస్తామన్నారు. దీపం-2 పథకం కింద గ్యాస్ రాయితీ సొమ్మును ముందుగానే లబ్ధిదారుల ఖాతాలో జమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎస్ఐపిబి ప్రతిపాదనలకు ఆమోదం: పార్థసారధి

ఎటిసి టైర్స్, రామభద్ర ఇండస్ట్రీస్, విశాఖపట్నం వరుణ్ హాస్పిటాలిటీ కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహక ప్యాకేజ్‌లను అందించాలని రాష్ట్రపెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎస్‌పిబి)లో తీసుకున్న నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపినట్లు మంత్రి పార్థసారధి చెప్పారు. అదేవిధంగా ఎఎల్ఇపి ఇండియా పెట్టుబడులకు సంబంధించిన పనులను వేగవంతంగా ప్రారంభించేందుకు అవసరమైన భూముల కేటాయింపు, తదితర సౌకర్యాలను పొందేవిధంగా ఆమోదం నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఎపి లెదర్ అండ్ ఫుట్‌వేర్ (పాలసీ-4) 2024-30కు ఆమోదం తెలిపామన్నారు. భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి కోసం జివిఐఎఎల్‌కు 500 ఎకరాల భూమిని మిగతా 7లో

రేపు ఢిల్లీకి ముఖ్యమంత్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 22న ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన 23న పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్రానికి రావాల్సిన నిధులు, వివిధ ప్రాజెక్టుల గురించి చర్చించ నున్నారని సిఎంఒ అధికారులు వెల్లడించారు. అదే విధంగా రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి పలువురు పారిశ్రామికవేత్తల తోనూ సిఎం భేటీ కానున్నారు. ఈ నెల 24న ఉదయం 9:30 గంటలకు భారత్ మండపంలో జరిగే నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సిఎం చంద్రబాబు పాల్గొ నున్నారు. అదేరోజు రాత్రి తిరుగు ప్రయాణమై అమరావతికి చేరుకోనున్నారు. అలాగే ఈ నెల 21న చిత్తూరు జిల్లా, కుప్పంలో సిఎం చంద్రబాబు పర్యటిస్తారు. ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా బుధవారం మధ్యాహ్నం అమ్మవారిని కుటుంబ సభ్యులతో కలిసి సిఎం దర్శించుకుంటారు. అనంతరం సాయంత్రం అమరావతికి చేరుకుంటారు.

ప్రభుత్వంతో ఫలించిన చర్చలు
ఉపాధ్యాయ ఉద్యమ కార్యాచరణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వంతో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక చర్చలు ఫలించాయి. ఐక్యవేదిక లేవనెత్తిన పలు డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు.. ఐక్యవేదిక నాయకులతో మంగళవారం చర్చలు జరిపారు. ఈ చర్చలు సఫలం కావడంతో బుధవారం జరగాల్సిన డిఇఒ కార్యాలయాల ముట్టడి, శుక్రవారం జరగాల్సిన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం ముట్టడిని వాయిదా వేస్తున్నట్లు ఐక్యవేదిక ఒక ప్రకటన విడుదల చేసింది. ఎస్‌జిటిలకు మాన్యువల్ పద్ధతిలో బదిలీలు నిర్వహించేందుకు అంగీకారం తెలిపినట్లు ఐక్యవేదిక వెల్లడించింది. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 49 దాటితే రెండో సెక్షన్ ఏర్పాటు చేసేందుకు, ఉన్నత పాఠశాలల్లో నిర్వహించే ప్రాథమిక పాఠశాలలను విడిగా నిర్వహించేందుకు అంగీకరించినట్లు పేర్కొంది. ఫౌండేషన్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 20 దాటితే 2వ పోస్టు ఇచ్చేందుకు ఒప్పుకున్నట్లు తెలిపింది. వర్క్‌లోడ్ ఎక్కువయ్యే సందర్భంలో వర్క్ ఉన్న సబ్జెక్టులకు అవసరం మేరకు అకడమిక్ ఇన్‌స్ట్రక్చర్, సర్‌ప్లస్ ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తారని, ప్రస్తుత బదిలీల్లో బ్లాకింగ్ ఉండదని వివరించింది. మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో పిఎస్‌హెచ్‌ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పిస్తారని, రెండు సార్లు రీ అపోర్షన్మెంట్‌కు గురయ్యే ఉపాధ్యాయులకు 7 పాయింట్లు ఇస్తారని వెల్లడించింది. ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారానికి జూన్ నెలలో కమిటీ ఏర్పాటు చేసేందుకు అంగీకరించినట్లు తెలిపింది. బదిలీల అనంతరం ఎంఇఒ, ప్రధానోపాధ్యాయుల పరస్పర బదిలీపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొంది.

మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 120 దాటితే పిఎస్‌హెచ్‌ఎం అదనంగా కేటాయించేందుకు అంగీకరించినట్లు తెలిపింది. సమాంతర మాధ్యమం అంశం విద్యాశాఖ మంత్రితో చర్చించిన తరువాత నిర్ణయం ఉంటుందని వెల్లడించింది. ఈ చర్చల్లో ఐక్యవేదిక నాయకులు నక్కా వెంకటేశ్వర్లు, పి మనోహర్ కుమార్ (యుటిఎఫ్), సాయి శ్రీనివాస్, రఘునాథరెడ్డి (ఎస్‌టియు), జి హృదయరాజు, ఎస్ చిరంజీవి (ఎపిటిఎఫ్-1938), గిరి ప్రసాద్, కృష్ణయ్య (పిఆర్‌టియు), సిహెచ్ మంజుల (ఎపిటిఎఫ్-257) తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ కేసు నిందితులకు 3 వరకు రిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి లిక్కర్ కేసులో ఏడుగురు నిందితులకు ఎసిబి కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. గతంలో విధించిన రిమాండ్ మంగళవారంతో ముగియడంతో నిందితుల రిమాండ్ కాలాన్ని పొడిగింపునకు సిట్ అధికారులు కోరగా, పూర్వాపరాలను పరిశీలించిన కోర్టు ఈ కేసులో నిందితులుగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చాణక్య, పైలా దిలీప్, బాలజీ గోవిందప్ప, కృష్ణమోహన్‌రెడ్డి, ధనంజయరెడ్డి రిమాండ్‌ను జూన్ 3 వరకూ పొడిగిస్తూ ఆదేశాలిచ్చింది. విచారణలో భాగంగా ఈ కేసులో పురోగతికి సంబంధించి ఎటువంటి సమాచారం తెలియజేయడం లేదని నిందితుల తరపున న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కేసు పురోగతిని ఎప్పటికప్పుడు కోర్టుకు తెలియజేయాలని సిట్ అధికారులను ఆదేశించింది. రిమాండ్ పొడిగింపుతోపాటు దర్యాప్తు పురోగతికి సంబంధించిన వివరాలను లిఖిత పూర్వకంగా అందించాలని దర్యాప్తు అధికారిని ఎసిబి కోర్టు ఆదేశించింది. విచారణ సమయంలో తమ కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాల ని నిందితులు కోరగా, 30 నిమిషాల పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. అలాగే పోలీసుల అదుపులో ఉన్న ధనంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని వారం రోజులపాటు కస్టడీకి ఇవ్వాలంటూ సిట్ అధికారులు మరో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై కోర్టు బుధవారం విచారణ చేపట్టే అవకాశం ఉన్నట్లు ఎసిబి కోర్టు అధికారులు వెల్లడించారు.

బాలికలదే పైచేయి
- ఎపి ఐసెట్ - 2025 ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

ఫలితాల సిడిని విడుదల చేస్తున్న ఎయు విసి రాజశేఖర్ తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రాష్ట్ర వ్యాప్తంగా ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఎపి ఐసెట్ - 2025 ప్రవేశ పరీక్ష ఫలితాలు మంగళవారం వెలువడగా బాలికలు పైచేయి సాధించారు. ఫలితాలకు సంబంధించిన సిడిని విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ అకడమిక్ సెనేట్ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసెట్ చైర్మన్, ఎయు ఉపకులపతి ఆచార్య జిపి.రాజశేఖర్ విడుదల చేశారు. పరీక్ష ఫలితాలను cets.apsche.ap.gov.in/ICET వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009 నుంచి కూడా పొందవచ్చని ఆయన తెలిపారు. మన రాష్ట్రంలో 93, తెలంగాణలో ఒక సెంటర్‌లో నిర్వహించిన ఎపి ఐసెట్ ప్రవేశ పరీక్షకు 37,572 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా, 34,131 మంది హాజరయ్యారన్నారు. వారిలో 32,719 మంది ఉతీర్ణత సాధించారని తెలిపారు. పురుషుల విభాగంలో 15,863 మంది పరీక్షకు హాజరుకాగా 15,176 మంది, బాలికల విభాగంలో 18,268 మంది పరీక్షకు హాజరవ్వగా 17,543 మంది ఉత్తీర్ణత సాధించినట్టు పేర్కొన్నారు. ఈ ప్రవేశ పరీక్షలో 95.86 శాతం మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. పరీక్ష రాసిన వారిలో పురుషుల్లో 95.66 శాతం మంది, మహిళల్లో 96.03 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనంజయరావు, ఐసెట్ కన్వీనర్ ఆచార్య ఎం.శశి, సహ కన్వీనర్ ఆచార్య కె.రమాసుధ పాల్గొన్నారు.

ర్యాంకర్లు వీరే..

ఐసెట్ 2025 ప్రవేశ పరీక్షలో విశాఖ నగరానికి చెందిన ఎం.మనోజ్ ప్రథమ ర్యాంకును సాధించారు. వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన డి.సందీప్ రెడ్డి రెండో ర్యాంకు, ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన ఎస్.కృష్ణ సాయి మూడో ర్యాంకు, హైదరాబాద్‌కు చెందిన వి.సాయిరాం సాత్విక్ నాలుగో ర్యాంకు, గుంటూరుకు చెందిన ఆర్.మాధుర్య ఐదో ర్యాంకు సాధించారు.

ఐబి చీఫ్ తపన్‌కుమార్ పదవీకాలం పొడిగింపు

న్యూఢిల్లీ : ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి) చీఫ్ తపన్ కుమార్ డేకా పదవీకాలాన్ని కేంద్రం మరో ఏడాది పొడిగించింది. ఆయన పదవీకాలాన్ని పొడిగించడం వరుసగా ఇది రెండవసారి. ఐబి చీఫ్ పదవీకాలాన్ని జూన్ 2026 వరకు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు, ఏది ముందుగా వస్తే అప్పటి వరకు పొడిగించేందుకు ఆమోదం తెలిపినట్లు కేబినెట్ వ్యవహారాల కమిటీ మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. తపన్‌కుమార్ 1988 బ్యాచ్ హిమాచల్ ప్రదేశ్ కేడర్‌కు చెందిన ఐపిఎస్ అధికారి. 2022 జూన్‌లో ఐబి చీఫ్‌గా రెండేళ్ల కాలానికి నియమితులయ్యారు. అంతకుముందు రెండు దశాబ్దాలకు పైగా ఐబి ఆపరేషన్స్ వింగ్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2024 జూన్‌లో ఏడాదిపాటు ఆయన పదవీకాలాన్ని కేంద్రం పొడిగించింది.

5న విచారణకు హాజరుకండి
- కెసిఆర్‌కు పిసి ఘోష్ కమిషన్ నోటీసులు

కెసిఆర్ | హరీష్‌రావు | ఈటల రాజేందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలపై బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్‌కు జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ మంగళవారం నోటీసులు ఇచ్చింది. కెసిఆర్ హయాంలో నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావుకు, ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్‌కు కూడా కమిషన్ నోటీసులు జారీ చేసింది. కెసిఆర్ జూన్ 5న, హరీశ్‌రావు జూన్ 6న, ఈటల రాజేందర్ జూన్ 9న విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ జరిపేందుకు న్యాయ విచారణ కమిషన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో ఏర్పాటైన ఈ కమిషన్.. నిర్మాణం, నిర్వహణ, డిజైన్, క్వాలిటీకంట్రోల్, పే అండ్ అకౌంట్స్, నీటిపారుదల, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారించింది. విచారణలో.. సీనియర్ ఇంజనీర్లు, అధికారుల్లో ఎక్కువమంది గత ముఖ్యమంత్రి సమక్షంలో ఆయన ఆదేశాల మేరకే పలు నిర్ణయాలను అమలు చేశామని చెప్పారు. వాటిపై కెసిఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌ల అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలనే ఉద్దేశంతో వారికి కమిషన్ నోటీసులు జారీ చేసింది.

ఏజెన్సీ డిఎస్‌సిపై కేబినెట్‌లో చర్చ లేదు

- ఖండించిన ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఏజెన్సీ ప్రాంతాల్లో వందశాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టంపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రస్తావన చేయకపోవడం సరికాదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ వెల్లడించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోత రామారావు, కిల్లో సురేంద్ర మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజన సంక్షేమశాఖ సమీక్షలో మూడు ఆప్షన్లు పరిశీలిస్తున్నట్లు వార్తల్లో వచ్చిందని తెలిపారు. ఆదివాసులకు న్యాయం జరగాలంటే ఏజెన్సీ ప్రాంతంలో వందశాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. మిగిలిన ఆప్షన్లు అమలు చేస్తే ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల హామీ ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో వందశాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సీ పోస్టులు వాయిదా వేయాలని ఆదివాసులు ఆందోళన చేస్తున్నా చర్చ లేకపోవడం సరికాదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా నిరసనలు

- కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
- పోరాటాల ద్వారా హక్కులను సాధించుకుందాం : సంఘాల నాయకులు

కర్నూలు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు తెలిపారు. రైతుల పండించిన పంటకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పోరాటాల ద్వారా ఆ హక్కులను, చట్టాలను కాపాడుకుందామని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పలు జిల్లాల్లో జోరు వర్షంలోనూ నిరసనలు తెలిపారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం ఆర్‌టిసి బస్టాండ్ నుంచి గడియార స్తంభం సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడారు. లేబర్ కోడ్స్ అమలైతే ఇఎస్‌ఐ, పిఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యూటీ, నష్టపరిహారాలు వంటి సౌకర్యాలను కార్మికులు కోల్పోతారన్నారు. కార్మికుల హక్కులన్నీ రద్దవుతాయన్నారు. కాకినాడ జిల్లాలో కాకినాడ, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం, తాళ్లరేవు మండలాల్లో ధర్నాలు జరిగాయి. కర్నూలులో జిల్లా పరిషత్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్‌లో ఆందోళన చేపట్టారు. ఆయా మండల కేంద్రాల్లో ధర్నాలు చేపట్టి సచివాలయాల కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు.

అనకాపల్లిలోని ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఆర్‌టిసి డిపో, జివిఎంసి జోనల్ కార్యాలయ ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పరవాడ మండలం లంకెలపాలెం జంక్షన్‌లో రాస్తారోకో చేశారు. తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం, తిరుపతి వెటర్నరీ యూనివర్సిటీ వద్ద ఆందోళన చేశారు. విజయనగరం జిల్లా గజపతినగరంలో గాంధీ విగ్రహానికి వినతినిచ్చి నిరసన తెలిపారు. గుంటూరు జిల్లాలో ఎంటిఎంసి పరిధిలోని ప్రాతూరు రోడ్డు జాతీయ రహదారి వద్ద ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన చేశారు. తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద జోరు వర్షంలోనూ కార్మికులు నిరసన తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరం, తాడేపల్లిగూడెంలో పోలీస్ ఐల్యాండ్ వద్ద, తణుకు నరేంద్ర సెంటర్‌లో జోరు వర్షంలోనూ ప్లకార్డులు చేతబూని నిరసన తెలిపారు. ఉమ్మడి కడప, ఒంగోలు, అనంతపురం, శ్రీకాకుళంలో నిరసనలు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా, పల్నాడు, ఏలూరు జిల్లాలో నిరసనలు తెలిపారు.

గెలుపు కోసం దిగజారుడు రాజకీయాలు

- వైసిపి అధినేత వైఎస్ జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్థానిక ఉప ఎన్నికల్లో గెలుపునకు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని వైసిపి అధినేత వైఎస్ జగన్ విమర్శించారు. చంద్రబాబు పాలనలో రాజకీయాల నైతిక పతనం, యథేచ్ఛగా కేసులు, అరెస్టుల పర్వం కొనసాగుతోందన్నారు. అయితే కేసులు, జైళ్లకు భయపడాల్సిన పని లేదన్నారు. అలా నిర్భయంగా ఉన్నపుడే రాజకీయాల్లో కొనసాగగలమన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో 5 జిల్లాలకు చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో ఆయన మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని తెలిపారు. ఎక్కడా మెజార్టీ లేకపోయినా దిగజారి అధికారాన్ని హస్తగతం చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కోరం లేకుండా చేసి, పదవులు ప్రకటించుకుంటున్నారన్నారు. ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీ అమలు చేయలేదని, అందుకే ఆయనపై అంత తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. రాష్ట్రంలో తొలిసారి మ్యానుఫ్యాక్చర్ విట్నెస్‌ను చూస్తున్నామని తెలిపారు. ఇలాంటి ఒక తప్పుడు సంప్రదాయానికి చంద్రబాబు బీజం వేశారన్నారు. వైసిపికి కార్యకర్తలే ప్రథమ ప్రాధాన్యత అని చెప్పారు. ఇప్పుడు కష్టాలు స్వయంగా చూస్తున్నారని, ఎవరు అన్యాయం చేసినా పేరు రాసి పెట్టుకోవాలని సూచించారు. అది ఏ బుక్ అయినా సరే, వారి పేర్లు రాయాలని, వచ్చేది మన ప్రభుత్వమేనన్నారు. ఉద్యోగ విరమణ పొంది దేశాలు దాటిపోయినా లాక్కొస్తామన్నారు. సోషల్ మీడియా కార్యకర్త పాలేటి కృష్ణవేణి, సుధారాణిని నెలలు తరబడి పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పి బెయిల్ రాకుండా చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే వంశీపై 11 కేసులు పెట్టారని, ఒక దాంట్లో బెయిల్ వస్తే మరో కేసు నమోదు చేస్తూ 2 నెలలుగా జైల్లోనే ఉంచారన్నారు. మాజీ ఎంపి సురేష్‌ను ఇదే విధంగా జైలులో ఉంచారన్నారు. ఈ సమావేశంలో వైసిపి ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు, మున్సిపల్ ఛైర్‌పర్సన్‌లు, వైస్ ఛైర్‌పర్సన్‌లు, కౌన్సిలర్లు, ఎంపిటిసిలు, ఆయా జిల్లాల పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. కుండపోతగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. శ్రీకాకుళంలో పిడుగుపాటుకు గురై ఒకరు మృతి చెందగా.. ముగ్గురికి గాయాలయ్యాయి. గుంటూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం వేకువజామున 4 గంటల నుంచి 8 గంటల వరకు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. చేబ్రోలులో అత్యధికంగా 70 మిల్లీ మీటర్లు, దుగ్గిరాలలో 61.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. పల్నాడు జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరుగా వర్షం కురిసింది. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు భారీ వర్షం కురిసింది. గంటపాటు కురిసిన వర్షానికి రహదారులు జలమయం అయ్యారు. ట్రాఫిక్‌కు అంతాయం ఏర్పడింది. విశాఖ నగరంలో తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గెడ్డలు పొంగిపొర్లాయి. ఉదయానికి వర్షం తగ్గుముఖం పట్టినా ముసురు వాతావరణం కొనసాగింది. సీతమ్మధార, మహరాణిపేట, గోపాలపట్నం ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదైంది. శ్రీకాకుళంలోని నాగావళి నది సమీపంలో పిడుగుపాటుకు గురై బలగబూబమ్మ నగర్‌కు చెందిన గేదెల రాజారావు (55) మృతి చెందారు. ఆయన కుమారుడు నాగార్జున, బుచ్చిపేటకు చెందిన దేశెల్ల రాజారావు, భైరి రామారావులు గాయపడ్డారు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు వర్షం కురిసింది. వర్షం కారణంగా తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పశ్చిమగోదావరి జిల్లాలో సగటు వర్షపాతం 21 మిల్లీ మీటర్లుగా నమోదైంది. బాపట్ల జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మిర్చి, పొగాకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంటను నిల్వ చేసుకోవడానికి కూడా సరైన వసతి లేక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండు రోజులపాటు వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దక్షిణ కోస్తా, రాయలసీమ మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని, ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి కర్ణాటక వరకూ ద్రోణి విస్తరించి ఉన్నట్లు విపత్తల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజులు ఆకాశం మేఘావృతమై ఉండటంతోపాటు చెదురుమదురుగా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. పిడుగులతో కూడిన భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థలోని కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 1070, 112, 18004250101లను సంప్రదించాలన్నారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, కర్నూలు, వైఎస్‌ఆర్ కడప, తిరుపతి జిల్లాల్లో బుధవారం పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో గురువారం పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు.

'మద్యం'పై మాట్లాడొద్దు

- మంత్రులకు సిఎం దిశానిర్దేశం
- కేంద్రం నిధులిచ్చినప్పుడే 'అన్నదాతా...'
- 'తల్లికి వందనం' జూన్‌లోనే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గత ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై మంత్రులు ఎవరూ మాట్లాడవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లు తెలిసింది. మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం పలు అంశాలపై సహచర మంత్రులతో చర్చించారు. ఈ సందర్భంగా మద్యం కుంభకోణంపై విస్తృతంగా చర్చ జరిగినట్లు తెలిపింది. పలువురు మంత్రులు స్పందిస్తూ గత ప్రభుత్వంలోని అనేకమంది పెద్దలు ఇందులో ఉన్నారని వ్యాఖ్యానించారు. వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ సిట్ దర్యాప్తు సక్రమంగా సాగుతోందని, తప్పుచేసిన వారు బయటపడుతున్నారని వ్యాఖ్యానించారు. ఈ సమయంలో మనం అతిగా స్పందిస్తే తప్పుడు సంకేతాలు వెళ్తాయని, దర్యాప్తుపై కూడా ప్రభావం పడుతుందన్నారు.

అందుకే దీనిపై మంత్రులు మాట్లాడకుండా ఉండాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. తప్పు జరిగిన మాట వాస్తవమేనని, అందుకే సిట్ దర్యాప్తులో కూడా అనేక అంశాలు వెలుగుచూస్తున్నాయని ఆయన అన్నట్లు సమాచారం. ఈ సందర్భంగానే మద్యం, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, ఢిల్లీ యాత్ర, యోగా దినోత్సవం, సంక్షేమ క్యాలెండర్ వంటి అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు తెలిసింది. అన్నదాత సుఖీభవ పథకానికి కేంద్రం తన వాటా నిధులు ఎప్పుడు రైతుల ఖాతాల్లో వేస్తే అప్పుడే రాష్ట్ర నిధులను విడుదల చేయాలని సిఎం ఈ సందర్భంగా సూచించినట్లు సమాచారం. అలాగే మరో కీలక పథకం తల్లికి వందనంపైనా మంత్రులకు స్పష్టత ఇచ్చినట్లు తెలిసింది. జూన్‌లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో అప్పుడే ఈ పథకాన్ని అందించనున్నట్లు చంద్రబాబు చెప్పారు.

గ్యాస్ లబ్ధిదారుల ఇళ్లలో కాఫీ తాగండి...!

ఉచిత గ్యాస్‌పైనా ఆయన మంత్రులతో మాట్లాడారు. గ్యాస్ అందుకుంటున్న వారి అభిప్రాయాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలని మంత్రులకు సూచించారు. తన పర్యటనల్లో గ్యాస్ వాడుకుంటున్న వారి ఇళ్లకు వెళ్లి కాఫీ పెట్టించుకుని తాగానని, మంత్రులు కూడా అలా వెళ్తున్నారా అని ప్రశ్నించగా, వెళ్లలేదని మంత్రులు చెప్పినట్లు తెలిసింది. ఇకపై మంత్రులు గ్యాస్ సబ్సిడికూడా వెళ్లాలని చంద్రబాబు సూచించారు.

మళ్లీ సంక్షేమ క్యాలెండర్

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై క్యాలెండర్ విడుదల చేయాలని నిర్ణయించినట్లు మంత్రులకు చంద్రబాబు వివరించారు.

ఎప్పుడు ఎలా ఇవ్వాలన్నది నిర్దిష్టంగా త్వరలోనే చెబుతానని అన్నట్లు తెలిసింది. పెద్ద ఎత్తున చేస్తున్న సంక్షేమాన్ని ప్రజలకు వివరించేందుకు మంత్రులు చొరవ చూపించాలని సూచించారు. అలాగే వచ్చే నెల్లో నిర్వహించనున్న యోగా దినోత్సవంపైనా మంత్రులు కీలక దృష్టి పెట్టాలని నిర్దేశించారు. ప్రధానమంత్రి కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా 3 లక్షల ఎకరాలు ఫ్రీ హోల్డ్

- మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ హయాంలో 3 లక్షల ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా వారి అనుయాయులకు ఫ్రీ హోల్డ్ చేసినట్లు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈ భూములపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వెలగపూడిలోని సచివాలయంలో భూ పరిపాలనలో సంస్కరణలపై మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం భేటీ అయ్యింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన రెవెన్యూశాఖ మంత్రి మాట్లాడుతూ.. పేదలకు న్యాయం జరిగేలా ఫ్రీ హోల్డ్ భూములపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ భూములను 10 కేటగిరీలుగా విభజించి 8 కేటగిరీలకు మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపిందన్నారు. ఒకవేళ పేదల భూములను చట్టవిరుద్ధంగా ఫ్రీ హోల్డ్ చేసినప్పటికీ వాటిని తిరిగి తీసుకోబోమని, వాటిని మళ్లీ పేదలకే అసైన్ చేస్తామన్నారు. మళ్లీ 20 ఏళ్ల తరువాతే ఆ భూములను ఫ్రీ హోల్డ్ చేయబడతాయని చెప్పారు. 22ఎ నుంచి భూముల తొలగింపునకు సంబంధించి మంత్రవర్గ ఉపసంఘం ఇచ్చిన మార్గదర్శకాల మేరకు కలెక్టర్లు పని చేస్తున్నారా? అనే అంశాన్ని ఉపసంఘం చర్చించిందన్నారు. ఇక నుంచి కొత్త భూములు 22ఎలో పెట్టాలంటే ఎవరికీ అన్యాయం జరగకుండా ఒక విధానాన్ని రూపొందించామని, సిఎం చంద్రబాబు అనుమతి తీసుకున్న తరువాత దీన్ని అమల్లోకి తీసుకొస్తామన్నారు. నాలా రద్దుపైన కూలంకుషంగా చర్చించినట్లు చెప్పారు సూత్రప్రాయంగా సిఎం ప్రకటించినట్లు నాలా రద్దుకు ఆమోదం తెలిపారు. వాగులు, వంకలు, చెరువుల్లో కట్టడాలు నిర్మించి వర్షాలు, వరదలకు అవి మునిగిపోయే పరిస్థితి రానీయకుండా చూసేందుకు ఏఏ నిబంధనలు పెట్టాలనే దానిపై చర్చించారు. ఇక ఎప్పటి నుంచో సమస్యగా ఉన్న సాదాబైనామాలపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. సాదాబైనామాలను ల్యాండ్ రికార్డులుగా మార్చుకునేందుకు ఉన్న గడువును 2024 నుంచి 2027 వరకూ పొడిగించారు. ల్యాండ్ రికార్డులు ప్రక్షాళన చేసేందుకు రీ సర్వే సాగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మరోసారి సమావేశమైనప్పుడు భూ పరిపాలనలో ఇతర అంశాలకు సంబంధించి తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, పి నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎన్‌ఎండి ఫరూక్, టిజి భరత్ పాల్గొన్నారు.

కార్మికశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కె ధనలక్ష్మి, ఫెడరేషన్ నాయకులు

ఐఎల్‌టిడి యాజమాన్యంతో సంయుక్త సమావేశం

- కార్మికశాఖ కమిషనర్ శేషగిరిబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇండియన్ లీఫ్ టుబాకో డెవలప్‌మెంట్ డివిజన్ (ఐఎల్‌టిడి) కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యంతో సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని కార్మికశాఖ కమిషనర్ ఎం శేషగిరిబాబు హామీ ఇచ్చారు. ఎపి ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్‌టిడి కంపెనీ వర్కర్స్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి నేతృత్వంలో ఫెడరేషన్ నాయకులు విజయవాడలోని లేబర్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్‌ను మంగళవారం కలిసి పలు సమస్యలపై 1,050 మంది కార్మికుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ శేషగిరిబాబు మాట్లాడుతూ.. గుంటూరు జిల్లా కార్మికశాఖ సంయుక్త కమిషనర్‌కు వినతిపత్రాన్ని పంపిస్తామని, కార్మికుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. గతంలో ఐదేళ్లకు పైబడి చీరాల ఐఎల్‌టిడి కంపెనీలో క్యాజువల్స్‌గా పనిచేశారని, ఏడేళ్ల కిందట మేనేజ్‌మెంట్ నిలుపుదల చేయడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారని కమిషనరు దృష్టికి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి తీసుకొచ్చారు. అప్పుడు క్యాజువల్స్‌గా ఉండటంతో ఉపాధి కోల్పోయిన కార్మికులకు ఎలాంటి ఎక్స్‌గ్రేషియాను చెల్లించలేదన్నారు. 2025 ఏప్రిల్ 9 చీరాల బ్రాంచ్ లైన్2ను తిరిగి ప్రారంభించినప్పుడు ఉద్యోగ విరమణ, మరణించిన వారి స్థానంలో బదిలీ కార్మికులను క్లాస్ బి వర్కర్స్‌గా తీసుకోవాలని కోరగా యాజమాన్యం కొంత సమయం అడిగిందన్నారు. ఆ సమయం ముగిసినందున కార్మిక శాఖ జోక్యం చేసుకుని క్లాస్ బి వర్కర్స్‌గా నియమించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. క్యాజువల్స్‌ను క్లాస్ బి కార్మికులుగా మార్చడానికి, బదిలీ బోర్డు వేయడానికి యాజమాన్యంతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఆలస్యం జరిగే కొద్దీ కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. కార్మికశాఖ కమిషనర్‌ను కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి సుధాకర్, చీరాల బ్రాంచి అధ్యక్షులు బి పోతురాజు, అనపర్తి బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు కొట్టు సూర్యనారాయణ, శామ్యూల్ రాజ్, కోశాధికారి కాలేషా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మంజుధర్, ఉపాధ్యక్షులు కె పోతురాజు, కె ఏసురత్నం, ఎం వసంతరావు, చింతా శ్రీనివాస్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కె శ్రీనివాసరెడ్డి, బీమరాజు, పి నాగేశ్వరరావు, రాజమండ్రి బ్రాంచి నాయకులు జి రామచంద్రరావు, ఎన్ నాగరాజు పాల్గొన్నారు.

దేశ సార్వభౌమాధికారాన్ని అమెరికాకు ఫణంగా పెట్టిన మోడీ

- సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ అధికార ప్రతినిధి ప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

లదేశ సార్వభౌమాధికారాన్ని ప్రధాని మోడీ అమెరికాకు ఫణంగా పెట్టారని సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి ప్రసాద్ విమర్శించారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన నిరసన సభలో ఆయన మాట్లాడుతూ.. పహల్గామ్ ఉగ్రదాడిపై మోడీ సర్కార్ ఇంత వరకూ విచారణకు ఆదేశించకపోడం సరైన చర్య కాదన్నారు. దీనిని ఉగ్ర చర్యగా కాకుండా ముస్లింల నేరంగా మార్చడానికి బిజెపి సాగిస్తున్న ప్రచారం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఉగ్రవాదులు దేశ సరిహద్దులు దాటి 120 కిలోమీటర్ల లోపలకు ఎలా వచ్చారని ప్రశ్నించారు. ఈ సభకు రాష్ట్ర నాయకులు కె పోలారి అధ్యక్షత వహించగా, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, నగర కార్యదర్శి పి పద్మ తదితరులు ప్రసంగించారు.

నల్లబర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలని రాస్తారోకో

ప్రజాశక్తి-పర్చూరు (బాపట్ల జిల్లా)

నిరసననుద్దేశించి మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

గిట్టుబాటు ధర కల్పించి నల్లబర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బాపట్ల జిల్లా పర్చూరు, కారంచేడులో ఎపి రైతుసంఘం, కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. పర్చూరులోని స్థానిక బొమ్మల సెంటర్‌లో కొద్ది సేపు బస్సులను ఆపి నిరసన తెలిపారు. కంపెనీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య మాట్లాడుతూ.. పొగాకును కొనుగోలు చేస్తామని చెప్పి రైతులను మోసం చేసిన కంపెనీలపై కేసులు పెట్టాలన్నారు. పొగాకుతోపాటు మిర్చి, శనగ, మొక్కజొన్న పంటలకు కూడా గిట్టుబాటు ధర లేదని తెలిపారు. పొగాకు రైతు పరిస్థితి రోజురోజుకి దుర్భరంగా తయారవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లబర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలని కోరారు. పొగాకును కొనుగోలు చేయని పక్షంలో ఈ నెల 27న పొగాకు కంపెనీల ముందు ఆందోళన చేస్తామని, జూన్ 2న ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కారంచేడు మండల కార్యాలయం వద్ద ధర్నాలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పి.కొండయ్య మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి.. న్యాయం చేయాలని కోరారు. అనంతరం కారంచేడు తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు.

విశాఖ ఉక్కు కార్మికుల సమ్మెకు మద్దతు : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ ఉక్కు కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్లు సిపిఐ ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటు పరం కాకుండా కాపడుకోకుంటే ముఖ్యమంత్రి ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. ఉక్కు కార్మికుల సమ్మెను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి సమ్మెను నివారించాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ ప్రైవేటు పరం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. విశాఖ ఉక్కు కార్మికులకు మద్దతుగా ఈ నెల 21న విజయవాడ నగరంలో వాపమక్షాల ఆధ్వర్యాన నిర్వహించనున్న సంఘీంభావ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజానీకాన్ని కోరారు. సుదీర్ఘ ఆందోళన తరువాత సమ్మెలోకి వెళ్లే పరిస్థితి అటు కేంద్రం, ఇటు రాష్ట్రం కల్పిస్తుందని తెలిపారు. గత 8 నెలలుగా విశాఖ ఉక్కు కార్మికులకు జీతాలు ఇవ్వలేదని, దాదాపు 3 వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడం, మరో 2,600 మందిని తొలగించేందుకు చూస్తున్నారని, 1,400 మంది కార్మికులకు విఆర్‌ఎస్ ప్రకటించారన్నారు.

ఉద్యోగ భద్రత కోసం 102 ఉద్యోగుల ఆందోళన

- రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

అనకాపల్లిలో నిరసన ర్యాలీ చేపట్టిన తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు

తల్లీ బిడ్డల సంరక్షణ డ్రైవర్లు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ఆందోళనకు దిగారు. తల్లీబిడ్డల సంరక్షణ కోసం నిరంతరాయంగా శ్రమిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ధర్నాలు చేశారు. బకాయి వేతనాలు ఇవ్వాలని, ప్రమాదబీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, ఇఎస్‌ఐ, పిఎఫ్ వాటా యాజమాన్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందించారు.

అనకాపల్లి జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయం నుంచి నెహ్రూ చౌక్ జంక్షన్ వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. వారినుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ పదేళ్లుగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు కనీస వేతనాలకు నోచుకోలేదన్నారు. సమస్యల పరిష్కారం పట్ల అరబిందో యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. నాలుగు నెలలుగా జీతాల్లేక ఉద్యోగులందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అల్లూరి జిల్లా కలెక్టరేట్ గేట్ వద్ద నిరసన తెలిపి.. కలెక్టర్ దినేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఏలూరులో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా 102 ఉద్యోగల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పార్వతపురం మన్యం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్, ఎంప్లాయిస్ జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ మాట్లాడుతూ తల్లీ బిడ్డల సంరక్షణ డ్రైవర్లు తమ సమస్యలపై ఇప్పటికే అనేక దఫాలుగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసినా స్పందన లేదన్నారు. దీంతో తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ సర్వీసులను రాష్ట్ర వ్యాప్తంగా నిలిపివేసి తమ నిరసనను తెలియజేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 102 ఉద్యోగులకు ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలు, గుంటూరు, తిరుపతి, చిత్తూరు, తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించారు. బకాయి వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని నినదించారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రాలు అందించారు.

వంశీకి హైకోర్టులో ఊరట

ప్రజాశక్తి-అమరావతి

అక్రమ మైనింగ్‌లో అక్రమాలు జరిగాయని పేర్కొంటూ గన్నవరం పోలీసులు నమోదు చేసిన కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి హైకోర్టులో ఊరట లభించింది. వంశీని అదుపులోకి తీసుకునేందుకు కింది కోర్టు పిటి వారెంట్ జారీ చేస్తే, తదుపరి విచారణ వరకు దాని అమలుపై స్టే విధిస్తున్నట్లు తెలిపింది. తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదా వేస్తూ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గన్నవరం నియోజకవర్గ పరిధిలోని బాపులపాడు, గన్నవరం, విజయవాడ గ్రామీణ మండలాల పరిధిలో వల్లభనేని వంశీ, ఆయన అనుచరులు అక్రమంగా మైనింగ్ జరిపి ప్రభుత్వ ఖజానాకు రూ.195 కోట్లు నష్టం కలిగించారంటూ కృష్ణా జిల్లా గనులశాఖ అధికారి ఈ నెల 15న పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసుల తీరుపై ఆగ్రహం

ఎన్నికల్లో పాల్గొనే వైసిపి కౌన్సిలర్లకు తగిన భద్రత కల్పించాలని ఎన్నికల సంఘం ఆదేశిస్తే పట్టించుకోరా? అని పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు రాష్ట్రంలో ఏం జరుగుతోందని ఆగ్రహించింది. కఠిన చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పింది. డిజిపి నుంచి కానిస్టేబుల్ వరకు ఎవరినీ విడిచిపెట్టబోమని హెచ్చరించింది. వైసిపి కౌన్సిలర్లు కూడా చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే వారి విషయంలో కూడా కఠిన చర్యలకు ఉపేక్షించబోమంది. ఎన్‌టిఆర్ జిల్లా, తిరువూరు నగర పంచాయతీ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా హైకోర్టును ఆశ్రయించిన ఇద్దరితో పాటు 11 మంది కౌన్సిలర్లకు తగిన భద్రత కల్పించాలని విజయవాడ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. కౌన్సిలర్లు ఎక్కడ ఉన్నారో అక్కడి నుంచి పోలింగ్ కేంద్రం వరకు వారికి భద్రత కల్పించాలని ఆదేశించింది. తమ ఆదేశాల అమలు విషయంలో నివేదిక సమర్పించాలని కమిషనర్‌కు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసనట్లు జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు ఉత్తర్వులు జారీ చేశారు.

సర్వేయర్‌ను బెదిరించిన కేసులో బోరుగడ్డకు రిమాండ్

- రాజమండ్రి జైలుకు తరలింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

భూ వివాదంలో సర్వేయర్‌ను బెదిరించిన కేసుకు సంబంధించి రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్‌కు గుంటూరు ఆరవ అదనపు జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారు. బోరుగడ్డ అనిల్ 2016 మే 9న గుంటూరు జిల్లా పెదకాకాని మండల సర్వేయర్ మల్లిఖార్జునరావును స్థలం సర్టిఫికెట్ కోసం బెదిరించారు. దీంతో విధులకు ఆటంకం కలిగిస్తూ తనను బెదిరిస్తున్నారని సర్వేయర్ మల్లిఖార్జునరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి కేసు నడుస్తుంది. ఈ కేసులో అనిల్ గత ఎనిమిదేళ్లుగా కోర్టుకు హాజరు కావడంలేదు. దీంతో పిటి వారెంట్‌పై పెదకాకాని పోలీసులు అనంతపురం జైలు నుంచి అదుపులోకి తీసుకుని గుంటూరు కోర్టులో హాజరుపరిచారు. కోర్టు రిమాండ్ విధించడంతో ఆయనను రాజమండ్రి జైలుకు తరలించారు.

వేతన పెంపు .. రెగ్యులరైజేషన్ కోసం..

- 23 రోజులుగా సమ్మెలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు
- రోజూ రాత్రి అటెండెన్స్‌పై ఆగ్రహం
- డ్యూటీ ఛార్ట్, పిఎఫ్ లేవు
- వినతులు ఇచ్చినా పట్టించుకోని ప్రభుత్వం

కర్నూలు ధర్నా చౌక్ వద్ద సమ్మెలో సిహెచ్‌ఒలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (సిహెచ్‌ఒ) వేతన పెంపు అమలుకు, రెగ్యులరైజేషన్‌కు నోచుకోవడం లేదు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 23 రోజులుగా నిరవధిక సమ్మె చేపడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10,032 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో ఒక్కొక్కరు చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 10,032 మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పని చేస్తున్నారు. గ్రామాల్లో బిపి, షుగర్ వంటి పరీక్షలతో పాటు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, హైరిస్క్ గర్భవతులను గుర్తించి వారికి ప్రసవం, ప్రసవానంతర చికిత్సలు, పక్షవాతం, దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దకే వెళ్లి సేవలు అందించడం వీరి ప్రధాన విధి.

2018లో నోటిఫికేషన్ ఇచ్చి 2019 మార్చిలో వారిని విధుల్లోకి తీసుకున్నారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్లపూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాల్సి ఉంది. ఆరేళ్ల దాటినా రెగ్యులర్ చేయలేదు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద 126 కేటగిరీల సిబ్బంది పని చేస్తుండగా సిహెచ్‌ఒలు మినహా మిగిలిన 125 కేటగిరీలకు 2024లో 23 శాతం వేతన పెంపు అమలు చేశారు. సిహెచ్‌ఒలను మాత్రం పక్కన పెట్టేశారు. సాధారణంగా ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఆ సమయంలో మూడు సార్లు ఎఫ్ఆర్ఎస్ ద్వారా అటెండెన్స్‌ను వేయాలి. అయితే రాత్రి ఎనిమిది గంటలకు కూడా ఎఫ్ఆర్ఎస్ వేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఊరి బయట ఉండే ఆరోగ్య కేంద్రాల్లో ఎఫ్ఆర్ఎస్ వేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిహెచ్‌ఒలకు రూ.25 వేల వేతనంతో పాటు రూ.15వేలు ఫర్మామెన్స్ ఇన్సెంటివ్ చెల్లించాల్సి ఉంటుంది. ఫర్మామెన్స్ బాగోలేదనే సాకుతో రూ.ఏడు వేల నుంచి రూ.11 వేలకు మించి ఎవరికీ చెల్లించడం లేదు. 2024 వరకూ పిఎఫ్ చెల్లించేవారు. ఇది కేంద్ర ప్రభుత్వం పథకం అంటూ రాష్ట్ర ప్రభుత్వం పిఎఫ్‌ను నిలుపుదల చేసింది. సిహెచ్‌ఒలకు నిర్దిష్టమైన జాబ్ ఛార్ట్ లేదు.

ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.ఐదు లక్షలు, సాధారణ మరణానికి రూ.రెండు లక్షలు, మట్టి ఖర్చులకు రూ.15వేలు చెల్లించాల్సి ఉంది. ఎవరికీ ఆ ప్రయోజనాలను అందించలేదు. తమ సమస్యలను పరిష్కరించాలని గతేడాది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో పాటు పలువురు మంత్రులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా 23 రోజులుగా సిహెచ్‌ఒలు నిరవధిక సమ్మె చేపడుతున్నారు. సమ్మె శిబిరాల్లో వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు.

చర్చలు జరిపి స్పష్టమైన హామీ ఇవ్వాలి

సిహెచ్‌ఒల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి. ఇతర కేటగిరీల వారికి వేతన పెంపు అమలు చేసి సిహెచ్‌ఒలకు పెంచకపోవడం అన్యాయం. రెగ్యులరైజేషన్‌కు చర్యలు చేపట్టాలి. నిర్దిష్ట జాబ్ ఛార్జ్ ప్రకటించాలి. పిఎఫ్‌ను తిరిగి పునరుద్ధరించాలి. టిఎ, డిఎలను అందించాలి.

- ఎస్.ప్రసాద్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ కర్నూలు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్.

రాత్రి అటెండెన్స్ రద్దు చేయాలి

మాకు స్పష్టమైన జాబ్ ఛార్ట్ లేదు. వెంటనే జాబ్ ఛార్జ్‌ను ప్రకటించాలి. రాత్రి ఎనిమిది గంటలకు అటెండెన్స్ వేయాలంటే మహిళా సిబ్బందికి చాలా ఇబ్బంది అవుతుంది. వెంటనే ఆ విధానాన్ని రద్దు చేయాలి. ఇన్సెంటివ్‌లో కోత పెట్టకుండా కన్సాలిడేట్ చేసి వేతనాన్ని చెల్లించాలి. హెచ్ఆర్ పాలసీని తీసుకురావాలి.

- అనూష, ఎరుకల చెరువు సిహెచ్‌ఒ.

6 నుంచి మసుల బీచ్ ఫెస్టివల్

- మంత్రులు కందుల, కొల్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మంగినపూడిలో జూన్ 6 నుంచి 8 వరకు మసుల బీచ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర తెలిపారు. వెలగపూడిలోని సచివాలయంలో ఇరువురు మంత్రులు మంగళవారం భేటీ అయ్యి బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. మంగినపూడి బీచ్ అద్భుతమైన పర్యాటక ప్రాంతమని, ఈ ఉత్సవాల్లో భాగంగా లక్షలాది సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించాలన్నారు. ఇసుక తిన్నెలపై ఉత్సవాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఉత్సవాల్లో ఏర్పాటుచేసే స్వాగత తోరణాలు సాంస్కృతిక, కళా వైభవాన్ని స్ఫురించేలా, పర్యాటక ప్రాంతాల గొప్పతనం తెలిసేలా ఏర్పాటు చేయాలని గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మసుల బీచ్ ఫెస్టివల్‌కు తరలివచ్చే లక్షలాది మంది ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాల్లో భాగంగా పర్యాటకుల వినోదం కోసం జాతీయ క్రీడలైన బీచ్ కబడ్డీ, కయాకింగ్ జలక్రీడలు, హెలీ రైడ్, పారా గ్లైడింగ్, నీటిలో గ్లైడింగ్ స్క్యూబా డైవింగ్ స్పీడ్ బోట్లు తదితర సాహస క్రీడలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ సినీ కళాకారులు, సంగీత దర్శకులతో సంగీత విభావరి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

టిడిపి మినీ మహానాడులో కార్యకర్త ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా టిడిపి మినీ మహానాడులో ఆ పార్టీ కార్యకర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. అనంతపురంలోని కమ్మ భవన్‌లో మంగళవారం టిడిపి మినీ మహానాడు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతున్న సమయంలో సాకే వెంకటేష్ అనే టిడిపి కార్యకర్త తన వెంట తెచ్చుకున్న క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీంతో అక్కడున్న నాయకులు, కార్యకర్తలు వెంకటేష్‌ను హుటాహుటిన సర్వజన ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు. ఈ ఘటనతో ఒక్కసారిగా అక్కడున్న నాయకులు, కార్యకర్తలు షాక్‌కు గురయ్యారు. అయితే, కార్యకర్త వెంకటేష్ పార్టీలో ఎస్‌సి సెల్ నగర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తాను పార్టీ కోసం పని చేస్తున్నా తగిన గుర్తింపు లేదని, సమస్య చెప్పుకున్నా పరిష్కరించే నాథుడు లేడని తోటి కార్యకర్తలతో వెంకటేష్ వాపోయినట్లు సమాచారం. ఇటీవల రాష్ట్ర ఐటి శాఖ మంత్రి లోకేష్‌ను కలిసి సమస్యలపై మొర పెట్టుకున్నా స్పందన లేకపోవడంతో అసహనానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తోటి కార్యకర్తలు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేష్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఇతర నేతలు పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం బెంగుళూరుకు తరలించారు.

'హంద్రీ- నీవా'పై బహిరంగ చర్చకు సిద్ధం

- వైసిపి ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి కాలవ శ్రీనివాసులు సవాల్

ప్రజాశక్తి - రాయదుర్గం (అనంతపురం జిల్లా)

హంద్రీనీవా పథకం మొదలైనప్పటి నుంచి ఏ ప్రభుత్వ హయాంలో ఏ మేరకు అభివృద్ధి పనులు జరిగాయో, ఎంత అవినీతి జరిగిందో బహిరంగ చర్చకు తాను సిద్ధమని రాయదుర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సవాల్ చేశారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ఎమ్మెల్సీ శివరామిరెడ్డి చేసిన సూచనకు తాను స్పందిస్తున్నానన్నారు. 21వ తేదీ (బుధవారం)న ఉదయం 11 గంటలకు జీడిపల్లి రిజర్వాయర్ వద్ద రైతుల సమక్షంలో శివరామిరెడ్డితో తాను బహిరంగ చర్చకు సిద్ధమని తెలిపారు. ఎన్‌టిఆర్ కలల రూపం అయిన హంద్రీనీవా పథకాన్ని 1996 ఉరవకొండ నియోజకవర్గంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. కాగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి హాయంలో 2008- 10 సంవత్సరాల కాలంలో "కాగ్" (కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) ఇచ్చిన నివేదిక ఆధారంగా జలయజ్ఞంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. 2019 - 24 కాలంలో జగన్ నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వం హంద్రీనీవా పథకం పట్ల నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని రూ. 3700 కోట్ల నిధులు కేటాయించి 3850 క్యూసెక్కుల సామర్థ్యంతో కాలవ విస్తరణ పనులను శరవేగంగా చేపడుతున్నట్లు తెలిపారు.

హిందూయేతర ఉద్యోగులకు విఆర్ఎస్

- డిడి నెక్స్ట్ లెవల్ చిత్ర బృందంపై చర్యలకు నిర్ణయం
- పాలకమండలి నిర్ణయాలు వెల్లడించిన టిటిడి ఇఒ

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలో పనిచేస్తున్న హిందూయేతరులను బదిలీ చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు, స్వచ్ఛంద పదవీ విరమణకు చర్యలు తీసుకునేందుకు టిటిడి ఉపక్రమించింది. ఈ మేరకు మంగళవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో నిర్ణయం తీసుకుంది. తిరుమల ఆలయ భద్రతను దృష్టిలో పెట్టుకుని యాంటీ డ్రోన్ టెక్నాలజీ వాడాలని నిర్ణయం తీసుకున్నారు. దీనిపై తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శ్రీవారి నామావళిని రీమిక్స్ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన డిడి నెక్స్ట్ లెవల్ చిత్ర బృందంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో జరిగిన టిటిడి ధర్మకర్తల మండలి సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను ఇఒ శ్యామలరావు మీడియాకు వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు తిరుమల కొండల్లో ఉన్న పచ్చదనాన్ని అటవీశాఖ ద్వారా 68.14 శాతం నుంచి 80 శాతానికి పెంచేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రభుత్వ ఆమోదం వచ్చాక దశలవారీగా 2025-26 సంవత్సరంలో రూ.1.74 కోట్లు, 2026-27 సంవత్సరంలో రూ.1.13 కోట్లు, 2027-28 సంవత్సరానికి రూ.1.13 కోట్లు ప్రభుత్వ అటవీశాఖకు విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఆర్థిక సహాయంగా ఏడాదికి అందిస్తున్న రూ.60 కోట్లతో పాటు అదనంగా మరో రూ.71 కోట్లు అందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది నియామకం చేపట్టేందుకు, అదేవిధంగా 85 శాతం నిర్మాణాలు పూర్తి చేసుకున్న భవంతులను (ఆంకాలజీ మరియు పద్మావతి చిన్న పిల్లల ఆసుపత్రిలతో కలిపి) త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేలా, శ్రీవారి వైద్య సేవను కూడా అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నామని ఇఒ తెలిపారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, అమరావతి వేంకటేశ్వరస్వామి ఆలయం, నారాయణవనం కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, కపిలతీర్థం కపిలేశ్వరస్వామి ఆలయం, నాగాలాపురం వేదనారాయణస్వామి ఆలయం, ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయాల అభివృద్ధి కోసం సమగ్ర బృహత్ ప్రణాళిక తయారు చేసేందుకు ఆర్కిటెక్ట్‌ల నుండి సాంకేతిక, ఆర్థిక ప్రతిపాదనలు స్వీకరించాలని నిర్ణయించామని తెలిపారు. యాత్రికులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు పేరొందిన సంస్థలకు కాంట్రాక్టు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాలను యాత్రికులు విశేష సంఖ్యలో సందర్శిస్తున్న నేపథ్యంలో ఇక్కడ ఆధ్యాత్మిక, పర్యావరణ, మౌలిక సదుపాయాలను మరింత పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలని, తుళ్లూరు మండలం అనంతవరంలోని టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని, రూ.10 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపామన్నారు.

తిరుమల అన్నమయ్య భవన్‌లో జరిగిన పాలకమండలి సమావేశం

డిఎస్సీ ప్రత్యేకం-ఎస్ఎ/ఎస్‌జిటి

విజ్ఞానశాస్త్ర బోధనా లక్ష్యాలు - స్పష్టీకరణలు : విద్యాప్రమాణాలు

ఎ.ఉమామహేశ్వరరావు
ఎమ్మెస్సీ, బిఇడి, జీవశాస్త్రం సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9985288150

జీవశాస్త్ర బోధనా లక్ష్యాలు

గమ్యాలు, ఉద్దేశ్యాలు, లక్ష్యాలు - అర్థం
బ్లూమ్స్ టక్సానమి
బోధనా లక్ష్యాలు - స్పష్టీకరణలు

- జీవశాస్త్రంలో గమ్యాలు, ఉద్దేశాలు, లక్ష్యాలు అనే పదాలను వేర్వేరు అర్థాల్లో వాడతారు.

1.గమ్యం : విశాలమైన, దీర్ఘకాలికమైన, అంతిమ ప్రయోజనాన్ని తెలియజేస్తుంది.

ఉదా : విద్యార్థి సమగ్ర మూర్తిమత్వాన్ని పెంపొందించడం

2.ఉద్దేశ్యం : గమ్యాల నుండి ఏర్పడి, గమ్యాల కంటే నిర్దిష్టంగా ఉండి గమ్యాల కంటే తక్కువ కాలంలో సాధించబడే వాటిని ఉద్దేశ్యాలు అంటారు.

ఉదా :
1.విద్యార్థిలో జీవశాస్త్రానికి సంబంధించిన జ్ఞానాన్ని కల్గజేయటం
2.మంచి ఆరోగ్యపు అలవాట్లను పెంపొందించడం

3. లక్ష్యం :

గమ్యం → ఉద్దేశ్యం → లక్ష్యం
గమ్యం → ఉద్దేశ్యం → లక్ష్యం
గమ్యం → ఉద్దేశ్యం → లక్ష్యం
గమ్యం → ఉద్దేశ్యం → లక్ష్యం

- ఉద్దేశ్యాల నుండి ఉద్భవించి అనతికాలంలో చేరగల గమ్యాలను లక్ష్యాలు అంటారు.

ఉదా :
1.విద్యార్థి పుష్పభాగాలను అవగాహన చేసుకోవటం
2.విద్యార్థి ప్రత్యుత్పత్తి గురించి జ్ఞానాన్ని సంపాదించుకోవటం .

యునెస్కో హ్యాండ్ బుక్ ఫర్సైన్స్ టీచర్స్ : ఒక గమ్యం నుండి అనేక ఉద్దేశ్యాలు, ఒక ఉద్దేశ్యం నుంచి అనేక లక్ష్యాలు ఆవిర్భవిస్తాయి అని సూచించారు.

రిచర్డ్ వైట్ ఫీల్డ్ (కేంబ్రిడ్జి యూనివర్శిటీ) : ఉద్దేశ్యాలకు, లక్ష్యాలకు గల సంబంధం ఒక గొలుసు రూపంలో ఉంటుందని చెప్పారు.

వీటిని సాధించడానికి ఎక్కువ కాలం పడతాయి. కాబట్టి వీటిని దీర్ఘకాలిక లక్ష్యాలు అంటారు.

లక్ష్యాలు :

- విద్యార్థి ప్రవర్తనలో ఆశించిన మార్పు / వాంఛనీయమైన మార్పు /తీసుకురావాల్సిన మార్పును లక్ష్యం అంటారు.
- లక్ష్యాలు రూపొందించేటప్పుడు గమనించాల్సిన మూలాలు

1.విద్యార్థి అవసరాలు
2.సామాజిక అవసరాలు
3.లభించే వనరులు
4.పాఠ్యాంశ స్వభావం
5.విద్యావిధాన స్వభావం



లక్ష్యాల లక్షణాలు :

- విద్యా విషయకంగా ప్రాముఖ్యం ఉండాలి
- విద్యార్థిలో తీసుకురావాల్సిన ప్రవర్తనా మార్పుల రూపంలో ఉండాలి.
- విద్యార్థులు పరిశోధించదగిందిగా, చేయదగిందిగా ఉండాలి.
- ఉపాధ్యాయునికి సూచనా ప్రాయంగా ఉండాలి.

బోధనా లక్ష్యాలు

సరళం ↓ సంక్లిష్టం

1.జ్ఞానరంగం
1.జ్ఞానం
2.అవగాహన
3.అన్వయం
4.విశ్లేషణ
5.సంశ్లేషణ
6.మూల్యాంకనం

2.భావావేశ రంగం
1.గ్రహించటం
2.ప్రతిస్పందించటం
3.విలువ కట్టడం
4.వ్యవస్థాపకం
5.శీలస్థాపనం

3. మానసిక చలనాత్మకరంగం
1.అనుకరణం
2.హస్త లాఘవం
3.సునిశితత్వం
4.సమన్వయం
5.స్వాభావీకరణం

- మూల్యాంకనం చేయడానికి వీలుగా ఉండాలి.
- సరళమైన భాషలో నిర్దిష్టంగా ఉండాలి.
- ప్రతీ లక్ష్యానికి స్పష్టీకరణలు ఉండాలి.

గమనిక : బ్లూమ్స్ ప్రతీరంగంలోని అంశాలను ఆధిపత్యశ్రేణి క్రమంలో అమర్చారు.

- ఆధిపత్య శ్రేణి అనగా సరళం నుండి సంక్లిష్టానికి అమర్చడం
- ప్రతీరంగంలోని మొదటి అంశం ప్రాథమికమైంది. సరళమైంది.
- ప్రతి రంగంలోని చివరి అంశం అత్యున్నమైంది. సంక్లిష్టమైంది.

జ్ఞానరంగంలోని స్పష్టీకరణలు సంక్షిప్తంగా ...

జ్ఞానరంగం	స్పష్టీకరణలు
1.జ్ఞానం	1. జ్ఞప్తికి తెచ్చుకోవడం 2. గుర్తించడం
2. అవగాహన	1.అనువాదం చేయుట 2. ఉదాహరణలు ఇవ్వడం 3. అర్థవివరణ ఇవ్వడం 4. తప్పొప్పులను కనుగొనడం 5. బేధాలను గుర్తించడం 6. వర్గీకరించడం 7. పటాలు, గ్రాఫులను వివరించడం 8. పోల్చడం 9. బహిర్వేశనం చేయుట 10. భూసారం వర్షపాతం జాబితాను బట్టి ఆ నేల, పంటకు అనువైనదీ లేనిదీ అంచనా వేయడం
3. వినియోగం	1. నిజ జీవితంలోకి అన్వయించుకోవడం 2. స్వంత నిర్ణయాలు తీసుకోనడం 3. కారణాలు తెలియజేయడం 4. కారణానికి, ఫలితానికి మధ్య సంబంధాన్ని ఏర్పరచుకోవడం 5. కొత్త కొత్త ప్రయోగాలు చేయడం

జీవశాస్త్రంలో విద్యా ప్రమాణాలు

1.విషయ అవగాహన (AS1)
2. ప్రశ్నించడం, పరికల్పన చేయడం (AS2)
3. ప్రయోగాలు, క్షేత్ర పరిశీలనలు (AS3)
4. సమాచార సేకరణ, ప్రాజెక్టు పనులు (AS4)
5. బొమ్మలు గీయడం, నమూనాలు తయారు చేయడం (AS5)
6. అభినందించడం, సౌందర్యాత్మక స్పృహ కలిగి ఉండటం, విలువలు పాటించడం (AS6)
7. నిజజీవిత వినియోగం, జీవ వైవిధ్యం పట్ల సానుభూతి కలిగి ఉండటం (AST)

నోట్ : ప్రస్తుతం 7వ విద్యా ప్రమాణాన్ని 6వ విద్యా ప్రమాణంలో కలిపి వేసి మూల్యాంకనం ఆ విద్యా ప్రమాణాలు నెరవేరాయా లేదా అనేది దానిలోని సూచికల ద్వారా తెలుస్తుంది.

విద్యా లక్ష్యాలు

మెదడు	హృదయం	కాళ్లు, చేతులు
జ్ఞానాత్మక రంగం బిఎస్ బ్లూమ్స్	భావావేశరంగం డేవిడ్ ఆర్ క్రాత్‌వెల్	మానసిక చలనాత్మక రంగం ఆర్‌హెచ్ ధనే, సింప్సన్
1.జ్ఞానం 2.అవగాహన 3.వినియోగం	4.అభిరుచి 5.వైఖరి 6.అభినందన	7.నైపుణ్యాలు
మేథోపర ప్రక్రియలు	భావావేశాలు	శారీరక, మానసిక శక్తుల మధ్య అనుసంధానం

ఉష్ణమండల వ్యాధులు
దోమలో పరాన్నజీవి జీవిత చక్రం

- దోమ మానవుని నుండి రక్తం పీల్చినపుడు 'గామిటోసైట్లు' దాని జీర్ణ వ్యవస్థలోకి చేరతాయి.

-ఇవి జీర్ణ వ్యవస్థ గోడల్లోకి ప్రవాసం చెంది మాక్రోగావిటోసైట్లు, స్థూల సిద్ధ బీజాలు (మాక్రోగామిట్స్) గాను (అంటే ఫలదీకరణం చెందని అండంతో సమానంగా ఉండేవి). ఏర్పడతాయి.

- ఈ రెండు సంయోగ బీజాలు సంయోగం చెంది 'సంయుక్త బీజం' (జైగోట్) ఏర్పడుతుంది. ఇది జీర్ణవ్యవస్థ గోడలపై పొరలలోకి చేరి, పెద్దది అయి, విభజన చెంది అధిక సంఖ్యలో 'చలత్సిద్ధ బీజాలు' (స్పోరోజాయిట్లను) ఉత్పత్తి చేస్తుంది.
- స్పోరోజాయిట్లు దోమ లాలాజల గ్రంథుల్లోకి ప్రవాసం చెంది, కొత్త అతిథేయిని (మానవుని) కుట్టినపుడు ఆ స్పోరోజాయిట్లు ప్రవేశిస్తాయి.
- చలి, జ్వరం (106 డిగ్రీల ఫారెన్‌హీట్) తలనొప్పి, వళ్లు నొప్పులు, 2-6 గంటల కాలం ఉండి, అవి తిరిగి, తిరిగి 2 లేక 3 రోజులకొకసారి వస్తాయి.
- చిన్న పిల్లల్లో మెదడుకు సంబంధించిన మలేరియా వ్యాధి వస్తుంది. మలేరియా జ్వరానికి 'క్వినైన్' అనే ఔషధంతో చికిత్స చేస్తారు.

-దోమల జనాభా అదుపుతో మలేరియా రాకుండా చేయొచ్చు.

నోట్ : దోమ డింభకాలను ఆహారంగా తీసుకునేవి : 1. గాంబూజియా (చేప), 2.యుట్రిక్యులేరియా (కీటకాహార మొక్క)

చర్మ వ్యాధులు

చర్మం-సామాన్య వ్యాధులు:

- శరీరానికి మొట్టమొదటి రక్షక కవచం - 'చర్మం'
- చర్మం, చర్మ వ్యాధులు శాస్త్రాన్ని 'డెర్మటాలజీ' అంటారు.
- చిన్న పిల్లల్లో అతి సామాన్యంగా కలిగే చర్మ వ్యాధి - 'గజ్జి'.



1.గజ్జి లేక స్కేబిస్:

- ఇది అంటువ్యాధి.
- ఇది "ఇచ్‌మైట్" లేక 'ఎకారస్' అనే చిన్న కీటకంతో వస్తుంది.
- దీని శాస్త్రీయ నామం 'సార్కోప్టిస్ స్కేబిస్'
- మైట్ సాలీడుని పోలి ఉండును. 'ఆర్థ్రోపోడా' వర్గానికి చెందినది.
- మైట్ కంటికి మెరుస్తున్న తెల్ల చుక్కలా, చుట్టూ నల్లటి బోర్డరు ఉండును.
- సుమారు 400 మైక్రాసుల పరిమాణంలో ఉంటుంది.
- అడమైట్, మగదాని కంటే పెద్దది. ఇది సుమారు 400 మైక్రానుల పరిమాణంలో ఉంటుంది.
- ప్రౌఢమైట్‌లో అంటుబిళ్లలు కలిగిన 4 జతల కాళ్లుంటాయి.
- అంటుబిళ్లల సంఖ్య అడ, మగ మైట్లలో వేరుగా ఉంటాయి.
- సంపర్కం తర్వాత, మగ మైట్ చనిపోతుంది.
- ఫలదీకరణం చెందిన ఆడమైట్ చర్మంలో 'ఎస్' ఆకారంలో బొరియ చేసి అందులో ఉంటుంది. ఈ బొరియని 'మోల్డింగ్ పోకెట్' అంటారు.
- సుమారు '2' నెలలు అది ఈ బొరియలలో ఉండి, తర్వాత చనిపోతుంది.
- ప్రతి రోజూ అది 2-3 గుడ్లు పెడుతుంది. గుడ్లు '6' కాళ్ళు కల లార్వాలుగా తయారవుతాయి.
- 3 లార్వాలు '3' సార్లు చర్మమును వదిలివేసి పెద్దవవుతాయి.
- గోకటం వల్ల రక్తం కారి, స్కేబిస్ శరీరంలో కొత్త భాగాలకు చేరుతుంది. -స్కేబిస్ సామాన్యంగా చేతి వేళ్ళ మధ్య, చర్మం మీద, మణికట్టు, ఉదరం మీద అనిపిస్తుంది.
- అతి చిన్న పిల్లల్లో స్కేబిస్ అరిచేతులు, కాళ్ళ మడమల మీద అవుపించును.
- ద్వితీయ సంక్రమణ : మైటు ఏర్పరచిన బొరియల్లోకి, ఇతర వ్యాధికారక క్రిములు చేరి ఇతర చర్మ వ్యాధులు కలుగచేయటం.
- స్కేబిస్ యొక్క ముఖ్య లక్షణం 'చర్మంలో బొరియలు'
- స్కేబిస్ వ్యాధికి 'సల్ఫర్' ఉన్న లేపనాలను వాడుతారు.
- చర్మంలో విషపదార్థాలు చేరితే 'ఎలర్జీ' వస్తుంది.

2.ఎక్జిమా

- చర్మం దళసరిగా అయి ముదురు బూడిద రంగులోకి మారి విపరీతమైన దురద పెట్టును.
- చర్మం పొలుసుల మాదిరి ఊడిపోతుంది.

3. పెల్లాగ్రా :

- సరైన పోషకాహారం తీసుకోవకపోవటం వల్ల వచ్చే చర్మవ్యాధి. 'నియాసిన్' అనే విటమిన్ లోపం వల్ల వస్తుంది. అంటువ్యాధి కాదు.

రేపు : జీవశాస్త్రంలో విద్యా ప్రమాణాలు

సంపాదకీయం

జీ హుజూర్!

భారతదేశ భవితవ్యాన్ని ప్రభావితం చేసే అంశాలపై కీలక నిర్ణయాలను అమెరికా అధ్యక్షుడు ప్రకటిస్తూ...అంతర్గత అంశాల్లో పదేపదే జోక్యం చేసుకోవడం ఆందోళనకరం. దేశ సార్వభౌమాధికారాన్నే సవాల్ చేస్తున్న ఈ తీరుకు చెక్ పెట్టడానికి బదులు... కనీసం నోరు మెదపడానికి కూడా ప్రధాని ఇష్టపడకపోవడం అగ్రరాజ్యానికి జీ హుజూర్ అనడమే!

పహల్గామ్ ఉగ్రదాడి తరువాత భారత్, పాక్ కాల్పుల విరమణకు అంగీకరించాయని తొలుత ప్రకటించింది ట్రంప్‌నే. వాణిజ్యం నిలిపివేస్తానని ఇరు దేశాలను బెదిరించానని, వారిద్దరూ కాల్పుల విరమణకు అంగీకరించారని పదేపదే చెబుతూనే ఉన్నారు. అంతెందుకు ట్రంప్ అధికారంలోకి వచ్చింది మొదలు తీసుకున్న నిర్ణయాలన్నీ భారత్ ప్రయోజనాలకు నష్టం చేసేవే. తగిన పత్రాలు లేకుండా నివసిస్తున్న వారిని అవమానకరంగా కాళ్లకు చేతులకు సంకెళ్లు వేసి యుద్ధ విమానాల్లో తరలిస్తే... చిన్న దేశాలుసైతం ప్రతిఘటించగా, విశ్వ గురుగా చెప్పుకునే పాలకుల నోరుపెగల్లేదు.

టారిఫ్‌లు విధించకుండానే అమెరికా నుంచి వస్తూత్పత్తుల దిగుమతికి భారత్ అత్యుత్సాహం చూపిస్తోందని ట్రంప్ ఇటీవల ప్రకటించారు. అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధ పరిస్థితుల వల్ల భారత్‌లో అత్యధికంగా ఐ ఫోన్లు తయారు చేయాలని యాపిల్ కంపెనీ నిర్ణయించింది. ప్రపంచంలో అత్యధిక టారిఫ్‌లు విధించే దేశాల్లో భారత్ ఒకటని, అసలు టారిఫ్‌లే లేకుండా వస్తువులను దిగుమతి చేసుకోవడానికి భారత్ దాదాపు అంగీకరించిందని, భారత్‌లో ఐ ఫోన్ల తయారీ కర్మాగారాలను నిర్మించినా అసలు పట్టించుకోదని...ఇలా మన దేశం గురించి ఇష్టానుసారం మాట్లాడేశాడు. టారిఫ్‌లపై చర్చించేందుకు మన వాణిజ్య మంత్రి వాషింగ్టన్‌లో పర్యటిస్తున్న సమయంలో....వాణిజ్య చర్చల కోసం వెళ్లిన సమయంలో ట్రంప్ ఈ ప్రకటన చేయడం మరింత అభ్యంతరకరం. మన దేశంలో పెట్టాల్సిన యాపిల్ కంపెనీని నిలువరించానని స్వయంగా చెప్పుకున్నారు. వీటిపైనా ప్రధాని మౌనముద్ర కొనసాగించారు. టారిఫ్‌లుసహా సమగ్ర వాణిజ్య ఒప్పందంపై ఇంకా చర్చలు జరుగుతున్నాయంటూ విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రకటించడం మినహా ట్రంప్ అవాస్తవాలు చెబుతున్నారని ప్రకటించే ధైర్యం చేయలేదు. రెసిప్రోకల్ టారిఫ్స్ పేరుతో ఇప్పటికే అమెరికా విధించిన 26 శాతం టారిఫ్‌ల కత్తి వేలాడుతూనే ఉంది. ఇతర దేశాలతోపాటు 90 రోజుల వెసులుబాటు లభించిందంతే. మనదేశం తలవంచగా, టారిఫ్‌లపై గట్టిగా నిలబడిన చైనా... అమెరికా మెడలు వంచిన తీరును ప్రపంచమంతా చూసింది. అమెరికా ఏకపక్ష ధోరణులు, టారిఫ్‌లతో అంతర్జాతీయ శాంతి, సుస్థిరతలకు ముప్పు పొంచివుందని, అభివృద్ధి పునాదులు కదిలిపోతాయని 80కిపైగా దేశాల ప్రతినిధులు ఐరాసలో ఆందోళన వ్యక్తం చేసినా...మన దేశానిది మూగనోమే! ట్రంప్ చెప్పినట్టు జీరో సుంకాలకు అంగీకరిస్తే... అక్కడి వస్తువుల డంపింగ్‌తో మన వ్యవసాయంసహా అన్ని రంగాల్లో అధోగతే!

అమెరికాలోని వలసదారులు తమ మాతృదేశాలకు పంపే డబ్బుపై ఐదు శాతం రెమిటెన్స్ టాక్స్ విధిస్తానని తాజాగా ట్రంప్ ప్రకటించారు. అమెరికా శాశ్వత పౌరులు మినహాయిస్తే... గ్రీన్‌కార్డుదారులతోపాటు హెచ్ - 1 బి, ఎఫ్ -1 లేదా జె-1 తదితర వీసాలపై అక్కడ ఉంటున్న భారతీయులంతా తాము పంపే ప్రతి లక్ష రూపాయల్లో ఐదు వేలు అమెరికాకు టాక్స్ కట్టాల్సిందే. 2024లో విదేశాల నుంచి రూ.10.7 లక్షల కోట్ల రెమిటెన్స్‌లు వస్తే... అమెరికా నుంచే రూ.3 లక్షల కోట్లు వచ్చాయి. అమెరికాకు అన్ని రకాల కేంద్ర, రాష్ట్ర పన్నులు చెల్లించిన తరువాత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల కోసమో, ఇక్కడ ఆస్తులు కొనడం కోసమో పంపించే మొత్తంపై ఎన్‌ఆర్‌ఐలు రూ.15 వేల కోట్ల పైచిలుకు అమెరికాకు అప్పనంగా సమర్పించుకోవాలి. ఇటువంటి నష్టదాయకమైన అమెరికా ఏకపక్ష విధానాలను ధైర్యంగా ఎదుర్కోవడం అత్యవసరం. భారత సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం అవశ్యం.

మహనీయుల మాట



మన పాఠ్యగ్రంథాలు యుద్ధాల్ని కీర్తిస్తాయి. వాటి దుర్మార్గాల్ని దాచిపెడతాయి. అవి మన పిల్లల హృదయాల్ని విద్వేషమయం చేస్తాయి. నేనైతే యుద్ధాన్ని కాదు, శాంతిని బోధిస్తాను. ద్వేషాన్ని కాదు, ప్రేమను వారిలో నింపుతాను.

- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్,
ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త.

Albert Einstein

ట్రంప్ సుంకాలు, చైనా స్మార్ట్ కర్మాగారాలు, మన 'మేకిన్ ఇండియా'

అంతర్జాతీయం

బప్పా సిన్హా

చైనా సాధించిన వ్యూహాత్మక ప్రగతి నుండి మన దేశం కీలకమైన గుణపాఠాలు తీసుకోవచ్చు. శాస్త్ర-సాంకేతిక రంగాల్లో స్వావలంబన సాధించడానికి చైనా ప్రభుత్వం సంవత్సరాల వారీగా జాతీయ వ్యూహం, లక్ష్యాలు రూపొందించుకోవడంతోపాటు ఈ లక్ష్య సాధనకు ప్రభుత్వ పెట్టుబడులు భారీగా సమకూర్చింది. చౌక శ్రమ శక్తిని ఎరగా చూపి విదేశీ పెట్టుబడుల మీద ఆధారపడలేదు. పటిష్టమైన వారి శ్రామిక పునాదిని నెలకొల్పడానికి దేశీయంగా సాధన సంపత్తిని, విజ్ఞానాన్ని, కీలక వనరులను అభివృద్ధి చేసుకున్నది. భారతదేశం స్వావలంబన సాధించాలంటే అసెంబ్లింగ్ యూనిట్లు నెలకొల్పడానికి మించిన ప్రణాళికలను రూపొందించుకోవాలి. విద్యా, పరిశోధనా రంగాలలో ప్రభుత్వం మరింతగా పెట్టుబడులు సమకూర్చి నైపుణ్యం గల కార్మిక వర్గాన్ని, దేశీయ సాంకేతికతను అభివృద్ధి చేసుకోవాలి.

దశాబ్దాల పాటు వివిధ దేశాలకు తరలించిన వస్తూత్పత్తి పరిశ్రమలను అమెరికాకు తిరిగి రప్పించి...అమెరికన్లకు ఇబ్బడి ముబ్బడిగా ఉద్యోగావకాశాలు కల్పించడానికి ప్రపంచ దేశాలపై సుంకాలను విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించాడు. ప్రభుత్వ పరిపాలనా వ్యయంలో దుబారాను అరికట్టే పేరిట ఎలాన్ మస్క్ నేతృత్వంలో ఏర్పరిచిన 'డిపార్టుమెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ' వేలాది మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతూ, ఆఖరుకు ఫెడరల్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాలను కోత పెట్టిన నేపథ్యంలో ట్రంప్ ప్రకటించిన సుంకాల యుద్ధం అమెరికన్లకు మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించడానికి కాదనేది స్పష్టం అవుతున్నది. ఆర్థికంగా, వాణిజ్యపరంగా నానాటికి బలోపేతం అవుతూ అమెరికన్ ప్రపంచాధిపత్యానికి సవాలుగా మారుతున్న చైనాను దెబ్బతీసి ఒంటరిపాటు చెయ్యడమే ట్రంప్ ప్రకటించిన సుంకాల యుద్ధం వెనుక ఉన్న అసలు ఉద్దేశం. ట్రంప్ మిడిసిపాటుతో ప్రకటించిన సుంకాలు వార్తాపత్రికల పతాక శీర్షికలుగా చలామణీ అవుతుంటే చైనా తన మానాన తాను దేశ వస్తూత్పత్తి రంగాన్ని, ఆర్థిక వ్యవస్థను పటిష్టంగా, బలీయంగా పెంపొందించుకుంటూ పోతున్నది. రోబోటిక్స్, కృత్రిమ మేధ (ఎ.ఐ), డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ రంగాలలోకి పెట్టుబడులు ఆహ్వానించడం ద్వారా చైనా సంప్రదాయిక లేబర్ ఇంటెన్సివ్ వస్తూత్పత్తి విధానం నుండి పూర్తి స్థాయి యాంత్రీకరణ, హైటెక్ విధానంతో కూడిన రాత్రి కర్మాగారాల వైపునకు మళ్ళించింది. యాంత్రీకరణ విప్లవం ద్వారా చైనా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దశ, దిశలను మార్చేస్తున్న వైనాన్ని గురించి ఇప్పటికే వివిధ కథనాలు వెలువడ్డాయి. మరోవంకన వస్తూత్పత్తి రంగంలో అభివృద్ధి సాధించడానికి 'మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్, స్టార్టప్ ఇండియా'ల పేరిట మోడీ ప్రభుత్వం రకరకాల పథకాలను ప్రకటించినా ఇవి ఆచరణలో ఆశించిన ఫలితాలు సాధించడంలో విఫల నమూనాలుగా మిగిలాయి. నయా ఉదారవాద విధానాల భ్రమల నుండి బయటపడి శాస్త్ర-సాంకేతిక రంగాలలో అభివృద్ధి సాధించడానికి దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించుకుని నిబద్ధతతో ఆచరించడం ద్వారా మాత్రమే భారతదేశం స్వావలంబన సాధించగలుగుతుందన్న తెలివిడి, స్పృహ పాలకులకు కలగనంత వరకు పరిస్థితులలో గుణాత్మక మార్పులు రావు.

చైనా కారుచౌక శ్రామిక శక్తికి నెలవు అని దశాబ్దాలుగా పేరు పడింది. కానీ గత పదేళ్లగా చైనా వ్యూహాత్మకంగా అత్యున్నత స్థాయి వస్తూత్పత్తి రంగానికి కేంద్రంగా మారింది. 2015లో చైనా ప్రభుత్వం రాబోయే పదేళ్ళలో రోబోటిక్స్, కృత్రిమ మేధ తదితర పది అత్యున్నత సాంకేతిక రంగాలలో ప్రగతి సాధించి 'మేడిన్ చైనా-2025 సాధించాలని ప్రణాళిక రూపొందించుకున్నది. ఇందుకు అనుగుణంగా శాస్త్ర పరిశోధనా రంగాలలో అద్భుత ఫలితాలు సాధించడానికి అనువుగా భారీ పెట్టుబడులు పెట్టడం, తేలికగా బ్యాంక్ రుణాలు అందేలా చూడడం వంటి చర్యలు చేపట్టింది. ఒక్క 2023వ సంవత్సరంలోనే రోబోటిక్స్ రంగంలో శాస్త్ర పరిశోధనకు 1.4 బిలియన్ డాలర్లు కేటాయించింది. అలాగే ఇందుకు తగిన సాధన సామాగ్రిని సమకూర్చుకోవడం కోసం భారీ ఎత్తున పారిశ్రామిక రుణాలు అందేలా చూసింది. ఇవాళ చైనా ప్రపంచంలోనే అత్యధిక ఫ్యాక్టరీ రోబోట్ల వినియోగదారుగా ఎదిగింది. సగటున 10,000 మంది కార్మికులకు 392 రోబోట్ల వినియోగంతో ప్రపంచ సగటు వినియోగం కన్నా మూడు రెట్లు ఆధిక్యతతో ముందున్నది. చైనాలో దేశవ్యాప్తంగా పరిశ్రమలను కృత్రిమ మేధ, రోబోటిక్స్‌తో అనుసంధానించే ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నది. అధునాతన సెన్సార్ల ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన వస్తూత్పత్తి చేస్తున్నది. తద్వారా సరసమైన ధరలకే నాణ్యమైన వస్తువులు అందించగలుగుతున్నది. అమెరికా సుంకాల విధింపును లెక్క చెయ్యకుండా ఐరోపా యూనియన్ దేశాలకు, ఇతర వర్ధమాన దేశాలకు చైనా ఉత్పత్తులు భారీగా ఎగుమతి చేయగలుగుతున్నది. జనాభాలో వయసు మళ్ళిన వారి శాతం పెరుగుతూ ఉండటం, యువతరం ఫ్యాక్టరీలలో పనుల కన్నా ఉన్నత చదువుల మీద దృష్టి కేంద్రీకరించడం మూలంగా చైనాలో దేశీయ పరిశ్రమల్లో భారీఎత్తున యాంత్రీకరణ అమలు చేయడం అనివార్యమైంది. చైనా ప్రభుత్వం దేశవ్యాప్తంగా 30 వేల 'స్మార్ట్' ఫ్యాక్టరీలను నిర్మించింది. పరిశ్రమలను డిజిటలైజ్ చేసి, కృత్రిమ మేధను అనుసంధానించడం ద్వారా ఈ అధునాతన 'స్మార్ట్' ఫ్యాక్టరీలను తీర్చిదిద్దింది. వీటికి తోడు మరో 1200 'అడ్వాన్స్‌డ్' స్థాయి ఫ్యాక్టరీలను 230 'ఎక్సలెంట్' స్థాయి ఫ్యాక్టరీలను నిర్మించడం ద్వారా వస్తూత్పత్తి రంగం ముఖచిత్రాన్నే సమూలంగా మార్చేసింది.

ఈ స్మార్ట్ ఫ్యాక్టరీలు అధికోత్పత్తి సాధించడానికి వీలుగా పారిశ్రామిక ఉత్పత్తి వ్యవస్థలను 'అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్', 'డేటా ఎనలిటిక్స్'తో అనుసంధానించారు. సాంకేతిక పరిభాషలో దీనినే పారిశ్రామిక అంతర్జాలం (ఇండస్ట్రియల్ ఇంటర్నెట్) అంటారు. 5జి ప్లస్ ఇండస్ట్రియల్ ఇంటర్నెట్ల అనుసంధానం ద్వారా ప్రధాన పారిశ్రామిక వాడల్లో భారీ స్థాయి ఉత్పత్తిని సాధించే అనేకానేక పైలట్ ప్రాజెక్టులను చేపట్టింది చైనా ప్రభుత్వం. 2024లో ఈ వ్యవస్థలను ఎ.ఐ తో అనుసంధానించడం ద్వారా నాణ్యత, నిర్వహణా సామర్థ్యం మెరుగుపరచడంతోపాటు స్వయం నిర్ణయం తీసుకునే శక్తిని కూడా కల్పించారు. జాతీయ స్థాయిలో, ప్రావిన్స్‌ల (రాష్ట్రాలు) స్థాయిలో స్మార్ట్ ఫ్యాక్టరీలు, డిజిటల్ వర్క్‌షాప్‌లను ఎ.ఐ తో అమసంధానించే కార్యక్రమం పెద్దఎత్తున చేపట్టారు.

చైనా ప్రభుత్వం చేపట్టిన అత్యాధునిక యాంత్రీకరణ రాత్రి కర్మాగారాలు నెలకొల్పడానికి దారితీసింది. ఈ కర్మాగారాలు మానవ జోక్యం లేకుండా పూర్తి స్థాయి కృత్రిమ మేధ, రోబోటిక్స్, అడ్వాన్స్‌డ్ సెన్సార్ల ఆధారంగా పనిచేస్తాయి. మానవ శ్రమతో ఉత్పత్తి చేపట్టడానికి రాత్రిపూట పట్టపగల్లా వెలుగునిచ్చే విద్యుత్ కాంతి, కార్మికులకు విశ్రాంతి గదులు వంటివేవీ ఈ కర్మాగారాలకు అవసరం పడవు. పగలూ, రాత్రీ అనే తేడా లేకుండా, రోజులో 24 గంటలూ ఇవి ఉత్పత్తి కొనసాగిస్తూనే ఉంటాయి. కృత్రిమ మేధలో అనుసంధానించిన మూలంగా ఈ కర్మాగారాలు మానవ సామర్థ్యానికి మించిన సామర్థ్యంతో నాణ్యతాప్రమాణాలుగల ఉత్పత్తిని సాధిస్తున్నాయి. ఈ అద్భుత ఫలితాలు చూశాక చిన్న చిన్న పరిశ్రమలు, కర్మాగారాలలో కూడా సంక్లిష్టమైన పనులకు కృత్రిమ మేధలో పని చేసే రోబోట్లను వినియోగించడం మొదలుపెట్టారు. పారిశ్రామిక ఉత్పత్తి సామర్థ్యాలను, అంక గణితాన్ని మౌలికంగా మార్చివేయడానికి ఈ యాంత్రీకరణ ఎంతగానో తోడ్పడింది. ఇవాళ చైనా పరిశ్రమల్లో వినియోగిస్తున్న రోబోట్లను అమెరికా రూపొందించుకోవాలంచే రెండింతలు ఖర్చు చెయ్యాల్సి వస్తుంది. చైనాలో విడిభాగాల ఉత్పత్తి కర్మాగారాలు, సరఫరా వ్యవస్థలు అందుబాటులో ఉండటం బాగా కలిసి వచ్చింది. గేర్లు, అయస్కాంతాల తయారీ తయారీలో 90 శాతం ప్రపంచోత్పత్తి, బ్యాటరీ సెల్‌ల తయారీలో 80 శాతం ప్రపంచోత్పత్తి కలిగిఉన్న చైనా తన ఆధిక్యతను చాటుకుంటున్నది. అరుదైన భూ ఖనిజాలు, కీలకమైన ఖనిజ లవణాల నిక్షేపాలు, వాటిని శుద్ధి చేయడం మీద చైనా ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉన్న కారణంగా-ఈ రంగంలో చైనా ప్రపంచాధిపత్యం నడుస్తుంది. అలాగే సరఫరా వ్యవస్థల మీద చైనా సాధించిన పట్టు, ప్రగతిల కారణంగా వస్తూత్పత్తి రంగంలో ఏ దేశం కూడా చైనాతో వీటికి రాగలిగే పరిస్థితుల్లో లేదు.

సంప్రదాయ పారిశ్రామిక రోబోట్ల తయారీలో పాటు చైనా సాధారణ అవసరాల కోసం తగిన హ్యూమనాయిడ్ రోబోట్ల తయారీ రంగంలో కూడా పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నది. యూని ట్రీ, యూనిటెక్ వంటి స్టార్టప్ కంపెనీలు ఇప్పటికే ఈ రోబోట్లను సరసమైన ధరలకు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చేలా చేశాయి. 2025 చివరి వాటికి భారీ ఎత్తున ఉత్పత్తి సాధించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాయి. కృత్రిమ మేధలో మంచి నేర్పరితనం, నైపుణ్యాల అభివృద్ధి కోసం సాగే పరిశోధనల రంగంలో చైనా ప్రభుత్వం భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టింది. అదే పశ్చిమ దేశాల, ముఖ్యంగా అమెరికన్ కార్పొరేట్ కంపెనీల విషయానికి వస్తే తరువాత తరం 'రోబోటిక్స్' పరిశోధనా రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి వెనుకాడుతున్నాయి. అమెరికన్ సాంకేతిక రంగం వాస్తవ ప్రపంచంలో సత్వరంగా 'సూపర్' లాభాలు సంపాదించడం మీద పెట్టే శ్రద్ధలో అర వంతు కూడా ఉత్పత్తి రంగంలో ప్రగతి సాధించడానికి అనువుగా పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా లేవు.

వస్తూత్పత్తి రంగంలో ఇవాళ చైనా చాటుతున్న ప్రపంచ అధిపత్యాన్ని గట్టిపరుచుకోవడానికి అనువుగా ఈ యాంత్రీకరణ వ్యూహాన్ని ఎంచుకున్నది. తక్కువ ఉత్పత్తి ఖర్చులు, మెరుగైన నాణ్యత, యాంత్రీకరణ ద్వారా సామర్థ్యం పెంపుదల ఆధారంగా వస్తూత్పత్తి రంగంలో చైనా తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటూ, సుంకాల భారాన్ని తట్టుకుని మరీ ప్రత్యర్థులను అధిగమించి తన ఆధిక్యాన్ని చాటుకుంటున్నది. ఎగుమతులకు ఉద్దేశించిన ఉత్పత్తులను సమీప దూరంలో తక్కువ వ్యయంతో అందించగలగడమే ఇవాళ చైనా ప్రపంచ వాణిజ్యంలో పైచేయి సాధించడానికి దోహదపడింది. రోబోటిక్స్ వ్యవస్థ మరిన్ని రోబోటిక్స్ వ్యవస్థలను ఉత్పత్తి చేయడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని ఎప్పటికప్పుడు తగ్గించుకోవడం మూలంగా చైనాతో పోటీపడడం ప్రత్యర్థి దేశాలకు అసాధ్యంగా మారింది.

ఈ నేపథ్యంలో మన దేశ స్వావలంబన అనుభవాన్ని పరిశీలిద్దాం. మోడీ ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారతాన్ని నెలకొల్పడానికి 'మేకిన్ ఇండియా' వంటి ఆర్భాటపు ప్రకటనలతో పాటు దేశంలో అడ్వాన్స్‌డ్ సెమీ-కండక్టర్ ఉత్పత్తి పరిశ్రమలు నెలకొల్పడానికి 10 బిలియన్ డాలర్ల ప్రోత్సాహక పథకాన్ని ప్రకటించింది. అయినా ఈ దిశగా ఆశించిన ప్రగతి సాధించలేకపోయింది. భారతదేశంలో ఉత్పత్తి మొదలుపెట్టడానికి కారుచౌకగా శ్రమశక్తి లభిస్తుందని చెప్పడం మినహా మోడీ ప్రభుత్వం మరేమీ అందించే పరిస్థితిలో లేదు. స్వావలంబన సాధించడమంటే ఉత్పత్తి మన దేశంలో జరిగితే చాలనే అవగాహన శుద్ధ పొరబాటు. దేశీయంగా సెమీ-కండక్టర్ల ఉత్పత్తి పరిజ్ఞానం, సాధన సంపత్తి అవసరం. సాంకేతికాభివృద్ధి సాధించడానికి మానవ వనరులతో పాటు విజ్ఞానం కూడా కీలకావసరమని మోడీ ప్రభుత్వం గుర్తించడం లేదు.

వాణిజ్యపరంగా పశ్చిమ దేశాలు చైనా మీద ఆధారపడడాన్ని తగ్గించుకోవాడానికి లేదా విడగొట్టుకోవడానికి చూస్తున్నాయి. కాబట్టి ఆ స్థానాన్ని మనం దక్కించుకోవచ్చని భారత పాలకవర్గాలు భావిస్తున్నాయి. అయితే అది అడియాశ కాక మానదని ప్రభుత్వం విడుదల చేసిన 2024 ఆర్థిక సర్వే నివేదిక సూచిస్తున్నది. 'భారతదేశం వస్తూత్పత్తి రంగంలో ముందంజ సాధించాలంటే ప్రపంచ సరఫరాల వ్యవస్థతో మన దేశం అనుసంధానించుకోవాల్సి ఉంటుంది. ఇది జరగాలంటే భారత దేశం ముందుగా చైనా సరఫరాల వ్యవస్థతో అనివార్యంగా అనుసంధానించ బడాలి. దీనికోసం అయితే పూర్తిగా చైనా దిగుమతుల మీద ఆధారపడాలి లేదా పాక్షికంగా చైనా పెట్టుబడులను ఆహ్వానించాలి. భారత్ ఈ రెండింటిలో ఏదో ఒక ప్రత్యామ్నాయాన్ని ఎంచుకోవాలి' అని ఆ నివేదిక స్పష్టం చేసింది.

చైనా సాధించిన వ్యూహాత్మక ప్రగతి నుండి మన దేశం కీలకమైన గుణపాఠాలు తీసుకోవచ్చు. శాస్త్ర-సాంకేతిక రంగాల్లో స్వావలంబన సాధించడానికి చైనా ప్రభుత్వం సంవత్సరాలవారీగా జాతీయ వ్యూహం, లక్ష్యాలు రూపొందించుకోవడంతోపాటు ఈ లక్ష్య సాధనకు ప్రభుత్వ పెట్టుబడులు భారీగా సమకూర్చింది. చౌక శ్రమ శక్తిని ఎరగా చూపి విదేశీ పెట్టుబడుల మీద ఆధారపడలేదు. పటిష్టమైన వారి శ్రామిక పునాదిని నెలకొల్పడానికి దేశీయంగా సాధన సంపత్తిని, విజ్ఞానాన్ని, కీలక వనరులను అభివృద్ధి చేసుకున్నది. భారతదేశం స్వావలంబన సాధించాలంటే అసెంబ్లింగ్ యూనిట్లు నెలకొల్పడానికి మించిన ప్రణాళికలను రూపొందించుకోవాలి. విద్యా, పరిశోధనా రంగాలలో ప్రభుత్వం మరింతగా పెట్టుబడులు సమకూర్చి నైపుణ్యం గల కార్మిక వర్గాన్ని, దేశీయ సాంకేతికతను అభివృద్ధి చేసుకోవాలి. వస్తూత్పత్తి రంగంలో చైనా అగ్రగామిగా నిలబడడానికి పునాది స్థాయి నుండి సాంకేతిక పరిజ్ఞానాన్ని వస్తూత్పత్తి సామర్థ్యంతో మిళితం చేసుకోవడంతో పాటు ఈ రంగంలో అత్యధికంగా ప్రభుత్వ పెట్టుబడులు పెట్టింది. రోబోటిక్స్, కృత్రిమ మేధల ద్వారా దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించుకుంది. మోడీ ప్రభుత్వం మాత్రం దేశీ, విదేశీ ప్రైవేటు పెట్టుబడులు మీద ఆధారపడి వస్తూత్పత్తి రంగంలో ముందంజ వెయ్యాలని ఎదురు చూస్తున్నది. చివరికి ఈ ప్రభుత్వానికి ఎదురుచూపులే మిగిలే పరిస్థితులు నెలకొన్నాయి.

అగ్నికీలలు మింగేస్తున్నా పాఠాలు నేర్వమా!

సందర్భం

ప్రణాళికాబద్ధం కాని వేగవంతమైన పట్టణీకరణ అధిక జనసాంద్రతకు దారితీసింది. వాణిజ్య, నివాస స్థలాలు పక్కపక్కనే ఉండటం, ఒకే భవనాన్ని వివిధ అవసరాలకు వినియోగించడం అగ్ని ప్రమాదాల తీవ్రతను పెంచుతుంది. అనేక నగర చారిత్రక కేంద్రాలు, ఇరుకైన వీధులు, ఒకదానికొకటి ఆనుకుని ఉండే భవనాలతో నిండి ఉంటాయి. ఇవి ఆధునిక అగ్నిమాపక వాహనాలు, రెస్క్యూ పరికరాలు ఘటనా స్థలానికి చేరుకోవడానికి, పనిచేయడానికి తీవ్ర ఇబ్బంది కలిగిస్తాయి. చిన్న మంటలు కూడా నియంత్రణకు అందని మహా విషాదాలుగా మారతాయి. అక్రమ నిర్మాణాలతో పాటు ఆక్రమణలు అత్యవసర మార్గాలను మూసివేస్తాయి. ప్రాణాలను కాపాడే అవకాశాలను తగ్గిస్తాయి.

హైదరాబాద్‌లో ఇటీవల సంభవించిన ఘోర అగ్ని ప్రమాదం, ఎనిమిది మంది చిన్నారులతో సహా పదిహేడు నిండు ప్రాణాలను బలిగొంది. వేగంగా విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాలు అగ్ని ప్రమాదాలకు కేంద్రాలుగా ఎలా మారుతున్నాయో ఈ దుర్ఘటన మరోసారి స్పష్టం చేసింది. వ్యవస్థాపక లోపాలు, మౌలిక సదుపాయాల కొరత, సమిష్టి బాధ్యతలో ఉన్న వైఫల్యాల కారణంగా పదే పదే సంభవిస్తున్న దుస్థితికి ఇది నిదర్శనం. ఇలాంటి ప్రమాదాలు యాదృచ్ఛికంగా జరుగుతాయనుకుంటే పొరపాటే. తరచుగా ఇవి నిబంధనల ఉల్లంఘనలు, మౌలిక లోపాలు, భద్రత పట్ల నిర్లక్ష్యం వంటి పలు అంశాల పర్యవసానమే. ఈ విపత్తుల విష వలయం నుండి బయటపడాలంటే, మన నగరాలు ఎందుకు అగ్నికి ఆహుతవుతున్నాయో సమగ్రంగా విశ్లేషించి, భవనాలను నిర్మించే, నియంత్రించే, నివసించే విధానంలో సమూల మార్పులు తీసుకురావాలి.

నిర్లక్ష్యపు నిప్పు రవ్వలు మంటలు చెలరేగడానికి ముఖ్య కారణాలు చూస్తే, భవనాల్లో ఎక్కువగా దారితీసేవి విద్యుత్ సంబంధిత లోపాలే. నాసిరకం విద్యుత్ వైరింగ్, నిర్వహణ సరిగా లేని పాత వ్యవస్థలు, అధిక లోడు మోస్తున్న సర్క్యూట్లు, అర్హత లేనివారితో చేయించిన తాత్కాలిక మరమ్మతులు...షార్ట్ సర్క్యూట్లు, వైరింగ్ కాలిపోవడానికి ప్రధాన కారణాలుగా నిలుస్తాయి. ముఖ్యంగా పురాతన భవనాలలో, నిబంధనలకు విరుద్ధంగా విస్తరించిన నిర్మాణాలలో ఈ సమస్య తీవ్రం. ఇది నివాస, వాణిజ్య స్థలాలను క్షణంలో అంటుకునే పదార్థాలుగా మారుస్తుంది. వంట గ్యాస్ సిలిండర్ల లీకేజీలు, లోపభూయిష్టమైన రెగ్యులేటర్లు, గ్యాస్ పైప్‌లైన్లు కూడా ప్రమాదకరమే. సులభంగా మంటలు అంటుకునే పెయింట్లు, రసాయనాలు, ప్లాస్టిక్ వంటి వాటిని అజాగ్రత్తగా నిల్వ చేయడం, మానవ నిర్లక్ష్యం కూడా ఇటువంటి ప్రమాదాలకు తోడవుతున్నాయి. అజాగ్రత్తగా వదిలేసిన సిగరెట్లు, వంట చేసేటప్పుడు శ్రద్ధ వహించకపోవడం, సరిగా పర్యవేక్షించకుండా హీటింగ్ పరికరాలు వాడటం వంటివి చిన్నగా మొదలై పెద్ద విపత్తులుగా రూపాంతరం చెందుతాయి. కనీస భద్రతా వ్యవస్థలు లేని ప్రదేశాలలో ఈ లోపాలు ప్రాణాంతకంగా మారతాయి.

ప్రణాళికాబద్ధం కాని వేగవంతమైన పట్టణీకరణ అధిక జనసాంద్రతకు దారితీసింది. వాణిజ్య, నివాస స్థలాలు పక్కపక్కనే ఉండటం, ఒకే భవనాన్ని వివిధ అవసరాలకు వినియోగించడం అగ్ని ప్రమాదాల తీవ్రతను పెంచుతుంది. అనేక నగర చారిత్రక కేంద్రాలు ఇరుకైన వీధులు, ఒకదానికొకటి ఆనుకుని ఉండే భవనాలతో నిండి ఉంటాయి. ఇవి ఆధునిక అగ్నిమాపక వాహనాలు, రెస్క్యూ పరికరాలు సంఘటనా స్థలానికి చేరుకోవడానికి, పనిచేయడానికి తీవ్ర ఇబ్బంది కలిగిస్తాయి. చిన్న మంటలు కూడా నియంత్రణకు అందని మహా విషాదాలుగా మారతాయి. అక్రమ నిర్మాణాలతో పాటు ఆక్రమణలు అత్యవసర మార్గాలను మూసివేస్తాయి. ప్రాణాలను కాపాడే అవకాశాలను తగ్గిస్తాయి. సరైన నిష్క్రమణ మార్గాలు లేకపోవడం వల్ల మంటలు చెలరేగినప్పుడు భవనం నుండి బయటపడటం కష్టమవుతుంది.

సమస్యకు మరో కీలక కోణం ఏమిటంటే, మన దేశంలో అగ్ని భద్రతా నియమాలు ఉన్నప్పటికీ, వాటి అమలులో తీవ్ర లోపాలున్నాయి. నేషనల్ బిల్డింగ్ కోడ్, వివిధ రాష్ట్రాల అగ్నిమాపక సేవల చట్టాలు భవన నిర్మాణంలో భద్రతా ప్రమాణాలైన ఫైర్-రెసిస్టెంట్ మెటీరియల్ వాడకం, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ డిటెక్షన్, అణచివేత వ్యవస్థలు, తప్పనిసరి ఆడిట్‌లు, నిరభ్యంతర ధృవీకరణ పత్రం తప్పనిసరి చేస్తాయి. అయినప్పటికీ వీటి ఆచరణలో అనేక లోపాలున్నాయి. తగినంత మంది శిక్షణ పొందిన ఇన్‌స్పెక్టర్లు లేకపోవడం, నియంత్రణ సంస్థలలో వనరుల కొరత, తనిఖీ అనుమతి ప్రక్రియలో జాప్యం, అవినీతి, భద్రతా నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం, బాధ్యులను న్యాయస్థానాలకు అప్పగించే ప్రక్రియలో లోపం...నిర్లక్ష్యాన్ని ప్రోత్సహిస్తున్నాయి. అనేక భవనాలు, ముఖ్యంగా పెద్ద నివాస, వాణిజ్య సముదాయాలు కూడా, సరైన అగ్నిమాపక అనుమతులు లేకుండా లేదా కాలం చెల్లిన భద్రతా వ్యవస్థలతో పనిచేస్తున్నాయి. అంతేకాకుండా, అగ్ని భద్రత పట్ల విస్తృతమైన ప్రజా అవగాహన లేకపోవడం, సౌలభ్యం ఖర్చులకు ప్రాధాన్యత ఇచ్చే సంస్కృతి కూడా ఈ సమస్య తీవ్రతరం చేస్తున్నాయి. భవనాలలో నివసించే వారికి, పని చేసే వారికి ప్రాథమిక అగ్ని భద్రతా పద్ధతులు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు ఎక్కడ ఉన్నాయో తెలియదు.

అగ్నిమాపక పరికరాలు ఎలా వాడాలో అవగాహన ఉండదు. ప్రైవేట్ భవనాలలో అగ్నిమాపక డ్రిల్స్ నిర్వహించడం చాలా అరుదు. ఓవర్‌లోడ్ అయిన ఎలక్ట్రికల్ సాకెట్లు, అడ్డంగా ఉన్న మెట్ల మార్గాలు వంటి చిన్న చిన్న భద్రతా లోపాలను ఒక పెద్ద ప్రమాదం జరిగే వరకు పట్టించుకోని ధోరణి ఎక్కువగా ఉంటుంది.

ఈ బహుముఖ సమస్యను పరిష్కరించడానికి పటిష్టమైన, సమగ్ర వ్యూహం అవసరం. దీనికి ప్రభుత్వ నిబద్ధత, కఠినమైన అమలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా భాగస్వామ్యం తప్పనిసరి. కేవలం చట్టాలు ఉండటం కాదు. వాటిని అమలు చేసే యంత్రాంగం బలంగా ఉండాలి. వాణిజ్య, నివాస, పారిశ్రామిక, ప్రభుత్వ భవనాలకు తప్పనిసరిగా నిర్ణీత కాల వ్యవధిలో అగ్ని భద్రతా ఆడిట్‌లు నిర్వహించాలి. వీటిని స్వతంత్ర, అర్హత కలిగిన థర్డ్ పార్టీల ద్వారా చేయించాలి. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే ప్రాంగణాలను సీల్ చేయాలి. ప్రమాదం జరిగితే క్రిమినల్ బాధ్యత వహించేలా చట్టాలు బలంగా ఉండాలి. అనుమతి ప్రక్రియను పారదర్శకంగా, అవినీతి రహితంగా, సాంకేతిక ఆధారితంగా మార్చాలి. రెండవది, అగ్నిమాపక విభాగాన్ని బలోపేతం చేయడానికి గణనీయమైన పెట్టుబడి పెట్టాలి. పట్టణ సవాళ్లకు అనుగుణంగా ఆధునిక పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది సంఖ్యను పెంచడం, కమ్యూనికేషన్ వ్యవస్థలు మెరుగుపరచడం, నీటి వనరుల లభ్యత (ఫైర్ హైడ్రెంట్లు) వంటివి వారికి తప్పనిసరిగా అందించాలి. పట్టణ ప్రణాళికలోనే అగ్ని భద్రతను ఒక భాగంగా చూడాలి. పాత భవనాలకు ఆధునిక భద్రతా సదుపాయాలను కల్పించడానికి ప్రోత్సాహకాలు ఇచ్చి, క్రమంగా వాటిని తప్పనిసరి చేయాలి. మూడవది, భవనాల యజమానులు, ఆపరేటర్లు, నిర్వాహకులు తమ ప్రాంగణాలలో అగ్ని భద్రతా ప్రమాణాలను పాటించే బాధ్యతను చట్టపరంగా వహించాలి. విద్యుత్ వ్యవస్థలు, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలను క్రమం తప్పకుండా తనిఖీ నిర్వహణ చేయడం విధిగా మారాలి. చివరగా, విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు ప్రాథమిక శిక్షణ ద్వారా పౌరులను అగ్ని భద్రతపై చైతన్యపరచాలి. ప్రమాదకర పరిస్థితులను ఎలా గుర్తించాలి. అగ్నిమాపక పరికరాలను ఎలా ఉపయోగించాలి, సురక్షితంగా ఎలా బయటపడాలి వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. నిబంధనలు పాటించని వారిపై ఫిర్యాదు చేయడానికి సులభ మార్గాలను అందుబాటులో ఉంచడం కూడా పౌర పర్యవేక్షణను పెంచుతుంది. అగ్ని భద్రతకు సంబంధించిన నియమాలు, నిబంధనలు, నిపుణుల సూచనలు అన్నీ అందుబాటులో ఉన్నాయి. కావలసింది ఏమిటంటే, ప్రభుత్వంలో అత్యున్నత స్థాయిల నుండి సాధారణ పౌరుల వరకు అందరిలో నిబద్ధత, చట్టాలను పటిష్టంగా అమలు చేసే సంకల్పం, మౌలిక సదుపాయాలలో పెట్టుబడి, భద్రతకు ప్రాధాన్యత ఇచ్చే సంస్కృతిని పెంపొందించడం, బాధ్యతాయుతమైన వారిపై చర్యలు తీసుకోవడం. అప్పుడే మనం ఇలాంటి విషాదాలు పునరావృతం కాని సురక్షితమైన నగరాలను నిర్మించగలం. చర్య తీసుకోవాల్సిన సమయం నిన్ననే గడిచిపోయింది. మరో ప్రమాదం జరిగే వరకు మనం వేచి ఉండాల్సిన అవసరం లేదు. ఇప్పుడు మనం మేల్కోవాల్సిన సమయం ఆసన్నమైంది.

- దుంగ జనక మోహనరావు,
సెల్ : 8247045230

ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త జయంత్ నార్లికర్ కన్నుమూత

ప్రధానిసహా పలువురు ప్రముఖుల సంతాపం



పూనె : ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త, సైన్స్ కమ్యూనికేటర్, రచయిత, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ జయంత్ విష్ణు నార్లికర్ (87) మంగళవారం కన్నుమూశారు. ఆయన ఇటీవలే పూనెలోని ఒక ఆసుపత్రిలో తుంటి శస్త్రచికిత్స చేయించుకున్నారని, హఠాత్తుగా మంగళవారం ఉదయం తెల్లవారుజామున నిద్రలోనే మరణించారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. జయంత్ నార్లికర్ విజ్ఞాన శాస్త్రాన్ని ప్రాచుర్యంలో తీసుకురావడానికి విశేష కృషి చేశారు. దేశంలో ప్రముఖ పరిశోధనా సంస్థలను స్థాపించడానికి ఆయన చేసిన కృషికి గుర్తింపు లభించింది. 1938 జులైలో జన్మించిన ఆయన బనారస్ హిందూ విశ్వవిద్యాలయం (బిహెచ్‌యు)లోనూ, కేంబ్రిడ్జి యూనివర్సిటీలో విద్యను పూర్తి చేశారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీలో గణిత శాస్త్ర ట్రిపోస్‌లో రాంగ్లర్, టైసన్ పతక విజేతగా నిలిచారు. 1972–1989లో భారతకి తిరిగి వచ్చి... టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో చేరారు. ఈ ఇనిస్టిట్యూట్‌లో ఆయన ఆధ్వర్యంలో థియరిటికల్ ఆస్ట్రోఫిజిక్స్ గ్రూప్‌ను విస్తరించారు. ఇది అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఆయనను 1988లో ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐయుసిఎఎ)ను స్థాపించడంలో వ్యవస్థాపక డైరెక్టర్‌గా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఆహ్వానించింది. అప్పటి నుంచి ఆయన 2003లో పదవి విరమణ చేసే వరకు ఐయుసిఎఎ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో ఐయుసిఎఎ ఖగోళ శాస్త్రం, ఖగోళ భౌతిక శాస్త్రంలో బోధన, పరిశోధనలో అత్యుత్తమ కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతిని పొందింది. 2012లో థర్డ్ వరల్డ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ డాక్టర్ నార్లికర్‌కు సైన్స్‌లో ఎక్సలెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు బహుమతిని ప్రదానం చేసింది. ఆయన తన శాస్త్రీయ పరిశోధనతోపాటు పుస్తకాలు, వ్యాసాలు, రేడియో/టీవీ కార్యక్రమాల ద్వారా సైన్స్ కమ్యూనికేటర్‌గా కూడా ప్రసిద్ధి చెందారు. ఆయన రచించిన సైన్స్ ఫిక్షన్ కథలకు కూడా ప్రసిద్ధి చెందారు. సైన్స్ ప్రాచుర్యం కోసం ఆయన చేసిన రచనలకు 1996లో యునెస్కో కళింగ అవార్డుతో సత్కరించింది. నార్లికర్ 26 ఏళ్ల వయసులోనే అంటే 1965లో పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు. 2004లో పద్మవిభూషణ్ అవార్డు లభించింది. 2011లో మహారాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అత్యున్నత పౌర పురస్కారం మహారాష్ట్ర భూషణ్‌తో సత్కరించింది. 2014లో సాహిత్య అకాడమీ ప్రాంతీయ భాష మరాఠీలో రచించిన ఆయన ఆత్మకథను అత్యున్నత బహుమతికి ఎంపిక చేసింది. జయంత్ విష్ణు నార్లికర్ మృతిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. నార్లికర్ మృతి దేశ విజ్ఞాన సమాజానికి తీవ్ర లోటుగా పేర్కొన్నారు. ఖగోళ శాస్త్రంలో ఆయన విశేష కృషి చేశారని, ఆ కృషి ముందు తరాలకు కూడా మార్గదర్శకంగా ఉంటుందని తెలిపారు. నార్లికర్ మృతితో దేశం ఒక విజనరీ ఖగోళ శాస్త్రవేత్తను కోల్పోయిందని ఇస్రో మాజీ చైర్మన్ ఎస్ సోమనాథ్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. నార్లికర్ రచించిన 'ది లైటర్ సైడ్ ఆఫ్ గ్రావిటీ', 'సెవెన్ వండర్స్ ఆఫ్ ది కాస్మోస్' వంటి ప్రముఖ రచనలతో తన తరం ఎంతో స్ఫూర్తి పొందిందని సోమనాథ్ తెలిపారు. పూణెలో ఐయుసిఎఎను స్థాపించడం ద్వారా నార్లికర్ దేశంలో శాస్త్ర విద్యా, పరిశోధన రంగం ముందుకు వెళ్లడానికి తనదైన సహకారం అందించారని మహారాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ పేర్కొన్నారు. నార్లికర్ మృతి సిపిఎం మహారాష్ట్ర రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. శాస్త్ర విద్య, పరిశోధన రంగంలో ఆయన విశేష సేవలందించారని పేర్కొంది.

రాజీనామా ఏదీ?

- కోర్టులు అక్షింతలు వేసినా పదవిలో కొనసాగుతున్న విజయ్ షా
- చర్య తీసుకోని బిజెపి నాయకత్వం

భోపాల్ : సైనికాధికారి కల్నల్ సోఫియా ఖురేషిని లక్ష్యంగా చేసుకొని అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ బిజెపి మంత్రి విజయ్ షాపై ఉన్నత న్యాయ స్థానాలు ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ ఆయన పదవి నుండి వైదొలగడం లేదు. మతపరమైన, అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన షాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. షా క్షమాపణను తోసిపుచ్చుతూ విచారణ జరపాల్సిందేనని అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది. సిట్ విచారణకు ఆదేశించింది. అయినప్పటికీ ఆయన పదవిలో కొనసాగుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి ఉమాభారతి సహా పలువురు బిజెపి నాయకులు విజయ్ షా తప్పిదాన్ని వేలెత్తి చూపినప్పటికీ పార్టీ నాయకత్వం ఆయన వ్యాఖ్యలను ఖండించడం కానీ, ఆయన రాజీనామాను కోరడం కానీ జరగలేదు. అంతేకాదు రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ విజయ్ షాను వెనకేసుకొస్తున్నారు. కోర్టు ఆదేశాలను తమ ప్రభుత్వం పాటించిందని చెప్పుకుంటున్నారు. విద్వేష ధోరణికి వ్యతిరేకంగా న్యాయ వ్యవస్థ సైతం చర్యకు ఉపక్రమించినప్పుడు రాజకీయ నాయకత్వం ఎందుకు మౌనంగా ఉంటోంది? ఈ నెల 12న జరిగిన ఓ బహిరంగ సభలో కల్నల్ సోఫియా ఖురేషిని ఉగ్రవాదుల సోదరిగా షా అభివర్ణించారు. ఆమె మతాన్ని ఉగ్రవాదంతో ముడిపెట్టారు. ఆపరేషన్ సిందూర్ విజయానికి గుర్తుగా తిరంగ యాత్రలు చేపట్టిన బిజెపి ... అదే సమయంలో సైనికాధికారిపై మతపరమైన వ్యాఖ్యలు చేసిన మంత్రిని రక్షిస్తోంది.

విజయ్ షాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మధ్యప్రదేశ్ హైకోర్టు ఈ నెల 14న ఆదేశాలు జారీ చేసింది. ఆ ఉత్తర్వులు వెలువడిన గంటల వ్యవధిలోనే ఇండోర్‌లోని మన్పూర్ పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహితలోని 152, 196 (1) (బి), 197 (1) (సి) సెక్షన్ల ప్రకారం షాపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పిన విజయ్ షా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని తెలుస్తోంది. ఆయన ఎక్కడ ఉన్నదీ తెలియడం లేదు.

ద్వేషపూరిత ప్రసంగాలపై కేసులు నమోదు చేయాలని 2023 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలనూ ఆదేశించింది. తన ఆదేశాలను పాటించని పక్షంలో కోర్టు ధిక్కార చర్యలు తీసుకుంటానని హెచ్చరించింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో విద్వేష ప్రసంగాల కేసులు అత్యధిక సంఖ్యలో నమోదైనప్పటికీ అనేక మంది నాయకులపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. 'షా చేసింది ద్వేషపూరిత ప్రసంగం కాదు. అది సైన్యంపై జరిగిన ప్రత్యక్ష దాడి. మతపరమైన దూషణలకు మించి జాతీయ స్థాయిలో ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు అనేక సందర్భాలలో చెప్పింది. కానీ ఏమీ జరగడం లేదు' అని న్యాయవాది ప్రత్యూష్ మిశ్రా చెప్పారు. విజయ్ షాకు వివాదాలు కొత్తేమీ కాదు. 2013లో శివరాజ్ సింగ్ చౌహాన్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేస్తున్న సమయంలో చౌహాన్ తన భార్య సాధనా సింగ్‌ను ఉద్దేశించి లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. దీనిపై రచ్చ జరగడంతో తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. నెలల వ్యవధిలోనే మళ్లీ మంత్రి పదవి పొందారు. ఆయనపై చర్య తీసుకోకపోగా, చర్య తీసుకోవాలని ఆందోళన చేస్తున్న వారిపై మధ్యప్రదేశ్ రాజ్‌భవన్‌సహా పలు ప్రాంతాల్లో పోలీసులు దాడి చేసిన ఘటనలు చోటుచేసుకోవడం గమనార్హం.

దాడులకు గురైన ప్రాంతాలను యుద్ధ ప్రభావిత జోన్లుగా ప్రకటించండి

- ప్రభుత్వానికి మెహబూబా ముఫ్తీ విజ్ఞప్తి

శ్రీనగర్ : జమ్ము కాశ్మీర్‌లో బాంబు దాడులకు గురైన ప్రాంతాలను యుద్ధ ప్రభావిత జోన్లుగా ప్రకటించాలని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి) అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి అమరవీరుల హోదా ఇవ్వాలని కోరారు. శ్రీనగర్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ..దాడుల్లో ఇళ్లు కోల్పోయిన వారికి రూ.50 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారికి అమరవీరుల హోదా కల్పిస్తూ, కుటుంబంలో ఒకరి ఉద్యోగం కల్పించాలని అన్నారు. ఈ దాడుల కారణంగా పూంచ్, ఉరి, తంగ్ధర్, కుప్వారాలోని అనేక ప్రాంతాలు ధ్వంసమయ్యాయని, స్థానికులు ఇళ్లను, కుటుంబ సభ్యులను, ఆస్తులను కోల్పోయారని అన్నారు. కొంతమందికి నివసించడానికి టెంట్లు కూడా లేవని చెప్పారు. దుకాణాలు దెబ్బతిన్న వారికి బీమా అందించడానికి బ్యాంకులు నిరాకరిస్తున్నాయని, ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. గృహ రుణాలు తీసుకొని, ఇళ్లు కోల్పోయిన వారి రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యకు యుద్ధం పరిష్కారం కాదని, యుద్ధాన్ని సమర్థించేవారంతా సరిహద్దుల్లో తమ కుటుంబాలతో ఉండాలని అన్నారు. ఆపరేషన్ సిందూర్ వల్ల ఏం సాధించారో తాను చెప్పలేనని, సరిహద్దుల్లో ఉంటున్న ప్రజలు దాని పరిణామాలను అనుభవించారని చెప్పారు. బిజెపిని ప్రశ్నించేవారిని దేశ వ్యతిరేకులుగా చిత్రీకరిస్తున్నారని విమర్శించారు.

యూ ట్యూబర్ జ్యోతిపై ఎన్ఐఎ, ఐబి విచారణ

చండీగఢ్ : పాకిస్తాన్‌కు గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలపై అరెస్టయిన యూ ట్యూబర్ జ్యోతి మల్హోత్రాను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ), ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి) అధికారులు విచారణ చేస్తున్నారని హర్యానా పోలీసులు వెల్లడించారు. ఆమె ఆర్థిక లావాదేవీలు, ప్రయాణ వివరాలపై కూడా దర్యాప్తు జరుగుతోందని మంగళవారం తెలిపారు.

ఐఆర్ఇఎల్ (ఇండియా) లిమిటెడ్
(భారత ప్రభుత్వ సంస్థ–అటామిక్ ఎనర్జీ విభాగం)
మనవాలకురిచి, తమిళనాడు, ఈ–మెయిల్: purchase-mk@irel.co.in
An ISO 9001, 14001 & 45001 యూనిట్, ఫోన్: 04651-200402
CIN: U15100MH1950GOI008187

రిఫరెన్స్: ఎంకె/పి.ప్రకటన/2025–26/02 తేదీ: 20.05.2025

టెండరు ప్రకటన

IREL మనవలకురిచి యూనిట్ కింది వాటి కోసం టెండర్‌ను ఆహ్వానిస్తుంది:

టెండర్ నెం.	వివరణ
GEM/2025/B/6225790	ఇండస్ట్ రోల్ మాగ్నెటిక్ సెపరేటర్ యొక్క సరఫరా మరియు ఇన్‌స్టాలేషన్ పర్యవేక్షణ.
IREL/MK/ET/03/2025	ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఇపిసి) ఆధారంగా HUS (MK యూనిట్) వద్ద డీ–స్లిమింగ్ సిస్టమ్ యొక్క ఇన్‌స్టాలేషన్ కోసం ఏజెన్సీ ఎంపిక కోసం ప్రతిపాదన (RFP) కోసం అభ్యర్థన.

బిడ్డర్ టెండర్ పత్రాన్ని https://gem. gov.in, https://www.irel.co.in మరియు సిపిపి పోర్టల్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పై టెండర్‌కు ఏదైనా సవరణ / పొడిగింపు పై వెబ్‌సైట్‌లలో మాత్రమే హోస్ట్ చేయబడుతుంది.

CBC 48147/12/0003/2526 సిజిఎం & హెడ్, ఎంకె

భారత ప్రభుత్వం
పర్యావరణ, అడవులు మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ
ఉప కార్యాలయం
6వ అంతస్తు అరణ్య భవన్, సైఫాబాద్, హైదరాబాద్
అసోసియేట్ (లీగల్) నియామకం కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ప్రకటన ఏ–నెం.01/2025

విషయం: హైదరాబాద్‌లోని పర్యావరణ అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖలోని సబ్ ఆఫీస్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన అసోసియేట్ (లీగల్)–ఏ ని నియమించుకోవడానికి ప్రకటన.

హైదరాబాద్‌లోని పర్యావరణ అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖలోని సబ్ ఆఫీస్‌లో ఒక (01) అసోసియేట్ (లీగల్)–ఏని నియమించుకోవడానికి దరఖాస్తులు ఆహ్వానించబడ్డాయి. నెలవారీ వేతనం రూ.40000/– (రూపాయలు నలభై వేలు మాత్రమే) చెల్లించబడును.

2) దరఖాస్తు ఫారంతోపాటు ప్రకటన యొక్క పూర్తి వివరాలను పర్యావరణ అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ వెబ్‌సైట్: www.moef.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అర్హతగల అభ్యర్థులు తమ దరఖాస్తులను ప్రకటనలో సూచించిన ఫార్మాట్‌లో, అన్ని సహాయక పత్రాలతో పాటు క్రిందపేర్కొన్న చిరునామాకు పంపవచ్చు: **అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్ (సెంట్రల్)/హెడ్ ఆఫ్ ఆఫీస్ సబ్ ఆఫీస్, మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్, 6వ అంతస్తు, అరణ్య భవన్, సైఫాబాద్, హైదరాబాద్–500004.**

3) దరఖాస్తు ఫారమ్ యొక్క సాఫ్ట్ కాపీని అన్ని సహాయక పత్రాలతో పాటు ఇ–మెయిల్ ఐడి: iro.hyderabad-mefcc@gov.in కు కూడా నిర్ణీత కాలపరిమితిలోపు పంపవచ్చు.

4) నిర్ణీత ఫార్మాట్‌లో దరఖాస్తులను సహాయక పత్రాలతో పాటు స్వీకరించడానికి చివరి తేదీ ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి 21 రోజులుగా ఉంటుంది.

కైలాష్ భీమ్‌రావ్ భవార్
అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్ (సి)/హెడ్ ఆఫ్ ఆఫీస్

CBC 13134/12/0002/2526

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో విలీనమైనది)
IDFC FIRST Bank
CIN: L65110TN2014PLC097792
రిజిష్టర్డు ఆఫీసు:– కెఆర్ఎం టవర్స్, 8వ అంతస్తు, హారింగ్టన్ రోడ్, చెట్పెట్, చెన్నై–600031.
టెలి: +91 44 4564 4000, ఫ్యాక్స్: +91 44 4564 4022

అనుబంధం 4 (రూల్ 8(1)) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైనది)** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, తేదీ: **05.03.2025** నాటి డిమాండ్ నోటీసు జారీచేసి, రుణగ్రహీత, సహ–రుణగ్రహీతలు మరియు హామీదారులు **1. మెసర్స్ వివిఎస్‌హెచ్ సీ ఫుడ్స్, 2. హరీష్ పిడుగు, 3. దేవి పిడుగు** లను సదరు డిమాండ్ నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు **03.03.2025** నాటికి గల మొత్తాలు **రూ.79,24,832/– (రూపాయలు డెబ్బైతొమ్మిది లక్షల ఇరువై నాలుగు వేల ఎనిమిది వందలు ముప్పై నాలుగు మాత్రమే)** లను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.

రుణగ్రహీతలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు ది సెక్యూరిటీ ఇంటెరెస్టు (ఎన్ఫోర్సుమెంటు) రూల్సు, 2002 యొక్క రూలు 8తో చదువబడే చట్టం యొక్క సెక్షను 13 యొక్క సబ్–సెక్షను (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించిన ఆస్తిని **17 మే, 2025న లాంఛనప్రాయంగా స్వాధీనంచేసుకున్నారు.**

ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైనది)**నకు డిమాండ్ నోటీసు తేదీ నుండి తదుపరి వడ్డీ& ఇతర చార్జీలతోసహా డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాలు **రూ.79,24,832/– (రూపాయలు డెబ్బైతొమ్మిది లక్షల ఇరువై నాలుగు వేల ఎనిమిది వందలు ముప్పై నాలుగు మాత్రమే)** లను మరియు దానిపై వడ్డీతోసహా చెల్లింపులుచేయుటకులోబడి ఉంటుంది.

సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్–సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీతలు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

స్థిరాస్తుల వివరణ:

కొరెటిపాడు, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధుల్లో మరియు గుంటూరు జిల్లా యొక్క ఎస్.ఆర్.ఓ. కొరెటిపాడు పరిధిల్లో, ఆం.ప్ర–522007 వద్దగల చాగంటి సంబిరెడ్డి, 1వ క్రాస్‌లోగల పాత మున్సిపాలిటీ వార్డు నం.1, అదేవిధంగా వార్డు నం.2, ప్రస్తుత వార్డు నం.14, బ్లాక్ నం.5, టి.ఎస్.నం.252, పాత మున్సిపల్ అసెస్మెంట్ నం. 7150/బి, అదేవిధంగా అసెస్మెంట్ నం. 36828, ప్రస్తుత అసెస్మెంట్ నం. 1021036828, పాత డోర్ నం. 4–8–61ఎ, ప్రస్తుత డోర్ నం.4–8–60/ఎ లో 125.0చ.గ.లు లేదా 104.51 చ.మీ.లలో నిర్మించిన గ్రౌండ్, 1వ, 2వ మరియు 3వ అంతస్తులతో కలిగియున్న ఆర్.సి.సి. రూఫ్డ్ భవనము యొక్క మొత్తం భాగం. మరియు సరిహద్దులు: **తూర్పు: అట్ల జగన్‌మోహన్ రెడ్డికి విక్రయించబడిన ఆస్తి, పడమర: అట్ల రామకృష్ణ రెడ్డికి విక్రయించబడిన ఆస్తి, ఉత్తరం: అట్ల రామకృష్ణ రెడ్డికి విక్రయించబడిన ఆస్తి, దక్షిణం: అట్ల సంబి రెడ్డి& ఇతరులకు విక్రయించబడిన ఆస్తి,**

తేది: 17.05.2025
ప్రదేశం: ఆం.ప్ర.
లోన్ ఖాతా నం: 10156029074 & 10156029085

సం/–
అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో విలీనమైనది)

గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
GRIHUM HOUSING FINANCE — Apna Ghar. Apni Pehchan
(గతంలో పూనావాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది)
నమోదిత కార్యాలయం : 6వ అంతస్తు, బి–బిల్డింగ్, గంగా ట్రూనో బిజినెస్ పార్క్, లోహెగావ్, పూణె మహారాష్ట్ర–411014.

డిమాండ్ నోటీసు
సర్ఫాసీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద

మీరు క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు/హామీదారులు గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పేర్కొనబడిన పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ 17 నవంబర్, 2023 నుండి గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడింది) (గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది మరియు వాస్తవంలో జి ఇ మనీ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ అన్‌లిమిటెడ్ కంపెనీతో విలీనం చేయబడింది) నుండి మీ స్థిరాస్తులను తనఖా పెట్టడం ద్వారా ఆస్తి సౌకర్యాలపై గృహ రుణాలు/లోనులు పొంది ఉన్నారు, సెక్యూర్డ్ క్రెడిటర్"గా సూచించిన తర్వాత ఇక్కడ. మీరు తిరిగి చెల్లించడంలో డిఫాల్ట్ అయ్యారు కాబట్టి, మీ లోన్/లు నాన్–పెర్ఫార్మింగ్ అసెట్‌లుగా వర్గీకరించబడ్డాయి. బకాయిల రికవరీ కొరకు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు చివరిగా తెలిసిన చిరునామాలకు పంపబడినవి అయితే అవి అందించబడని విధంగా తిరిగి వచ్చాయి. అందువల్ల ఇందులోని కంటెంట్లు చట్టంలోని సెక్షన్ 13(2) ప్రకారం, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3(1) తో పాటుగా మరియు మీ పై ప్రత్యామ్నాయ సర్వీస్ ద్వారా ఇక్కడ ప్రచురించబడుతున్నాయి.

రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు, హామీదారుల వివరాలు, సెక్యూరిటీలు, అసాధారణ బకాయిలు, సెక్షన్ 13(2) క్రింద పంపబడిన డిమాండ్ నోటీసు మరియు క్లయిమ్ చేయబడిన మొత్తం క్రింద ఇవ్వబడినవి:

క్ర. సం	రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు, హామీదారుల పేరు మరియు లోను మొత్తం	ఆస్తి వివరణ	డిమాండ్ నోటీసు తేది	బకాయి మొత్తం రూ.లో
1.	ధనలక్ష్మి వల్లెల, వల్లెల సుధాకర్, శ్రీనివాసరావు వల్లెల లోను మొత్తం : 4,68,000/– లోను నం.: HF0219H21100161	గుంటూరు జిల్లా, తెనాలి ఉపజిల్లా, తెనాలి మండలం, అంగలకుదురు గ్రామ పంచాయతీ ఏరియా, 8వ వార్డు, అంశం నం.1, డో.నం.463/2, విస్తీర్ణం 48 చ.గ.లు. హద్దులు : తూర్పు : ఇండిపెండెంట్ రామ లింగయ్య, దక్షిణం : విక్రేత/ వల్లెల ధనలక్ష్మికి చెందిన సైట్, పడమర : చెన్నంశెట్టి సుబ్బయ్య సైట్, మరియు ఉత్తరం : గొల్లపూడి మందయ్య, స్టేనియాలు సైట్ 38 లిం.లు., అంశం నం.2 : విస్తీర్ణం : 48 చ.గ.లు. హద్దులు : తూర్పు : వల్లెల వెంకటేశ్వర్లు 38 లిం.లు., దక్షిణం : కడియం సుబ్బారావు 31 లిం.లు., పడమర : వల్లెల శివ నాగేశ్వరరావు సైట్ 34 లిం.లు. మరియు ఉత్తరం : కంగల వెంకట సుబ్బయ్య 30 లిం.లు.	10/05/2025	రూ.4,87,931/– (నాలుగు లక్షల ఎనభై ఏడు వేల తొమ్మిది వందల ముప్పై ఒక్క రూపాయలు మాత్రమే) చెల్లింపు వరకు 16.1 శాతం పి.ఎ.తో కలిపి తదుపరి వడ్డీ.
2.	రొక్కం గంగాధరరావు, రొక్కం తులసి, లోను మొత్తం : 8,00,000/– లోను నం.: HL00538000000005015919	ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, భీమడోలు ఉపజిల్లా, మేడినరావు పాలెం గ్రామం, డో.నం.2–149 వద్ద ఉన్న ఆర్.ఎస్.నం.187/1 లో విస్తీర్ణం 144–0–0 చ.గ.లు. మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్. హద్దులు : తూర్పు : ఉమ్మడి మార్గం మరియు సిరిచొళ్ళ సత్యనారాయణ ఆస్తి, దక్షిణం : రొక్కం దుర్గారావు ఆస్తి, పడమర : షేక్ గాలిబ్ ఆస్తి, ఉత్తరం : సిరిచొళ్లు రాంబాబు ఆస్తి.	10/05/2025	రూ.8,39,784/– (ఎనిమిది లక్షల ముప్పై తొమ్మిది వేల ఏడు వందల ఎనభై నాలుగు రూపాయలు మాత్రమే) చెల్లింపు వరకు 13.6 శాతం పి.ఎ.తో కలిపి తదుపరి వడ్డీ.
9. తనఖాపెట్టిన ఆస్తి-09: గుంటూరు జిల్లా, APCRDA, మందడం ఎస్ఆర్ఒ, తుళ్లూరు మండలం, లింగాయపాలెం గ్రామం, సర్వే నెం. 32, బ్లాక్ నెం.2127, సెక్టార్-74, కాలనీ నెం. 341, టౌన్‌షిప్ నెం. 6, కమర్షియల్ ప్లాట్ నెం. 12-C3 కలిగిన 540 చ॥గ॥ లేదా 451.5086 చ॥మీ॥ ఖాళీ స్థలం శ్రీ వి. దినేష్, తండ్రి: శ్రీ వి. శివ నాగేశ్వరరావు పేరునగలదు. **డాక్యుమెంట్ ప్రకారం హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం. 6-74-341-2127-7-C4, ప్లాట్ నెం. 6-74-341-2127-8-C6, **దక్షిణం:** ప్లాట్ నెం 6-74-341-2127-13-C3, **పడమర:** 15.60 మీ॥ రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నెం. 6-74-341-2127-11-C5. **(గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, లింగాయపాలెం గ్రామం, ఒరిజినల్ రిజిష్టర్డు డీడ్ డాక్యుమెంట్ నెం. 1365/2019, తేది. 01-03-2019).**

10. తనఖాపెట్టిన ఆస్తి-10: గుంటూరు జిల్లా, APCRDA, మందడం ఎస్ఆర్ఒ, తుళ్లూరు మండలం, వెలగపురి గ్రామం, బ్లాక్ నెం.2177, సెక్టార్-85, కాలనీ నెం. 405, టౌన్‌షిప్ నెం. 7, సర్వే నెం. 172, 171, 95, 96, కమర్షియల్ ప్లాట్ నెం. 4-K9 కలిగిన 690 చ॥గ॥ లేదా 576.9276 చ॥మీ॥ ఖాళీ స్థలం శ్రీ వుమ్మనేని రాజేష్ మరియు శ్రీ వుమ్మనేని దినేష్, తండ్రి: శ్రీ వి. శివ నాగేశ్వరరావు పేరునగలదు. **డాక్యుమెంట్ ప్రకారం హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం. 7-85-405-2177-15-k10, **దక్షిణం:** ప్లాట్ నెం 7-85-405-2177-5-k9, **పడమర:** 17.00 మీ॥ రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నెం. 7-85-405-2177-3-k10. **(గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, లింగాయపాలెం గ్రామం, ఒరిజినల్ రిజిష్టర్డు డీడ్ డాక్యుమెంట్ నెం. 1364/2019, తేది. 01-03-2019).**

తేది: 12.05.2025, స్థలం: విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అశోకా యూనివర్శిటీ ప్రొఫెసర్‌కు 14రోజుల జ్యుడీషియల్ కస్టడీ

గురుగ్రామ్ : అశోకా యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ అలీ ఖాన్ మహ్మూదాబాద్ పోలీసు కస్టడీని పొడిగించాలని కోరిన హర్యానా పోలీసుల అభ్యర్థనను మంగళవారం సోనిపట్ కోర్టు తిరస్కరించింది. మహ్మూదాబాద్‌ను 14 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. ప్రొఫెసర్ పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవాల్సి వున్నందున పోలీసు రిమాండ్‌ను మరో ఏడు రోజులు పొడిగించాలని పోలీసులు కోరారని, కానీ కోర్టు ఆ అభ్యర్థనను తోసిపుచ్చిందని ఖాన్ తరపు న్యాయవాదుల్లో ఒకరైన కపిల్ బాల్యన్ మీడియాకు చెప్పారు. రెండు రోజుల పోలీసు రిమాండ్ ముగియడంతో ఖాన్‌ను కోర్టులో ప్రవేశపెట్టారు. ఖాన్ పాస్‌పోర్టు ఫోటోకాపీని ఇప్పటికే పోలీసులకు అందజేశామని, ఆయన పర్యటనల వివరాలన్నీ విదేశాంగ శాఖ నుండి సేకరించారని బాల్యన్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌పై తన సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుకు రాయ్ పోలీసు స్టేషన్‌లో ఖాన్‌పై విడివిడిగా రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఒక కేసులో రెండు రోజుల పోలీసు కస్టడీకి ఇవ్వగా, రెండో కేసులో జ్యుడీషియల్ కస్టడీకి పంపింది.

తెలంగాణ రాజ్‌భవన్‌లో దొంగలు

- సుధర్మ భవన్‌లో హార్డ్‌డిస్క్ చోరీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాజ్‌భవన్‌లో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అధికార కార్యాలయాలున్న సుధర్మ భవన్‌లో హార్డ్ డిస్క్ చోరీ అయినట్లు రాజ్‌భవన్ అధికారులు గుర్తించి ఈ నెల 14న పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. గతంలో అక్కడి కంప్యూటర్ విభాగంలో పనిచేసిన శ్రీనివాస్ చోరీకి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడిని ఈ నెల 15న అరెస్టు చేసి హార్డ్ డిస్క్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పంజాగుట్ట ఎసిపి మోహన్ కుమార్ మీడియాకు వెల్లడించారు. రాజ్ భవన్‌లో పనిచేసే ఓ మహిళ ఫొటోలను పొరుగు సేవల సిబ్బంది శ్రీనివాస్ మార్ఫింగ్ చేశాడు. దీనిపై పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. బెయిల్‌పై బయటికి వచ్చిన శ్రీనివాస్.. ఫొటోల మార్ఫింగ్‌కు ఉపయోగించిన కంప్యూటర్‌లోని హార్డ్ డిస్క్‌ను ఎత్తుకుపోయాడని ఎసిపి వివరించారు.

టికెఎం మెగా సమ్మర్ సెలబ్రేషన్

బెంగళూరు : తమ 'మెగా సమ్మర్ సెలబ్రేషన్'ను ప్రారంభించినట్లు టొయోటా కిర్లోస్కర్ మోటార్ తెలిపింది. ఇందులో కొత్త కారు కొనడం, ఉన్న కార్లకు సర్వీసింగ్ చేయడం, సర్టిఫైడ్ యూజ్డ్ కార్లను గుర్తించటం లేదా వాహన ఉపకరణాలను అప్‌గ్రేడ్ చేయడం , ఆకర్షణీయమైన డీల్స్‌ను పొందవచ్చని ఆ సంస్థ పేర్కొంది. ఈ మెగా సమ్మర్ సెలబ్రేషన్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అందుబాటులో ఉంటుందని ఆ కంపెనీ ప్రతినిధి వైస్‌లైన్ సిగామణి తెలిపారు.

బంగారం స్మగ్లింగ్ కేసులో నటి రాన్యా రావుకు బెయిల్

- మరో కేసులో జైలులోనే

బెంగళూరు : బంగారం స్మగ్లింగ్ కేసులో నిందితులు కన్నడ నటి రాన్యా రావు, తరుణ్ కొండూరు రాజులకు ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఒక్కొక్కరికి రూ. 2 లక్షల వ్యక్తిగత బాండ్, ఇద్దరు పూచీకత్తులతో ఈ డిఫాల్ట్ బెయిల్‌ను కోర్టు జారీ చేసింది. ఈ కేసులో బెయిల్ మంజూరైనా కోఫె పోసా కేసు ఉన్నందున వారు ప్రస్తుతానికి విడుదలయ్యే అవకాశం లేదు. మార్చి 3న దుబాయ్ నుంచి వచ్చిన రాన్యా రూ.12.56 కోట్ల విలువైన బంగారాన్ని స్మగ్లింగ్ చేసినట్లు ఆరోపిస్తూ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) రన్యాను అరెస్టు చేసింది. ఆభరణాల వ్యాపారి రాజు, సాహిల్ సకారియా జైన్లను కూడా అరెస్టు చేసింది. ప్రస్తుతం వీరు బెంగళూరులోని పరప్పన అగ్రహార కేంద్ర జైలులో ఉన్నారు. వీరిపై కేంద్ర ప్రభుత్వం కఠినమైన విదేశీ మారక ద్రవ్య పరిరక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నిరోధక చట్టం (కోఫె పోసా) కేసును ఏప్రిల్ 22న నమోదు చేసింది. ఈ కేసుపై కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను జూన్ మూడుకి వాయిదా వేసింది.

బెయిల్ కోసం ఏడాదిపాటు జైల్లో ఉండాలనే నియమం లేదు

- మనీలాండరింగ్ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి బెయిల్ కోసం ఏడాది పాటు జైల్లో ఉండాలనే నియమం ఏమీ లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రూ.2 వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో వ్యాపారవేత్త అన్వర్ ఢేబర్‌కు జస్టిస్ అభయ్ ఎస్. ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో అన్వర్ ఢేబర్‌ను గతేడాది ఆగస్టులో అరెస్టు చేశారు. ఇప్పటి వరకూ జైల్లోనే ఉన్నారు. ఢేబర్‌పై ఉన్న ఆరోపణలు నిజమైతే గరిష్టంగా ఏడేళ్ల శిక్ష పడుతుందని, ఈ కేసులో సాక్షుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల విచారణ త్వరలో ప్రారంభమయ్యే అవకాశం లేదని ధర్మాసనం తెలిపింది. పాస్‌పోర్టు అప్పగించడం, ఇతర షరతులతో ఢేబర్‌కు బెయిల్ మంజూరు చేసింది. ఛత్తీస్‌గఢ్‌లో మద్యం వ్యాపారంలో అక్రమాలు, పన్ను ఎగవేతకు పాల్పడినట్లు ఆరోపిస్తూ ఆదాయపు పన్ను శాఖ దాఖలు చేసిన చార్జిషీట్ ఆధారంగా ఇడి ఈ కేసును విచారణ చేస్తోంది. ఈ కుంభకోణంలో రూ.2,161 కోట్ల అవినీతి జరిగిందని ఇడి ఆరోపిస్తుంది.

యుఎస్‌తో తొలి దశ చర్చలు వేగవంతం

మంత్రి పియూష్ గోయల్ వెల్లడి

న్యూఢిల్లీ : భారత్, అమెరికా మధ్య టారిఫ్‌లకు సంబంధించి మొదటి దశ చర్చలను వేగవంతం చేసినట్లు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న పియష్ గోయల్ ఆ దేశ వాణిజ్య శాఖ మంత్రి హోవార్డ్ లుట్నిక్‌తో సమావేశమయ్యారు. చర్చలను వేగవంతం చేయడంపై దృష్టి సారించామన్నారు. మొదటి దశ ఒప్పందాన్ని త్వరగా పూర్తి చేసే దిశగా తమ మధ్య ఫలప్రదమైన చర్చలు జరిగాయని ఈ సందర్భంగా గోయల్ ఎక్స్‌లో తెలిపారు. మంత్రుల స్థాయి సమావేశాల అనంతరం ఈ నెల 22 వరకు రెండు దేశాల ప్రధాన అధికారుల మధ్య చర్చలు జరగనున్నాయి. ఈ ఏడాది సెప్టెంబరు-అక్టోబరు నాటికి తొలి దశ ఒప్పందాన్ని ఖరారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని గోయల్ వెల్లడించారు. ఈ చర్చల్లో ప్రధానంగా పరస్పర మార్కెట్ల వినియోగం, స్థానిక నిబంధనల అమలు, టారిఫ్ మినహాయింపులకు పరిమితులపై ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఉందన్నారు. అమెరికాతో జరుగుతున్న చర్చల్లో భారత్ కొన్ని కీలక రంగాల్లో సుంకాల నుంచి సడలింపు కోరుతోంది. ఇందులో టెక్స్‌టైల్స్, రత్నాలు, ఆభరణాలు, దుస్తులు, ప్లాస్టిక్స్, రసాయనాలు, రొయ్యలు, నూనె గింజలు, రసాయనాలు, ద్రాక్ష, అరటిపండ్లు తదితర రంగాలున్నాయి. మరోవైపు అమెరికా కొన్ని పారిశ్రామిక వస్తువులు, ఆటోమొబైల్స్, వైన్స్, పెట్రోకెమికల్ ఉత్పత్తులు, పాడి ఉత్పత్తులు రంగాల్లో సుంకాల సడలింపును డిమాండ్ చేస్తోంది. ఈ ఒప్పందం కోసం రెండు దేశాలు నిబంధనల్ని ఖరారు చేశాయి. ఇందులో సుంకాలు, వస్తువులు, సేవలు, సుంకేతర అడ్డంకులు, కస్టమ్స్ వంటి అంశాలు ఉన్నాయి. అమెరికా.. భారత్‌పై విధించిన అదనపు 26 శాతం సుంకాలను జులై 9 వరకు తాత్కాలికంగా నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈ 90 రోజల వ్యవధిని ఉపయోగించుకొని చర్చలను ముందుకు తీసుకెళ్లాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. అప్పటి వరకు 10 శాతం బేస్‌లైన్ సుంకం యథాతథంగా అమల్లో ఉంటుంది. ఏప్రిల్ 2 నుంచి ప్రపంచ దేశాలపై భారీగా పన్నులు విధించనున్నట్లు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికాతో వాణిజ్యంలో నాలుగో అతిపెద్ద దేశంగా భారత్ ఉంది. 2024-25లో 131.84 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం జరిగింది. భారత మొత్తం ఎగుమతుల్లో 18 శాతం వాటా అమెరికాదే కావడం విశేషం.

ఇజ్రాయిల్ దాడుల్లో

మరో 73 మంది మృతి

- మృతుల్లో మహిళలు, చిన్నారులే అధికం
- సైనిక చర్య విస్తరిస్తామన్న నెతన్యాహు ప్రకటనపై పశ్చిమ దేశాల ఆగ్రహం

గాజా, లండన్ : గాజా వ్యాప్తంగా తన సైనిక చర్యలను విస్తరిస్తున్నట్లు ఆదివారం ఇజ్రాయిల్ ప్రకటించిన నేపథ్యంలో బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా దేశాలు ఆ చర్యను తీవ్రంగా ఖండించాయి. గాజాలో ప్రజలు పడుతున్న కష్టాలు, ఇబ్బందులు భరించరాని స్థితికి చేరుకున్నాయని విమర్శించాయి. ఈ మేరకు మూడు దేశాలు సంయుక్తంగా ఒక ప్రకటన జారీ చేశాయి. ఈ సమస్యకు రెండు దేశాల ఏర్పాటే పరిష్కారమని, ఈ దిశగా తాము పాలస్తీనా దేశాన్ని గుర్తించడానికి కట్టుబడ్డామని ఆ ప్రకటన పేర్కొంది. గాజాలోకి పరిమిత స్థాయిలోనే ఆహారం పంపేందుకు అనుమతిస్తామంటూ ఇజ్రాయిల్ చేసిన ప్రకటనను తీవ్రంగా నిరసించాయి. అది పూర్తిగా అరకొర చర్య కాగలదని వ్యాఖ్యానించాయి. గాజా విధ్వంసానికి సంబంధించి ఇజ్రాయిల్ ప్రభుత్వం ఉపయోగించిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నాయి. శాశ్వతంగా ప్రజలను నిర్వాసితులను చేయడం అంతర్జాతీయ మానవతా చట్టాన్ని ఉల్లంఘించడమేనని తెలిపింది. నెతన్యాహు ప్రభుత్వం చేపట్టే ఈ దారుణ చర్యలను తామెంత మాత్రమూ సహించబోమని స్పష్టం చేశాయి. దీనిపై నిర్దిష్ట చర్యలు తీసుకుంటామని ఆ దేశాలు ప్రకటించాయి. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో కొంతమంది వ్యక్తులు, గ్రూపులపై బ్రిటన్ ఆంక్షలు విధించింది. పాలస్తీనియన్లపై హింసాత్మక చర్యలకు పాల్పడినవారిలో వీరున్నారని పేర్కొంది.

76మంది మృతి

గాజాపై ఇజ్రాయిల్ విరుచుకుపడుతోంది. గాజా వ్యాప్తంగా సోమవారం రాత్రి నుండి మంగళవారం ఉదయం వరకు ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 73మంది మరణించారని పాలస్తీనా ఆరోగ్య అధికారులు తెలిపారు. ఉత్తర గాజాలోని ఒక ఇల్లు, నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించిన పాఠశాల భవనంపై జరిపిన రెండు దాడుల్లో 22మంది మరణించారని, వారిలో సగం మందికి పైగా మహిళలు, చిన్నారులేనని తెలిపారు. సెంట్రల్ సిటీ డేర్- అల్ -బలాహ్‌లో జరిగిన దాడిలో 13మంది మరణించగా, నుస్రత్ శరణార్థి శిబిరంపై జరిగిన దాడిలో 15మంది మరణించారని అల్-అక్సా ఆస్పత్రి తెలిపింది. దక్షిణ నగరమైన ఖాన్ యూనిస్‌లో జరిగిన రెండు దాడుల్లో 10మంది మరణించారని నాజర్ ఆస్పత్రి పేర్కొంది.

మృత్యుముఖాన 14వేలమంది శిశువులు!

గాజాలో ఆహార పంపిణీ జరగకపోతే అందకపోతే వచ్చే 48గంటల్లో సుమారు 14వేల మంది పిల్లలు ఆకలితో చనిపోవచ్చని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. 11 వారాల పాటు పూర్తిగా సాయాన్ని నిలిపివేసిన నేపథ్యంలో అమెరికా, కెనడా, ఫ్రాన్స్, బ్రిటన్ సహా పలు దేశాల ఒత్తిడితో సోమవారం ఇజ్రాయిల్ అధికారులు పరిమిత సాయాన్ని పంపిణీ చేసేందుకు అనుమతించారు. పిల్లలకు ఆహారంతో కూడిన ఐదు ట్రక్కులు సోమవారం గాజాలోకి ప్రవేశించాయని ఐరాస మానవతా సంస్థ చీఫ్ టామ్ ఫ్లెచర్ పేర్కొన్నారు. వారాల తరబడి దిగ్బంధనం నెలకొన్న పరిస్థితుల్లో ఈ సాయం "సముద్రంలో నీటి చుక్క" వంటిదని, కనీసం 100 ట్రక్కులను అనుమతించాలని కోరారు.

భవిష్యత్తులో మహమ్మారుల నివారణకు

ప్రపంచ దేశాలు కలిసి రావాలి

- తీర్మానాన్ని ఆమోదించిన డబ్ల్యుహెచ్ఓ

జెనీవా : భవిష్యత్తులో తలెత్తే మహమ్మారుల నుండి ప్రపంచ దేశాలను సురక్షితంగా వుంచేందుకు, అన్ని దేశాలకు అవసరమైన అత్యవసర వైద్య సదుపాయాలు సమానంగా అందేలా చూసేందుకు ప్రపంచంలోనే మొదటిసారిగా చారిత్రక మహమ్మారి నివారణా ఒప్పందాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) ఆమోదించింది. ఈ ఒప్పందానికి అనుకూలంగా సభ్య దేశాలు ఓటు వేశాయి. కోవిడ్ మహమ్మారి సృష్టించిన తీవ్ర ప్రతికూల ప్రభావాలు, పర్యవసానాలు ఆ నేపథ్యంలో ప్రభుత్వాలు స్పందించిన తీరు, చేపట్టిన చర్యలపై మూడేళ్లకి పైగా ఉధృతంగా చర్చలు జరిపిన అనంతరం 78వ ప్రపంచ హెల్త్ అసెంబ్లీ ఈ చారిత్రక నిర్ణయం తీసుకుంది. కోవిడ్ సమయంలో ఆ మహమ్మారిని నివారించడానికి, ప్రతిస్పందించడానికి దేశాల మధ్య వున్న అంతరాలు, అసమానతలను పరిష్కరించడానికి ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా ఇటువంటి ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందాన్ని డబ్ల్యుహెచ్ఓ రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 కింద ఆమోదించింది. ప్రపంచ దేశాలు, డబ్ల్యుహెచ్ఓ వంటి అంతర్జాతీయ సంస్థలు, పౌరసమాజం, ప్రైవేట్ రంగం, ఇతర భాగస్వా మ్య పక్షాల మధ్య బలమైన సహకారం, సమన్వయాన్ని పెంపొందించడం ద్వారా భవిష్యత్తులో ఇటువంటి మహమ్మారులను నివారించడం, ఒకవే సంక్షోభం సంభవించిన పక్షంలో మెరుగ్గా స్పందించడం లక్ష్యమని డబ్ల్యుహెచ్ఓ ఒక ప్రకటనలో తెలిపింది. కోవిడ్ నేపథ్యంలో భవిష్యత్తులో వచ్చే మహమ్మారుల నుండి ప్రపంచాన్ని రక్షించేందుకు కలిసిరావాలని నిర్ణయించుకున్న సభ్యదేశాలను డబ్ల్యుహెచ్ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ అభినందించారు.

వక్ఫ్ ఆస్తుల కోసమే...!

- చట్ట సవరణపై సిజెఐ ధర్మాసనం ఎదుట వాదనలు
- 21కి విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

న్యూఢిల్లీ : వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకోవడమే తాజా సవరణ చట్టాన్ని రూపొందించారని సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన వందకి పైగా పిటిషన్లపై మంగళవారం సిజెఐ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మాసితో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరపున వాదనలు వినిపించిన కపిల్ సిబాల్ పలు అంశాలను ప్రస్తావించారు. నెమ్మది నెమ్మదిగా వక్ఫ్ ఆస్తులను స్వాధీనం (క్రీపింగ్ అక్విజేషన్) చేసుకోవడానికే ఈ సవరణ తీసుకువచ్చారని ఆయన అన్నారు. 'ప్రతి చిన్న వివాదాన్ని పెద్దదిగా మార్చి ప్రభుత్వాదజకారి విచారణ పేరుతో పాఠశాలలు, ఆసుపత్రులు, మసీదులు, సమాధుల వంటి వక్ఫ్ ఆస్తులను వాడకుండా చేయకుండా, ముస్లిం సమాజం ఆ హక్కులను పూర్తిగా కోల్పోయేలా సవరణ చట్టం చేస్తుంది' అని ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. ఇలా వక్ఫ్ హక్కులను కబళించడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. మైనారిటీ హక్కులను ఈ కొత్త చట్టం ఉల్లంఘిస్తోందన్నారు. ఇది వివక్షతో కూడినదని వారు పేర్కొన్నారు. ఏప్రిల్ 8న అమల్లోకి వచ్చిన ఈ చట్టంపై స్టే ఇవ్వాలని ఆయన కోరారు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ స్పందిస్తూ పార్లమెంట్ ఆమోదించిన ప్రతి చట్టానికి రాజ్యాంగబద్ధతనే భావన ఉంటుందని , ఆ చట్టం రాజ్యాంగ విరుద్ధమని ప్రాథమికంగా తేలితేనే ఆ దిశలో తాత్కాలిక ఆదేశాలు ఇయ్యవచ్చని అన్నారు. ఆ మేరకు స్పష్టత కాలేకపోతే కోర్టులు జోక్యం చేసుకోలేవని చెప్పారు. దానిపై సిబల్ స్పందిస్తూ, ప్రాథమికంగా హక్కులు

ఉల్లంఘనకు గురైరనప్పుడు రాజ్యాంగబద్ధత భావనను కూడా తిరస్కరించవచ్చని అన్నారు. ఇటువంటి చట్టం అమలు వల్ల కోలుకోలేని నష్టం జరుగుతుందనుకుంటే న్యాయస్థానం జోక్యం చేసుకుని, ప్రజా ప్రయోజనాల రీత్యా స్టే విధించవచ్చన్నారు. పిటిషనర్ల వాదనలను రోజంతా విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది. ఆ రోజు కేంద్ర ప్రభుత్వం తన వాదనలను వినిపించనుంది. వక్ఫ్ చట్టంపై గత విచారణ (ఏప్రిల్ 17న) సందర్భంగా, మూడు అంశాలపై మధ్యంతర ఆదేశాలు జారీ చేయడానికి వాదనలు వింటామని ధర్మాసనం పేర్కొంది. వాటిలో వక్ఫ్ బై యూజర్, వక్ఫ్ కౌన్సిల్, స్టేట్ వక్ఫ్ బోర్డులకు ముస్లిమేతరుల నామినేషన్, వక్ఫ్ కింద ప్రభుత్వ భూముల గుర్తింపు వంటివి ఉన్నాయి. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను నియమించబోమని, ఈ మూడు అంశాలపై వెంటనే ఎలాంటి చర్యలు తీసుకోమని సుప్రీంకోర్టుకు గత విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. మంగళవారం విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ వక్ఫ్ చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి విచారణను ఆ మూడు అంశాలకే పరిమితం చేయాలని కోరారు. కోర్టు గుర్తించిన ఆ మూడు అంశాలకు తాము సమాధానం దాఖలు చేశామన్నారు. తాజాగా పిటిషనర్ల లిఖిత పూర్వక సమాధానాలు ఇతర అంశాలను ప్రస్తావించాయని అన్నారు. ఇందుకు పిటిషనర్ల తరపు హాజరైన సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వి అభ్యంతరం తెలిపారు. ఈ కేసును విచారించి, మధ్యంతర ఉపశమనం ఎక్కడ ఇవ్వవచ్చో పరిశీలిస్తామని గత సిజెఐ (సంజీవ్ ఖన్నా) చెప్పారని, అందువల్ల మూడు అంశాలకే పరిమితమవుతామని చెప్పలేమని అన్నారు. ఒక ఆస్తిని వక్ఫ్‌గా ప్రకటించాలంటే ఒక వ్యక్తి కనీసం ఐదేళ్ల ఇస్లాంలో ఉండాలనే షరతును సిబల్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. "నేను మరణశయ్యపై ఉండి వక్ఫ్ ఏర్పాటు చేయాలనుకుంటుంటే ముస్లింగా ఉన్నట్టు రుజువు చేసుకోవాలి. ఇది రాజ్యాంగ విరుద్ధం" అని అన్నారు. వక్ఫ్ ఆస్తుల్లో 116శాతం పెరుగుదల వుందనే ప్రభుత్వ వాదనను సింఘ్వి వ్యతిరేకించారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు రాజీవ్ ధావన్, హుజేఫా అహ్మదీ కూడా వాదనలు వినిపించారు.

శాంతి మెమొరాండం రూపొందించాలి

- అందుకు కాలపరిమితి లేదన్న క్రెమ్లిన్
- ట్రంప్‌తో ఫోన్ కాల్ అనంతరం రష్యా వెల్లడి
- వెంటనే కాల్పుల విరమణ చర్చలు జరపాలన్న ట్రంప్

మాస్కో : ఉక్రెయిన్ ఘర్షణలను పరిష్కరించే దిశగా తీసుకునే తదుపరి చర్య, శాంతిని నెలకొల్పడం కోసం సూత్రాలు, కాల క్రమాన్ని (టైమ్‌లైన్) వివరించే మెమొరాండం అయి వుండాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో దాదాపు రెండు గంటల పాటు మాట్లాడిన ఫోన్ కాల్‌లో ఈ మేరకు అంగీకారం కుదిరిందని చెప్పారు. ఈ శాంతి మెమొరాండాన్ని ఖరారు చేయడానికి గడువు అంటూ విధించలేదని మంగళవారం ఉదయం క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్ విలేకర్లకు చెప్పారు. సాధ్యమైనంత త్వరగా ఇది జరిగేలా చూడాలని మాత్రమే ఇరువురు నేతలు పేర్కొన్నారని తెలిపారు. రష్యా, ఉక్రెయిన్‌లు తమ తమ పద్ధతిలో మెమొరాండా లు రూపొందించుకోవచ్చని అన్నారు. ఆ తర్వాత ఆ రెండింటినీ కలిపి ఒక రూపానికి తీసుకురావాల్సిన అవసరం వుంటుందని, దీనికోసం జరిగే చర్చలు క్లిష్టంగా వుంటాయని చెప్పారు. పుతిన్ వ్యాఖ్యలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందిస్తూ, తమదైన మెమొరాండం రూపొందించడానికి ముందుగా మాస్కో ప్రతిపాదన కోసం వేచి చూస్తామని చెప్పారు.

ఫోన్‌కాల్‌లో జరిగిన సంభాషణ ప్రోత్సాహకరంగా వుందని పుతిన్, ట్రంప్‌లు వ్యాఖ్యానించారు. ఎలాంటి అరమరికలు లేకుండా చర్చించామని పుతిన్ చెప్పారు. ఇరు పక్షాలకు అనుగుణంగా కొన్ని సర్దుబాట్లను కనుగొనాల్సిన అవసరం వుందని అన్నారు. రెండు వారాల్లోనే పురోగతి వుంటుందని భావిస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. 'దీన్ని పరిష్కరించాలని పుతిన్ కోరుకోవడం లేదని నేను భావించినట్లైతే ఇక దాని గురించి నేను మాట్లాడను కూడా.' అని ట్రంప్ విలేకర్లతో వ్యాఖ్యానించారు. శాంతి ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించడం సవాలు వంటిదని ట్రంప్ అన్నారు. ఎందుకంటే ఇందులో లోతైన అసమానతలు, అతి పెద్దవైన ఇగోలు ఇమిడి వుంటాయన్నారు. జెలెన్ స్కీ కూడా బలమైన వ్యక్తే, ఆయనతో వ్యవహరించడం కూడా అంత తేలికేమీ కాదని అన్నారు. రష్యా, ఉక్రెయిన్ తక్షణమే కాల్పుల విరమణ చర్చలు ప్రారంభించాలని అన్నారు. ఇరు దేశాల నాయకులతో విడివిడిగా ఫోన్‌కాల్స్ మాట్లాడిన అనంతరం ట్రంప్ మాట్లాడారు. చర్చలు, ఎప్పుడు ఎక్కడ జరిగే అవకాశం వుంది, ఎవరు పాల్గొంటారన్న వివరాలేవీ తెలియరాలేదు. ఈ సంక్షోభానికి మూల కారణాన్ని పరిష్కరించాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని పుతిన్ చెప్పగా, పూర్తి స్థాయిలో, బేషరతుగా కాల్పుల విరమణకు ఉక్రెయిన్ సిద్ధంగా వుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు.

మణిపూర్ హైకోర్టు సిజెగా

జస్టిస్ సోమశేఖర్ నియామకం

న్యూఢిల్లీ : మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ కెంపయ్య సోమశేఖర్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం నియమించారు. ఈ విషయాన్ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. న్యాయమూర్తి సోమశేఖర్ ప్రస్తుతం కర్ణాటక హైకోర్టు జడ్జిగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.కృష్ణకుమార్ బుధవారం పదవీవిరమణ చేయనున్నారు. సిజెఐ బిఆర్ గవాయ్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల కొలిజియం సిఫార్సు మేరకు ఈ నియామకం జరిగింది. జస్టిస్ సోమశేఖర్ 1990లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 1998లో జిల్లా సెషన్స్ జడ్జిగా, 2016 జులైలో కర్ణాటక హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2018లో శాశ్వత న్యాయమూర్తి అయ్యారు.

దలాల్ స్ట్రీట్‌కు మూడీస్ దెబ్బ

- మార్కెట్లలో అమ్మకాల వెల్లువ
- 82 వేల దిగువకు సెన్సెక్స్

ముంబయి : ఇటీవల కొన్ని రోజులుగా జోష్‌లో ఉన్న దలాల్ స్ట్రీట్‌లో మంగళవారం అమ్మకాల వెల్లువ చోటు చేసుకుంది. అమెరికా పరపతిని తగ్గిస్తూ మూడీస్ తీసుకున్న నిర్ణయంతో ప్రపంచ మార్కెట్లు కుప్పకూలాయి. దీంతో పాటు ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో సూచీలు భారీగా నష్టపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 82 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. ఉదయం 82,116.17 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ ఇంట్రాడేలో 81,153.70 వద్ద కనిష్ఠాన్ని తాకింది. తుదకు 873 పాయింట్ల నష్టంతో 81,186కు పడిపోయింది. నిఫ్టీ 262 పాయింట్ల నష్టంతో 24,683.90 వద్ద ముగిసింది. దీంతో వరుసగా రెండో రోజూ మార్కెట్లు నష్టాలు చవి చూసినట్లయ్యింది. మధ్యాహ్నం తర్వాత అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు మార్కెట్లను నష్టాల్లోకి నెట్టాయని బ్రోకర్లు తెలిపారు. సెన్సెక్స్-30లో ఇన్ఫోసిస్, టిసిఎస్, టెక్ మహీంద్రా షేర్లు ఒక్క శాతానికి పైగా నష్టపోయాయి. నిఫ్టీ ఆటో సూచీ 2 శాతానికి పైగా నష్టపోగా, నిఫ్టీ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎఫ్ఎంసిజి షేర్లు 1 శాతానికి పైగా నష్టపోయాయి. మిడ్‌క్యాప్ 100 సూచీ 1.62 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.94 శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.3.50 లక్షలు కోట్లు క్షీణించి రూ.440.23 లక్షల కోట్లకు తగ్గింది. ముఖ్యంగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసిఐసిఐ బ్యాంక్, మారుతీ వంటి లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. అమెరికా ప్రభుత్వ అప్పులపై ఆందోళన నేపథ్యంలో యూఎస్ క్రెడిట్ రేటింగ్‌ను మూడీస్ డౌన్‌గ్రేడ్ చేసింది. దీంతో అక్కడి 30 ఏళ్ల బాండ్ రాబడులు 2023 నవంబర్ తర్వాత గరిష్ఠ స్థాయి అయిన 5.03 శాతానికి చేరాయి. బాండ్ రాబడులు పెరగడంతో భారత్ వంటి వర్ధమాన దేశాల మార్కెట్లకు లిక్విడిటీ తగ్గొచ్చన్న భయాలతో సెన్సెక్స్, నిఫ్టీలు భారీగా నష్టపోయాయి. మళ్లీ కొవిడ్ కేసులు పెరుగుతుండడం కూడా మార్కెట్‌లపై విశ్వాసాన్ని దెబ్బతీసింది.

బెంగళూరులో భారీ వర్షాలు

- సగం నగరం నీటిలోనే

బెంగళూరు : కర్ణాటక రాజధాని బెంగళూరును భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఆదివారం నుంచీ కురుస్తున్న ఈ వర్షాలకు దాదాపు సగం నగరం నీటము నిగింది. జన జీవనం అస్థవ్యస్తమైంది. బెంగళూరు తోపాటు కర్ణాటకలోని ఇతర ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దక్షిణ కన్నడ, ఉడిపి, చిక్కామంగళూరు జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదవుతోంది. బెంగళూరులో అనేక ప్రాంతాలు జలమయ్యాయి. నీరు నిలవ వుండిపోవడం, ట్రాఫిక్ జామ్‌లతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఆదివారం నుంచే విద్యుత్, మంచినీటి సరఫరా నిలిచిపోయింది. నిర్మాణంలో ఉన్న సెంట్రల్ సిల్క్ బోర్డు మెట్రోస్టేషన్ పూర్తిగా నీట మునిగిపోయింది. వైట్‌ఫీల్డ్ ప్రాంతంలో గోడ కూలి 35 ఏళ్ల మహిళ మరణించింది. నీటమునిగిన ప్రాంతాల నుంచి ప్రజలను తరలించడానికి, వారికి ఆహారం, మంచినీరు అందించడానికి అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

సిఎం సమీక్ష

భారీవర్షాలు, అనంతర పరిస్థితిపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గోడ కూలి మరణించిన మహిళ కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారం ప్రకటించారు. భారత వాతారణ శాఖ మంగళవారం కర్ణాటక ప్రాంతానికి రెడ్ అలెర్టు ప్రకటించింది. మరో రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ నెల 23 వరకూ మత్స్యకారులు ఎవరూ సముద్రంలో వేటకు వెళ్లవద్దని సూచించింది.

జూన్ నుంచి షాపుల వద్దే రేషన్

(మొదటి పేజీ తరువాయి)

ఇంజనీరింగ్ సంస్థ 2వేల మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ చట్టం-1905లోని 22ఎ నిషేధిత జాబితాలో భూముల చట్టవిరుద్ధ బదిలీని రద్దు చేసే డీడ్లపై రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ ఛార్జీలకు మినహాయింపు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. క్వాంటం వ్యాలీ ప్రాజెక్టు ఏర్పాటుపై రాష్ట్రప్రభుత్వం, ఐబిఎం, టిసిఎస్, ఎల్అండ్‌టి మధ్య కుదుర్చుకున్న మూడు అవగాహన ఒప్పందాలను ఈ సమావేశంలో ధృవీకరిస్తూ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఎపిఎండిసి 2025-26 బాండ్ల కూపన్ ధరను 9.30శాతంగా అంగీకరిస్తూ దాని ఫలితంగా వచ్చే రూ.3473.73 కోట్ల సబ్‌స్క్రిప్షన్ మొత్తాన్ని సంబంధిత బాండ్ హోల్డర్లకు కేటాయించి లావాదేవీల పత్రాలు అందించాలని నిర్ణయించామన్నారు. రవాణా వాహనాలకు గ్రీన్ ట్యాక్స్ ధరను తగ్గించడానికి ఎపి మోటార్ వెహికల్స్ ఆఫ్ గ్రీన్ ట్యాక్స్ చట్టంలో సవరణ చేసేందుకు రవాణా శాఖ ప్రతిపాదించిన డ్రాఫ్ట్ బిల్లుకు ఆమోదం చెప్పామన్నారు. హైకోర్టులో వివిధ కేటగిరిల్లో 245 పోస్టుల కల్పనకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

ఏలూరులో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ...

బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రధాన కార్యాలయాన్ని ఏలూరు సమీపంలో ఏర్పాటు చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయాన్ని రాజమహేంద్రవరంలో ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా 1136 ఎజిటి, 1,124 స్కూల్ అసిస్టెంట్ ఖాళీ పోస్టులను అదనపు పోస్టులుగా మారుస్తూ విడుదల చేసిన జివో 13కు ఆమోదం తెలిపింది. ప్రత్యేక అవసరాల విద్యార్థుల కోసం ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుల కోసం 2,260 పోస్టులు కల్పించేందుకు, ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐయుఎల్ఇఆర్) సంస్థను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ద్వారా రాజధాని అమరావతిలో ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపింది.

అదానీకి 5లక్షల చొప్పున 54.86 ఎకరాలు కేటాయింపు

అదానీ గ్రీన్ ఎనర్జీకి ఎకరాకు రూ.5లక్షల చొప్పున 54.96 ఎకరాలు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. వైఎస్ఆర్ జిల్లాలోని కె బొమ్మేపల్లిలో పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం 41.99 ఎకరాలు, శ్రీ సత్యసాయి జిల్లా పెద్దకొల్ల గ్రామంలో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు కోసం 12.87 ఎకరాలను కేటాయించేందుకు నిర్ణయం తీసుకుంది. నెల్లూరు జిల్లా పైనాపురం గ్రామంలో పారిశ్రామిక పార్కు స్థాపన కోసం 615.98 ఎకరాలను ఎపిఐఐసికి ఉచితంగా కేటాయించింది. కర్నూలు జిల్లాలోని బి తంద్రపాడు గ్రామంలో ఇఎస్ఐసి ఆస్పత్రి నిర్మాణం కోసం 5 ఎకరాల భూమిని ఉచితంగా కేటాయింపు, పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో హత్యకు గురైన టిడిపి నేత తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వంలో శాశ్వత ఉద్యోగం కల్పించేందుకు నియమాలు/చట్ట నిబంధనలను సవరించేందుకు సాధారణ పరిపాలన శాఖ చేసిన ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

తొలిరోజు 'ఉక్కు' సమ్మె సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

గేటు నుంచి కూర్మన్నపాలెంలోని ఉక్కు దీక్షా శిబిరం వరకూ భారీ బైకు ర్యాలీ చేపట్టారు. ర్యాలీ చేస్తున్న క్రమంలో గాజువాక ఎసిపి త్రినాధ్ ఆధ్వర్యంలో పోలీసులు కార్మికులను బస్సుల్లో పోలీసు స్టేషన్‌కు తరలించడానికి ప్రయత్నించారు. మూకుమ్మడిగా వచ్చిన కార్మికులు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ఆ బస్సును అడ్డుకున్నారు. తమను అరెస్టు చేయడానికి వీల్లేదంటూ నినదిస్తూ అక్కడే బైఠాయించారు. దీంతో చేసేదిలేక పోలీసులు వారిని విడిచిపెట్టారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ యాజమాన్య వైఖరిని తీవ్రంగా నిరసించారు. కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం, షాకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా దుయ్యపట్టారు. ప్లాంట్‌ను ప్రైవేటీకరణ నుంచి కాపాడుకోవడం కార్మికుల జీవన్మరణ సమస్యగా మారిందన్నారు. విశాఖ స్టీల్ కార్మికుల ఉద్యమం ఒంటరి కాదని, దీనికి దేశ వ్యాప్తంగా ఉన్న కార్మిక సంఘాలన్నీ మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. సిపిఎం 78వ వార్డు (ఉక్కునగరం) కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ తొలగించిన కాంట్రాక్టు కార్మికులను ప్లాంట్ యాజమాన్యం తక్షణం విధుల్లోకి తీసుకోవాలన్నారు. వారికి పని భద్రత కల్పించాలని కోరారు. వేరే గత్యంతరం లేకనే కార్మికులు సమ్మెకు వెళ్లారని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నిర్బంధాన్ని వీడి కార్మికుల పక్షాన నిలవాలన్నారు.

అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి మద్దతు

ఉక్కు కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన విశాఖలోని ద్వారకానగర్ కాంప్లెక్స్ వద్ద భారీ ప్రదర్శన, సభ జరిగాయి. జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉక్కు కార్మికుల తొలగింపుపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని, రాష్ట్ర పోలీసులను ప్లాంట్ నుంచి వెనక్కు రప్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, సిఎఫ్‌టియుఐ అఖిల భారత అధ్యక్షులు ఎస్.కనకారావు తదితరులు పాల్గొన్నారు. అరెస్టు చేసిన నాయకులను మంగళవారం రాత్రి పోలీసులు విడుదల చేశారు.



ఆలకించు .. ఆచరించు ...

కొండపాక బాలుర వసతి గృహంలో నరేష్, సురేష్ అనే ఇద్దరు విద్యార్థులు కొత్తగా చేరారు. చేరిన మొదటి రోజే వారికి ఎంతోమంది స్నేహితులు పరిచయమయ్యారు. వారు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు ఎంతో శ్రద్ధగా వింటారు.

ఒకరోజు బడి నుంచి వసతి గృహానికి తిరిగి వస్తుండగా, దారిలో ఒక ముసలావిడ 'నాయనా, కాస్త మంచి నీళ్ల ఇస్తారా?' అని అడిగింది. వెంటనే నరేష్‌కు తెలుగు ఉపాధ్యాయురాలు చెప్పిన మాటలు గుర్తుకువచ్చాయి. 'మేడం వృద్ధులకు సహాయం చేయాలని చెప్పారు కదా' అనుకున్నాడు. సురేష్‌తో 'అరేయ్.. నీ సంచిలో ఉన్న నీళ్ల డబ్బా తీసి అవ్వకు ఇవ్వరా' అన్నాడు. అవ్వ ఆ మంచినీళ్లు తాగి స్నేహితులిద్దరినీ ఆశీర్వదించింది.

మరుసటి రోజు బడిలో నరేష్ జరిగిన విషయం తెలుగు ఉపాధ్యాయురాలికి చెప్పాడు. టీచర్ వారిని మెచ్చుకొని, 'మీరు చాలా మంచి పని చేశారు' అని చెప్పి ప్రధానోపాధ్యాయులకు విషయం చెప్పారు.

ప్రధానోపాధ్యాయులు నరేష్, సురేష్‌లను అభినందించి వారికి బహుమతులు ఇచ్చారు. తర్వాత అందరు విద్యార్థులను పిలిపించి ఇలా అన్నారు, 'చూడండి పిల్లలు, మేము తరగతి గదిలో చెప్పే మంచి పనులను మీరు మీ నిజ జీవితంలో ఆచరించాలి. చూడండి, నరేష్, సురేష్ తరగతి గదిలో మేడం చెప్పిన వృద్ధులకు సహాయం చేయాలనే అంశాన్ని గుర్తుంచుకుని ఒక ముసలి అవ్వకు సహాయం చేశారు. కాబట్టి మీరందరూ కూడా మీ నిత్య జీవితంలో మంచి పనులు చేయడానికి ముందుండాలి' అన్నారు.

– కె.సంజయ్ కుమార్,
7వ తరగతి,
జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల,
కొండపాక,

వానా ... నీకు వందనం!

నేను నిదురించినపుడు
చడీ చప్పుడు లేకుండా ఎప్పుడు కురిసావో
మా పెరట్లోని మొక్కల దాహం తీర్చావు
గుర్తుంచుకుని బాల్కనీ మొత్తం కడిగావు
నా చిట్టి సైకిలికి స్నానం చేయించావు
పిట్టగోడనూ.. పూల కుండీని ముద్దాడావు
దుమ్ము చెట్టును పచ్చగా మెరిపించావు
కళ్ళు తెరవగానే నా తనువు పై
చల్లదనం కురిపించావు
వానా! నీకు వందనం

– ఎ.సాయి రేఖ శ్రీ,
5వ తరగతి,
సిస్టర్ స్టాంన్లాస్ ఇంగ్లీష్ స్కూలు,
కర్నూలు.

బొమ్మల కొలువు

మనస్విని,
5వ తరగతి,
వికాస్ విద్యా నికేతన్,
కర్నూలు సమ్మర్ క్యాంప్,
99633 50973.

మందడపు జతిస్య,
8వ తరగతి,
జన విజ్ఞాన వేదిక వేసవి శిక్షణా తరగతులు,
తిరువూరు,
ఎన్టీఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

జీవన సౌరభం

ఏమీ లేనప్పుడు ఓపిక, అన్నీ ఉన్నప్పుడు ప్రవర్తన.. మనిషి వ్యక్తిత్వాన్ని పెంచుతాయి.

ఈ డిఇఒకి పిల్లలంటే ప్రాణం..!

జిల్లా విద్యాధికారి అంటే ఊపిరి సలపనంత పని. ప్రతిరోజూ వినతులు, తనిఖీలు, సందర్శనలు, వాట్సప్ ఆన్ చేస్తే వేల సందేశాలు, వివిధ సమస్యలపై విన్నపాలు ... వెంటాడతాయి. ఇవన్నీ ఈ ఉద్యోగంలో సహజమేనంటూ ఆయన ముందుకు సాగుతారు. ఏ పాఠశాలకు వెళ్ళినా చాక్‌పీస్ పట్టుకుని పాఠం చెప్పడమో, మైదానంలోకి వెళ్ళి పిల్లలతో ఆడుకోవడమో, కథలు చెప్పడమో చేస్తారు. వాళ్ళతోపాటు కింద కూర్చుని కబుర్లు చెబుతారు. మధ్యాహ్న భోజన సమయంలో వెళితే– పిల్లలతో పాటే తింటారు. ఆయనే ఎస్.శ్యామ్యూల్ పాల్. కర్నూలు జిల్లా డీఈఓగా తనదైన ప్రత్యేకతతో అందరి మన్ననలు పొందుతున్నారు.

జిల్లా కేంద్రానికి ఏ ఉన్నతాధికారి వచ్చినా, మంత్రులొచ్చినా అందమైన పూల బొకేతో స్వాగతం పలకడం ఆనవాయితీ. ఈ డీఈఓ మాత్రం విద్యార్థులు కాగితాలతో తయారు చేసిన బొకెలతోనే స్వాగతం పలుకుతారు. ఇటీవల సీనియర్ ఐఎఎస్ అధికారి, విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు వస్తే కాగిత పూలబొకేతోనే స్వాగతం పలికారు.

శ్యామ్యూల్ పాల్ కర్నూలు డీఈఓగా బాధ్యతల్లోకి వచ్చిన కొన్ని రోజుల్లోనే నూతన సంవత్సరం వచ్చింది. శుభాకాంక్షలు చెప్పటానికి వచ్చే డిప్యూటీ డీఈఓలు, మండల విద్యాధికారులకూ, హెచ్ఎంలకు, యూనియన్ నాయకులకు ఆయన ముందుగానే వాట్సప్‌లో సందేశం పంపారు. "శుభాకాంక్షలు తెలపడానికి పూలబొకేలు, స్వీట్ డబ్బాలు, పూలదండలు, శాలువాలు వంటివి తేవొద్దు. మీరందరూ శుభాకాంక్షలు తెలిపినట్టే భావిస్తాను. ఇవ్వాలి అనుకుంటే విద్యార్థులకవసరమయ్యే పెన్నులు, ఎగ్జామ్ ప్యాడ్‌లు, జామెట్రీ బాక్స్‌లు, పెన్సిల్ బాక్సులు వంటివి ఇవ్వండి" అనేది ఆ మెసేజ్ సారాంశం. ఆ విధంగానే చాలా విద్యాసామగ్రి వస్తే– గ్రామీణ పాఠశాలలకు పంపించారు. అక్కడి విద్యార్థులకు పంపిణీ చేయించారు. ఇలాంటి సామగ్రి ఏదో ఒక సందర్భంగా డిఈఓ కార్యాలయానికి వస్తూనే ఉంటుంది. వాటిని భద్రపరచి తనను కలవడానికి పిల్లలెవరైనా వస్తే వాళ్ళకిస్తారు డిఇఒ. పిల్లలకేం పనుంటుంది ఆ ఆఫీసులో అనుకోవొచ్చు. కానీ, జిల్లా కేంద్రంలో చదివే ప్రభుత్వ పాఠశాల పిల్లలు ఆయన చాంబర్‌కు వచ్చి తమ పుట్టిన రోజునో, ఫలానా దాంట్లో విజయం సాధించాననో చెబుతారు. వారిని అభినందిస్తూ ఏదో ఒక బహుమతి ఇచ్చి పంపుతారు డిఇఒ. విద్యార్థులు తనను కలవడానికి వస్తే మాత్రం ఎన్ని పనులున్నా వారికి ప్రాధాన్యం ఇస్తారు.

టీచర్లతో ఆత్మీయంగా ...

పాఠశాలలకు వెళ్ళేటపుడో, పాఠశాల ముగిశాకో టీచర్లు టీ స్టాళ్ళ దగ్గర ఆగి సేదదీరుతుంటారు. ఆ సమయంలో శామ్యూల్ పాల్ ఆ దారిలో వెళితే, కారు ఆపించి, టీచర్లతో ఆత్మీయంగా ముచ్చటిస్తారు. మాటల్లో మాటగా పేదపిల్లలకు మంచి విద్యనందించడానికి చేయాల్సిన కృషి గురించి వివరిస్తారు. టీచర్లు చెప్పే సమస్యలను గుర్తు పెట్టుకొని, తన పరిధిలో వాటిని పరిష్కరిస్తారు. ఒక పని అవ్వడానికి ఎంత సమయం పడుతుందో అక్కడే చెబుతారు. స్నేహితుడిగా మాట్లాడే డిఇఒని కలిశాక– టీచర్ల ఆనందానికి అవధులుండవు. సంతోషంగా సెల్ఫీలు దిగుతారు.

విద్యార్థులకు అండగా ...

సీ–బెలగల్ మండలం పోలకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి 28న సైన్స్ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఆవరణలోని చెట్టు కింద ఈ వేడుకలు జరుగుతుండగా, బలమైన ఈదురు గాలి వచ్చింది. పిల్లలు పరుగులు తీసి తరగతి గదుల్లోకి వెళ్ళేలోపు కొంతమందిపై చెట్టు కూలిపోయింది. ఆరుగురు విద్యార్థులకు గాయపడ్డారు. ఎనిమిదో తరగతి విద్యార్థి శ్రీలేఖకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న డీఈఓ విద్యాశాఖ సిబ్బందినంతా సమీకరించి, వెంటనే మెరుగైన చికిత్సకు జిల్లా కేంద్రానికి రప్పించారు. మండల విద్యాధికారిని ఆసుపత్రి వద్దే ఉండి చూడాలని ఆదేశించారు. కానీ, ఆ బాలిక కోలుకోలేక తుదిశ్వాస వదిలింది. తీవ్ర ఆవేదనకు లోనైన డీఈఓ వారి స్వగ్రామానికి వెళ్ళి, ఆ బాలిక అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. ఆ కుటుంబానికి రూ.20 వేల తక్షణ సాయం అందించారు. మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్ళి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా వచ్చేలా చేశారు.

కర్నూలు జిల్లా సుకేశ్వరి గ్రామానికి చెందిన పదో తరగతి బాలిక జి.అనూష పాఠశాలకు వెళుతూ, ఆటో ఢీకొన్న ప్రమాదంలో మరణించింది. శామ్యూల్ రాజ్ వెంటనే తన సిబ్బందిని తీసుకొని ఆసుపత్రి వద్దకు వెళ్లారు. ఆ తల్లిదండ్రులను ఓదార్చి, తక్షణ అవసరాల కోసం తన సొంత సొమ్ము రూ.10 వేలు అందించారు.

కర్నూలు నగరంలోని ఎస్బిఐ కాలనీలో ఉన్న వర్చువల్ స్టూడియో ఏర్పాటు చేశారు. ఆ పనులను పర్యవేక్షించేందుకు డిఈఓ శ్యామ్యూల్ పాల్ వెళ్ళారు. ప్రభుత్వ టౌన్ మోడల్ హైస్కూలు విద్యార్థిని జి.హర్షిణి అక్కడ వేచివుంది. కంప్యూటర్ శిక్షణ, వర్చువల్ క్లాస్ రూమ్ తదితర విషయాలను తెలుసుకునేందుకు వచ్చింది. ఆ బాలికను డిఇఓ ఆత్మీయంగా తన చాంబర్‌కు పిలిచి, మాట్లాడారు. పాఠాలు ఎలా అర్థం అవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఒక తండ్రిలా హర్షిణికి వివరించారు. ఎక్కడికి వెళ్లినా పిల్లల పట్ల ఆయన చూపే ప్రేమ అది.

తప్పు చేస్తే ఊరుకోరు

పిల్లల పట్ల ఇంత శ్రద్ధాసక్తులు, ప్రేమ, బాధ్యత చూపే శ్యామ్యూల్ పాల్ ఆ పిల్లలకు ఏదైనా కీడు జరిగితే ఊరుకోరు. బాలికలపై పాఠశాల సిబ్బంది అసభ్యంగా ప్రవర్తించినట్టు జిల్లాలో నాలుగు చోట్ల నుంచి ఫిర్యాదులొచ్చాయి. కొన్ని గంటల వ్యవధిలోనే వారిని సస్పెండ్ చేశారు డిఇఒ. ఫిర్యాదు అందిన వెంటనే ప్రాథమిక విచారణ నివేదికను వాట్సప్‌కు తెప్పించుకున్నారు. విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, క్రమశిక్షణ లోపించినా కఠినంగా వ్యవహరిస్తారు. ఇటీవల ఒక టీచర్ పాఠశాలకు తాగొచ్చి పిల్లలను కొట్టిన ఘటన సామాజిక మాధ్యమాల్లో వచ్చింది. వెంటనే సస్పెండ్ చేశారు. పదవ తరగతి పరీక్షల్ని ఎక్కడా మాస్‌కాపీయింగ్ జరపకుండా నిర్వహించారు. "ఫలితాల్లో జిల్లా ఏ స్థానంలో ఉన్నా పర్లేదు. కాపీయింగ్ వద్దు. మీకు బాగా తర్ఫీదు ఇవ్వండి చాలు.." అని ఆదేశాలిచ్చారు. గొప్పతరాన్ని నిర్మించాలంటే పరీక్షలు పటిష్టంగా, పారదర్శకంగా ఉండాలని అంటారు ఈ అధికారి. విద్యాశాఖలో అరుదైన డీఈఓగా ముద్ర వేసుకున్న ఎస్.శ్యామ్యూల్ పాల్ అభినందనీయులు.

- ప్రజాశక్తి సాంస్కృతిక విలేకరి, కర్నూలు

కీరవాణిలో అంకితభావం : పవన్

'సల సల మరిగే నీలోని రక్తమే' పాటకు కీరవాణి ప్రాణం పోశారు. ఆ పాటకు మంచి సంగీత, సాహిత్యాలను అందించారు. నేటి పరిస్థితుల్లో మనందరిలో వీరత్వం చేవజారిపోకూడదని చర్నాకోలతో చెప్పినట్లు అనిపించింది. కీరవాణి అందించిన సంగీతం, నేపథ్య సంగీతం ఈ చిత్ర కథలోని భావోద్వేగాలను శిఖరస్థాయికి తీసుకెళ్తాయి. ఈ సినిమా కోసం ఎంత తపన చెంది స్వరాలు అందించారో స్వయంగా చూశాను. సంగీత దర్శకులు చక్రవర్తి దగ్గర శిష్యరికం నుంచి సరస్వతి పుత్రులైన వేటూరి సుందర రామమూర్తి, సిరివెన్నెల సీతారామశాస్త్రి వరకూ తనకున్న అనుబంధాన్ని, సంగీత సాహిత్యాల గురించి చెబుతుంటే సమయం తెలియలేదు. కీరవాణి దగ్గర ఉన్న వయొలిన్లు చూసి వాటి గురించి మాట్లాడుకొంటున్నప్పుడు నేను వయొలిన్ నేర్చుకోవడం, జంట స్వరాల వరకూ నేర్చుకొని వదిలేయడం గుర్తు చేసుకున్నాను. చిదంబర నాథన్ ఇచ్చిన వయొలిన్‌ను ఎంత భద్రంగా దాచుకున్నారో చూపించారు కీరవాణి గారు. తనకు అమితంగా నచ్చిన 32 తెలుగు కథలను ఒక సంకలనంలా చేసుకొన్నారు. వాటిని నాకు బహూకరించడం ఎంతో ఆనందాన్నిచ్చింది. అందులో కీరవాణి రాసిన రెండు కథలు కూడా ఉన్నాయి. ఆయన సరిగమలతో బాణీలు కూర్చే కూర్పరి మాత్రమే కాదు. చక్కటి తెలుగు పదాలతో గీతాలు అల్లగల నేర్పరి కూడా. తన పదాలతో గీత రచయితలకు మార్గం వేస్తారు. తెరపై కనిపించేది రెండున్నర గంటల సినిమాయే. కానీ కీరవాణి రోజుల తరబడి, నెలల తరబడి ఆ సినిమా కోసం తపన పడతారు. సృజనాత్మక స్వరాలతో మైమరపిస్తూ తెలుగు పాటను ఆస్కార్ వేదికపైకి తీసుకువెళ్లారు' అని కథానాయకుడు పవన్‌కళ్యాణ్ అభినందించారు. ఆయన నటించిన 'హరిహర వీరమల్లు' సినిమా జూన్ 12న విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా బుధవారంనాడు మూడోపాట 'సల సల మరిగే నీలోని రక్తమే' అనే పాట విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రయూనిట్ కార్యాచరణ ప్రణాళికపై కూర్చుని సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో పవన్‌కళ్యాణ్, కీరవాణి మధ్య ఆసక్తికరమైన చర్చకూడా జరిగింది. పవన్‌కళ్యాణ్ పై విధంగా స్పందించారు.

'వార్2' టీజర్ విడుదల

ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా 'వార్ 2' చిత్రం నుంచి మంగళవారం టీజర్ విడుదలైంది. 'నా గురించి తెలియదేమో.. ఇప్పుడు తెలుసుకుంటావ్.. గెట్ రెడీ ఫర్ ద వార్' అంటూ ఎన్టీఆర్ డైలాగ్, యాక్షన్ సన్నివేశాలతో ఈ టీజర్‌ని కట్ చేశారు. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కీలక పాత్రల్లో రూపొందుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు అయాన్ ముఖర్జీ దర్శకుడు. కియారా అద్వానీకథానాయిక. ఈ చిత్రం ఆగస్టు 14న విడుదల కానుంది.

'లాయర్' విజయ్ ఆంటోని



విజయ్ ఆంటోని తన 26వ చిత్రం 'లాయర్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'జెంటిల్ ఉమెన్' ఫేమ్ రైటర్ జాషువా సేతురామన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. గ్రిప్పింగ్ కోర్ట్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను తాజాగా విడుదల చేశారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్‌పై ఫాతిమా విజయ్ ఆంటోని నిర్మాణంలో, మీరా విజయ్ ఆంటోని సమర్పణలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ప్రీ–ప్రొడక్షన్ పనులు ఇప్పటికే మొదలైన ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జూన్ 2025 నుంచి ప్రారంభం కానుంది. నటీనటులు, సాంకేతిక బృందం, ఇతర వివరాలను త్వరలో ప్రకటించనున్నారు. ఈ చిత్రం తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

కేన్స్‌లో తెలుగు 'ఎం4ఎం' ప్రదర్శన

2025 కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఓ తెలుగు సినిమా మన ఘనతను ప్రపంచానికి చాటిచెప్పింది. మోహన్ వడ్లపట్ల, జో శర్మ మూవీ మోటివ్ ఫర్ మర్డర్ (ఎం4ఎం. కేన్స్‌లోని ప్రెస్టీజిఎస్ పలాయిస్–సి థియేటర్‌లో ఈ మూవీ రెడ్ కార్పెట్ స్క్రీనింగ్ జరిగింది. ఈ వేడుకకు అంతర్జాతీయ ప్రేక్షకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. తెలుగు చిత్రసీమ తరపున దర్శకుడు మోహన్ వడ్లపట్లతో పాటు అమెరికాకు చెందిన నటి జో శర్మ గౌరవంగా రెడ్ కార్పెట్‌పై మెరిశారు. ప్రదర్శన అనంతరం ప్రేక్షకులు హర్షధ్వానాలు చేయడంతో పాటు, విమర్శకులు, సినీ అభిమానుల నుంచి ప్రశంసలు లభించాయి. ఇది తెలుగు సినిమాకు కేన్స్‌లో దక్కిన అరుదైన ఘనత. ఇటీవల అంతర్జాతీయంగా మంచి గుర్తింపు పొందుతున్న జో శర్మ, ఈ ఈవెంట్‌లో దుబాయ్, ఢిల్లీలోని ప్రముఖ డిజైనర్లు రూపొందించిన దుస్తులు ధరించి మెరిచారు. మోహన్ మీడియా క్రియేషన్స్, మ్యాక్‌విన్ గ్రూప్ యుఎస్ఎ సంయుక్తంగా నిర్మించిన ఎం4ఎం కేన్స్ 2025లో ప్రదర్శించిన ఏకైక తెలుగుచిత్రం. ఈ మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ కథ అంతర్జాతీయ ప్రేక్షకులను ఆకట్టుకుంది. కథన బలంతో పాటు సినిమాటిక్ ప్రెజెంటేషన్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ప్రీమియర్‌కు హాలీవుడ్, బాలీవుడ్, టాలీవుడ్ సహా ప్రపంచ సినీ పరిశ్రమ నుండి పలువురు ప్రముఖులు హాజరై చిత్రానికి అభినందనలు తెలిపారు. త్వరలో ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. భారతీయ ప్రాంతీయ సినిమాకి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చిన సినిమాగా ఎం4ఎం విడుదలకు ముందే అంతర్జాతీయ వేదికలపై ప్రశంసలు అందుకుంటోంది.

'దేవిక అండ్ డానీ' ట్రైలర్ విడుదల

రీతూ వర్మ ప్రధాన పాత్రలో తెరకెక్కించిన వెబ్ సిరీస్ 'దేవిక అండ్ డానీ'. ఈ సిరీస్‌కు బి.కిషోర్ దర్శకత్వం వహించారు. ఈ వెబ్ సిరీస్‌ను రొమాంటిక్ క్రైమ్‌థ్రిల్లర్‌గా తెరకెక్కించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సిరీస్ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఓటీటీలోనే విడుదల కానుంది. ట్రైలర్‌ను నిర్మాతలు విడుదల చేశారు. 'ఎవడు భయపెట్టినా.. ఎంత ప్రమాదమైనా రానీ.. వెనకడుగు వేసేదే లేదు'.. అని రీతూ వర్మ చెప్పే డైలాగ్ అభిమానుల్లో మరిన్ని అంచనాలు పెంచేసింది. జియో హాట్‌స్టార్ వేదికగా ఈ సిరీస్ జూన్ 6 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ వెబ్ సిరీస్‌లో సూర్య వశిష్ఠ, శివ కందుకూరి, సుబ్బరాజు, కోవై సరళ, సోనియా సింగ్, గోపరాజు రమణ, శివన్నారాయణ, వైవా హర్ష, షణ్ముఖ్, అభినయ శ్రీ, మౌనిక రెడ్డి, ఐశ్వర్య కీలక పాత్రలు పోషించారు.

అహ్మదాబాద్‌లో ఐపిఎల్ ఫైనల్

- ముల్లాన్‌పూర్‌లో క్వాలిఫయర్1, ఎలిమినేటర్
- సన్‌రైజర్స్, ఆర్‌సీబీ మ్యాచ్ వేదిక మార్పు

ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) 18వ సీజన్ ప్లే ఆఫ్స్‌లో నాలుగు మ్యాచులకు వేదికలను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) రెండు వేదికలను ఖరారు చేసింది. అహ్మదాబాద్, ముల్లాన్‌పూర్ (న్యూ చండీగఢ్)లు ప్లే ఆఫ్స్ మ్యాచులకు ఆతిథ్యం అందిస్తాయని బిసిసిఐ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఐపిఎల్18వ ప్లే ఆఫ్స్‌కు వాస్తవంగా కోల్‌కత, హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వాలి. భారత్, పాకిస్థాన్ సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ఐపిఎల్‌కు వారం రోజుల వాయిదా అనివార్యం కాగా.. రీ షెడ్యూల్‌లో హైదరాబాద్, కోల్‌కతను పరిగణనలోకి తీసుకోలేదు. కోల్‌కత, హైదరాబాద్‌లో ఈ సమయంలో వర్షాలు కురిసే అవకాశం అధికంగా ఉంటుందని ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది!. జూన్ 3న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో టైటిల్ పోరు జరుగనుండగా.. క్వాలిఫయర్2 సైతం జూన్ 1న అక్కడే జరుగనుంది. క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచులు మే 29, 30న ముల్లాన్‌పూర్‌లో జరుగనున్నాయి. ఈ మేరకు ఐపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. 'వాతావరణ పరిస్థితులు సహా ఇతర కొలమానాలను పరిగణనలోకి ప్లే ఆఫ్స్ వేదికలను ఎంపిక చేశామని' బిసిసిఐ ఓ ప్రకటనలో తెలిపింది.

వేదిక మారింది : ఐపిఎల్‌లో మరో మ్యాచ్ వేదికను మార్పు చేస్తూ బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. ఐపిఎల్ పున ప్రారంభ మ్యాచ్ బెంగళూర్‌లో షెడ్యూల్ చేయగా.. భారీ వర్షంతో టాస్ కూడా సాధ్యపడలేదు. కోల్‌కత నైట్‌రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మ్యాచ్ రద్దుగా ముగిసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ గ్రూప్ దశ మ్యాచ్ ఈ శుక్రవారం బెంగళూర్‌లోని చిన్నస్వామి స్టేడియంలోనే షెడ్యూల్ చేశారు. కానీ బెంగళూర్‌లో నిలకడగా భారీ వర్షాలు కురుస్తుండగా.. వాతావరణ శాఖ 'ఎల్లో' అలర్ట్ సైతం జారీ చేసింది. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్, రాయల్ చాలెంజర్స్ మ్యాచ్ వేదికను బెంగళూర్ నుంచి లక్నోకు మార్చారు. వర్షాలతో ఇండర్ ప్రాక్టీస్‌కు పరిమితమైన ఆర్‌సీబికి.. ప్రాక్టీస్ సెషన్‌కు సన్నద్ధమవుతుండగా ఐపిఎల్ నిర్వాహకులు ఈ సమాచారం అందించగా.. లక్నో సూపర్‌జెయింట్స్‌తో మ్యాచ్‌ను ముగించుకుని మంగళవారం సాయంత్రం బెంగళూర్‌కు బయల్దేరుతున్న ఆరెంజ్ ఆర్మీకి మధ్యాహ్న సమయంలో సమాచారం అందించారు. దీంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్ల లక్నోలో ఉండిపోయారు. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ గ్రూప్ దశలో చివరి రెండు మ్యాచులను లక్నోలోనే ఆడనుంది. 23న హైదారాబాద్‌తో, 27న సూపర్‌జెయింట్స్‌తో బెంగళూర్ ఆడనుంది. ఈ రెండు మ్యాచులు లక్నోలో జరుగనుండటంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ పాయింట్ల పట్టికలో టాప్–2 నిలిచే అవకాశాలకు గండి పడలేదు.

120 నిమిషాల అదనం : ఐపిఎల్ షెడ్యూల్, ప్లే ఆఫ్స్ వేదికలతో పాటు ప్లేయింగ్ కండిషన్స్‌లో సైతం బీసీసీఐ పలు మార్పులు చేసింది. ఐపిఎల్ 2025 వారం రోజుల విరామం తర్వాత మళ్లీ మొదలవటం,దేశవ్యాప్తంగా వర్షాలు కురవటం ప్రారంభవటంతో గ్రూప్ దశ మ్యాచులను ముగించేందుకు అదనంగా 120 నిమిషాల సమయాన్ని కేటాయించారు. దీంతో మధ్యాహ్నం మ్యాచ్ వర్షం ప్రభావంతో సాయంత్రం 5.30 గంటలకు మొదలైనా.. సాయంత్రం మ్యాచ్ వర్షంతో రాత్రి 9.30 గంటలకు షురూ అయినా ఓవర్లను కుదించకుండా 20 ఓవర్ల మ్యాచ్‌ను ఆడిస్తారు. కనీసం 5 ఓవర్ల మ్యాచ్‌కు మధ్యాహ్నం మ్యాచ్‌కు రాత్రి 7.56 గంటలు.. సాయంత్రం మ్యాచ్‌కు రాత్రి 11.56 గంటలకు తుది గడువు కానుంది. ఐపీఎల్18లో వర్షం కారణంగా ఇప్పటివరకు మూడు మ్యాచులు రద్దుగా ముగియగా, రెండు మ్యాచుల్లో ఓవర్లను కుదించారు. ఈడెన్‌గార్డెన్స్‌లో పంజాబ్ కింగ్స్, కోల్‌కత నైట్‌రైడర్స్ మ్యాచ్.. ఉప్పల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్... బెంగళూర్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్, కోల్‌కత నైట్‌రైడర్స్ మ్యాచ్ వర్షంతో తుడిచిపెట్టుకుపోయాయి.

విజయంతో ముగింపు

- చెన్నైపై రాజస్తాన్ రాయల్స్ గెలుపు
- సూపర్‌కింగ్స్ 187/8, రాయల్స్ 188/4

న్యూఢిల్లీ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)18ను రాజస్తాన్ రాయల్స్ విజయంతో ముగించింది. మంగళవారం న్యూఢిల్లీలో చెన్నై సూపర్‌కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. సూపర్‌కింగ్స్ నిర్దేశించిన 188 పరుగుల లక్ష్యాన్ని రాయల్స్ 17.1 ఓవర్లలోనే ఛేదించింది. యువ ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (36, 19 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులు), వైభవ్ సూర్యవంశీ (57, 33 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సులు) మరోసారి మెరుపు ఆరంభాన్ని అందించగా.. కెప్టెన్ సంజు శాంసన్ (41, 31 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) కీలక ఇన్నింగ్స్ నమోదు చేశాడు. రియాన్ పరాగ్ (3) నిష్క్రమణతో రాయల్స్ కష్టాల్లో పడేలా కనిపించింది. ఈ సీజన్లో అలవోక ఛేదనలను ఆఖర్లో సంక్లిష్టం చేసుకుని పరాజయాలు చవిచూసిన రాజస్తాన్ రాయల్స్.. ఆఖరు మ్యాచ్‌లో ఆ పొరపాటు చేయలేదు. ధ్రువ్ జురెల్ (31 నాటౌట్, 12 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులు), షిమ్రోన్ హెట్‌మయర్ (12 నాటౌట్, 5 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ధనాధన్ జోరుతో మరో 17 బంతులు ఉండగానే రాయల్స్ లాంఛనం ముగించింది. 14 మ్యాచుల్లో నాలుగు విజయాలు సాధించిన రాయల్స్ పాయింట్ల పట్టికలో 9వ స్థానంలో నిలువగా.. 13 మ్యాచుల్లో 3 విజయాలతో సూపర్‌కింగ్స్ పదో స్థానంలో ఉంది.

రాణించిన అయుశ్, డెవాల్డ్ : తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 187 పరుగులు చేసింది. యువ ఓపెనర్ అయుశ్ మాత్రె (43, 20 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్), మిడిల్ ఆర్డర్ బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్ (42, 25 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులు) రాణించారు. అయుశ్ పవర్‌ప్లేలో ధనాధన్ ఇన్నింగ్స్‌తో మెరిసినా.. డెవాన్ కాన్వే (10), ఉర్విల్ పటేల్ (0), రవిచంద్రన్ అశ్విన్ (13), రవీంద్ర జడేజా (1) తేలిపోయారు. డెవాల్డ్ బ్రెవిస్ ఎదురుదాడితో రాయల్స్ బౌలర్లపై ఒత్తిడి పెంచాడు. శివం దూబె (39, 32 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులు) ఆశించిన వేగంతో పరుగులు చేయలేదు. ఎం.ఎస్ ధోని (16) మందకోడి ఇన్నింగ్స్‌తో నిరాశపరిచాడు. దీంతో సూపర్‌కింగ్స్ 187 పరుగులే చేసింది. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో యుధ్‌వీర్ సింగ్ (3/47), ఆకాశ్ మధ్వాల్ (3/29) మూడు వికెట్ల ప్రదర్శనతో రాణించారు. చెన్నై సూపర్‌కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68